PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 258 | విజయవాడ, శుక్రవారం 21 ఏప్రిల్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Friday21 April 2023 | Rs

క్యూబా అధ్యక్షుడిగా కానెల్ తిరిగి ఎన్నిక

● లోపలి పేజీలో.. ●

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాలిసెట్-2023 ప్రవేశ పరీక్ష రాయనున్న విద్యార్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు సాంకేతిక విద్య కమిషనరు సిహెచ్ నాగరాణి వెల్లడించారు. యువతను పాలిటెక్నిక్ విద్య వైపు మళ్లించే చర్యల్లో భాగంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో శిక్షణ అందిస్తున్నామని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17 నుంచి మొదటి బ్యాచ్‌కు శిక్షణ ప్రారంభమైందని, 24వ తేదీ నుంచి మరో బ్యాచ్‌కు అవకాశం ఉందని పేర్కొన్నారు. స్టడీ మెటీరియల్ కూడా ఉచితంగానే అందిస్తామన్నారు. పదో తరగతి విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తూ.. రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మే 10న జరగనున్న పాలిసెట్ పరీక్షకు సుమారు 1,50,000 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 61 పట్టణాల్లో 410 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈ నెల 30 వరకు పరీక్షకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు.

29 సంస్థలు ఆసక్తి

- వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఇఒఐ గడువు పూర్తి
- కేంద్రం మెలికతో తెలంగాణ ప్రభుత్వం వెనక్కి!
- ఎపి, తెలంగాణ, సెయిల్, ఎన్‌ఎండిసి పాల్గొనాలి : పోరాట కమిటీ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ, హైదరాబాద్ బ్యూరో

ముడిసరుకు (ఐరన్ ఓర్, కోల్) లేదా వర్కింగ్ క్యాపిటల్ (డబ్బు) అడ్వాన్స్‌గా ఇస్తే దానికి బదులుగా స్టీల్‌ను ఉత్పత్తి చేసి ఇస్తామని, అందుకు ఆసక్తి కనబరచాలని పేర్కొంటూ స్టీల్ యాజమాన్యం ఇటీవల పిలిచిన బిడ్లకు 29 టెండర్లు దాఖలయ్యాయి. వాస్తవానికి ఈ నెల 15న తుది గడువు కాగా ఎక్కువ కంపెనీలు ఆసక్తి చూపుతున్నందున, మరో ఐదు రోజులు పొడిగించాలని తెలంగాణకు చెందిన సింగరేణి కంపెనీ ప్రతినిధులు స్టీల్ యాజమాన్యాన్ని కోరగా ఈ నెల 20 వరకు గడువు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నెల 15 వరకూ 22 కంపెనీలు టెండర్లు వేయగా ఈ ఐదు రోజుల్లో మరో ఏడు కంపెనీలు బిడ్లు వేశాయి. వాటిలో ఆరు విదేశీ సంస్థలున్నాయి. తెలంగాణ ప్రభుత్వం నుంచి ఒక బిడ్ కచ్చితంగా దాఖలవుతుందని అందరూ భావించినప్పటికీ... బిడ్‌ను మాత్రం వేయలేదు.

కేంద్రం మెలిక

బిడ్డింగ్‌లో పాల్గొనేందుకు (ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్) ముందుకొచ్చిన తెలంగాణ ప్రభుత్వానికి కేంద్రం ప్రభుత్వం మోకాలడ్డింది. సింగరేణి కాలరీస్ సంస్థ ద్వారా బిడ్డింగ్ వేయాలంటే కేంద్ర ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అని మెలిక పెట్టినట్లు తెలిసింది. కేంద్ర ప్రభుత్వ పెద్దలు స్వయంగా జోక్యం చేసుకుని.. ఇకపై ముందుకెళ్లవద్దని సింగరేణి ఉన్నతాధికారులను హెచ్చరించినట్లు విశ్వసనీయ సమాచారం. బిడ్డింగ్‌కు సంబంధించి తెలంగాణ ఉన్నతాధికారులు కేంద్ర పెద్దలను సంప్రదించేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమైనట్లు తెలిసింది. దీంతో చేసేదేమీలేక తెలంగాణ ప్రభుత్వం వెనక్కి తగ్గినట్టు సమాచారం. కాగా, బిడ్డింగ్‌లో పాల్గొంటామని ప్రకటించిన సిఎం కెసిఆర్..బిడ్డింగ్ సమర్పణకు గడువు ముగిసిన తర్వాత కూడా స్పందించలేదు. ఈ విషయంపై మాట్లాడేందుకు సిఎంఒ అధికారులు కూడా ఆసక్తి చూపలేదు.

మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌ను పనిలోకి తేవాలనే ఇఒఐ

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లో రెండు మాత్రమే పనిచేస్తున్నాయి. ఇవి కూడా పూర్తి సామర్థ్యంతో పని చేయడం లేదని కార్మికులు చెబుతున్నారు. సాలీనా 25 లక్షల టన్నుల ద్రవపు ఉక్కును ఉత్పత్తి చేసే మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌కు 15 నెలలుగా కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ రా మెటీరియల్‌ను ఇవ్వకుండా.. పనిచేయనివ్వకుండా షట్‌డౌన్ చేసేసింది. ఈ క్రమంలోనే వైజాగ్ స్టీల్ యాజమాన్యం ఏదో ఒకలాగ ఈ ఫర్నేస్‌ను పనిలోకి తేవాలని ఇఒఐ ద్వారా తాజాగా బిడ్లను ఆహ్వానించింది. ఇఒఐ ప్రకారం ఆసక్తి చూపిన సంస్థలు మే మొదటి వారంలో టెండర్ల దాఖలులో పాల్గొనాలని రూల్స్ ఏమీ లేవని తెలుస్తోంది. అలాగే కొత్త సంస్థలు ఈ టెండర్లలో పాల్గొన్నా సరే అభ్యంతరాలేమీ ఉండవన్నది నిబంధనల్లో పేర్కొనడం గమనార్హం.

మరో అవకాశముంది : పరిరక్షణ పోరాట కమిటీ

స్టీల్‌ప్లాంట్ ఇఒఐలో పాల్గొనకపోయినా మే మొదటి వారంలో టెండర్ల ప్రక్రియలో నేరుగా పాల్గొనవచ్చని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో - కన్వీనర్ జె.అయోధ్యరామ్ బుధవారం సాయంత్రం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎపి ప్రభుత్వం, తెలంగాణ, అలాగే ప్రభుత్వ రంగ సంస్థలైన ఎన్‌ఎండిసి, సెయిల్ అప్పుడు టెండర్లలో పాల్గొనాలని కోరారు. ప్రస్తుతం దాఖలైన టెండర్లలో విదేశీ సంస్థలకు రెండో ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థలు దాఖలు చేస్తే వారినే పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జెఎస్‌డబ్ల్యు లాంటి స్వదేశీ సంస్థలకు రా మెటీరియల్ సరఫరాకి ఇచ్చినా సరే స్టీల్‌ప్లాంట్ మార్కెటింగ్ నెట్‌వర్క్‌ను వాడుకుని నష్టపరిచే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

పండగ వేళ పెను విషాదం

- యెమెన్ రాజధాని సానాలో తొక్కిసలాట
- 85 మంది మృతి, 300 మందికి పైగా గాయాలు

సానా : యెమెన్‌లో పండగ వేళ పెను విషాదం సంభవించింది. ఈద్ ఉల్ ఫితర్ పండగ సందర్భంగా రాజధాని సానాలో నిర్వహించిన ఆర్థిక సహాయం పంపిణీ కార్యక్రమంలో తొక్కిసలాట జరిగి 85 మంది మరణించారు. 300 మంది పైగా గాయ పడ్డారు. ప్రస్తుతం సానా హౌతీస్ సాయుధ గ్రూప్ ఆధీనంలో ఉంది. వీరు వెల్లడించిన వివరాల ప్రకారం గురువారం సనాలోని ఓ పాఠశాలలో ఛారిటీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కొంత మంది వ్యాపారులు ఆర్థిక సహాయం పంపిణీ చేస్తుండగా ఒక్కసారిగా తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో 85 మందికి పైగా మరణించగా, 322 మంది గాయపడ్డారు. ఈ ఘటనతో ఆ ప్రాంతమంతా రక్తపు మరకలతో నిండిపోయింది. మృతదేహాలు, చెల్లాచెదురు గా పడి ఉన్న బూట్లు, దుస్తులతో ఆ ప్రాంతమంత భయం గొలుపుతోంది. ప్రత్యక్ష సాక్షి అబ్దుల్ రహమాన్ మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం భారీగా వచ్చిన ప్రజలను నియంత్రించడానికి గాలిలోకి కాల్పులు జరిపారు. అవి పైన ఉన్న విద్యుత్ తీగలకు తగలడంతో మంటలు వచ్చాయి. ఇది ప్రజల్లో భయాందోళనలు దారి తీసి తొక్కిసలాట సంభవించింది. ఈ ఘటనకు బాధ్యులైన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు హౌతీస్ అంతర్గత మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. ఈ ఘటనపై దర్యాప్తునకు ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు హౌతీ తిరుగుబాటుదారుల రాజకీయ చీఫ్ మహదీ అల్ మషత్ తెలిపారు.

మరో 'క్లీన్‌-చిట్'

- నరోడా మారణకాండ నిందితులందరికీ విముక్తి
- గుజరాత్‌లో మత ఘర్షణల దారుణాల్లో ఇదొకటి
- నాటి ఊచకోతలో 11 మంది హత్య

అహ్మదాబాద్ : గుజరాత్‌లో గోద్రా ఘటన అనంతరం చెలరేగిన మత ఘర్షణల్లో ఒకటైన నరోడా గ్రామంలో జరిగిన ఊచకోత కేసులో నిందితులందరికీ క్లీన్‌చిట్ లభించింది. నాటి మారణకాండలో ఈ ఒక్క ఘటనలోనే 11 మంది ముస్లింలు హత్యకు గురయ్యారు. ఈ నరోడా గామ్ కేసులో బిజెపి నాయకురాలు, అప్పటి రాష్ట్ర మంత్రి మాయా కొద్నానీ, బజరంగ్‌దళ్ నాయకుడు బాబూ బజరంగి, విశ్వ హిందూ పరిషత్ (విహెచ్‌పి) మాజీ నేత జైదీప్ పటేల్ సహా 60 మంది నిందితులకు క్లీన్‌చిట్ ఇస్తూ అహ్మదాబాద్‌లోని ప్రత్యేక కోర్టు గురువారం తీర్పు ఇచ్చింది.

గోద్రా రైలు ప్రమాదం అనంతరం గుజరాత్ రాష్ట్రమంతటా ముస్లింలను లక్ష్యంగా చేసుకొని హిందుత్వ మతోన్మాదులు మారణకాండకు తెగబడ్డారు. ఇదే క్రమంలో నరోడా గ్రామంలోనూ మతోన్మాదులు రెచ్చిపోయారు. గ్రామంలో ముస్లిం ఇళ్లను తగులబెట్టారు. ఈ దారుణ హింసాకాండలో 11 మంది ముస్లింలు హత్యకు గురయ్యారు. ఈ కేసులో సాక్షిగా ప్రస్తుత కేంద్ర హోం మంత్రి అమిత్ షా 2017లో కోర్టుకు హాజరయ్యారు. 2002లో ముఖ్యమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని గుజరాత్ ప్రభుత్వంలో కొద్నానీ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేశారు. ఆమెకు నరోడా పటియా మత ఘర్షణల కేసులో న్యాయస్థానం 28 సంవత్సరాలు జైలుశిక్ష విధించగా మిగతా 7లో

వలస, అసంఘటిత కార్మికులకు మూడు నెలల్లో రేషన్ కార్డులు

● లోపలి పేజీలో..●

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సిఎం జగన్

అంగన్‌వాడీలపై నిరంతర పర్యవేక్షణ

- అధికారులకు సిఎం ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

క్రమం తప్పకుండా అంగన్‌వాడీలపై పర్యవేక్షణ ఉండాలని అధికారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఎప్పటికప్పుడు అంగన్‌వాడీ సెంటర్లను పరిశీలిస్తూ.. అక్కడ పరిస్థితులను మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖపై ముఖ్యమంత్రి గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 45 వేల అంగన్‌వాడీ సెంటర్లలో ప్రాధాన్యతా క్రమంలో పనులు చేయాలని తెలిపారు. ఏయే సదుపాయాలు ఉన్నాయి, కల్పించాల్సినవి ఏమిటి అన్న అంశాలపైనా సచివాలయాల ద్వారా సమాచారం తెప్పించుకోవాలని సూచించారు. పిల్లల ఎదుగుదలను పర్యవేక్షించే పరికరాలను కూడా అంగన్‌వాడీల్లో ఉంచుకోవాలని పేర్కొన్నారు. గ్రోత్ మానిటరింగ్ ఎక్విప్‌మెంట్‌ను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమశాఖలోని ఖాళీలను కూడా భర్తీ చేయాలని, సంపూర్ణ పోషణ కింద పంపిణీ ప్రక్రియకు సమర్థవంతమైన ఎస్‌ఒపి రూపొందించాలని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా అంగన్‌వాడీలపై పర్యవేక్షణ జరగాలని, అలాగే సూపర్‌వైజర్ల పైనా పర్యవేక్షణ పకడ్బందీగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీ చరణ్, ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, ఆర్థికశాఖ కార్యదర్శి కెవివి సత్యనారాయణ, పాఠశాల విద్యాశాఖ కమిషనరు కాటమనేని భాస్కర్, సివిల్ సప్లయి కార్పొరేషన్ ఎమ్‌డి వీరపాండ్యన్ తదితరులు పాల్గొన్నారు.

'వెలిగొండ' పూర్తి చేస్తాం

- పరిశ్రమల స్థాపనతో ఉపాధి కల్పన
- మార్కాపురం సభలో చంద్రబాబు హామీలు

చిన్నారులతో కలిసి కేక్ కట్‌చేస్తున్న చంద్రబాబు

ప్రజాశక్తి- మార్కాపురం

పశ్చిమ ప్రకాశం అత్యంత వెనుకబాటులో ఉన్నమాట వాస్తవమేనని టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రాబోతోందని, వెనుకబాటు తనాన్ని పోగొట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రకాశం జిల్లా మార్కాపురం ప్రాంతాన్ని రాబోవు కాలంలో అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎస్‌వికెపి కళాశాల మైదానంలో జరిగిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడారు. 1996లో కరువును పారద్రోలేందుకు వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. అటవీ అనుమతులు కూడా తానే తెచ్చానని చెప్పారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చే సరికి 95 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిపోయిన ఐదు శాతం పనులను నాలుగేళ్లలో పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. వెలిగొండ పూర్తి చేస్తే బాధ్యత తనదేనన్నారు. మార్కాపురాన్ని జిల్లాగా చేస్తామని ప్రకటించారు. దీంతో పాటు పరిశ్రమల స్థాపనకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగ సమస్యను అధిగమిస్తామని, నిరుద్యోగులకు భృతి కల్పిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ. 64 వేల కోట్లు ఖర్చు పెట్టి 24 ప్రాజెక్టులు పూర్తి చేశానని చెప్పారు. అమరావతి, పోలవరం, పరిశ్రమల ద్వారా ఎపిని 2029కి భారత దేశంలో నెంబర్ 1 రాష్ట్రంగా చేయాలని కల కన్నానన్నారు. కానీ 2019 నుంచి రాష్ట్రానికి సైతాన్ పట్టింది.... దీంతో రాష్ట్రం నాశనం అయ్యిందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపిని చిత్తుగా ఓడించాలన్నారు.

పేదలను కోటీశ్వరులను చేస్తా

పేద ప్రజలను కోటీశ్వరులను చేయడమే తన సంకల్పం అని మహిళలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో చంద్రబాబు అన్నారు. ప్రపంచంలో తెలుగు వారు ఎక్కడున్నా... ఏ రంగంలో ఉన్నా... నంబర్-1 స్థానంలో నిలవాలన్నది తొలి సంకల్పం అని, తెలుగు ప్రజల్లో ఉండే పేద తరగుతులందరూ కోటీశ్వరులు కావాలన్నది రెండో సంకల్పం అని వివరించారు. అనుభవం, విజన్, టెక్నాలజీ వాడుకోవడం, సంపన్నులు తోటి వారికి సాయం చేయడం, ప్రజల మద్దతుతో ఈ కలను సాకారం చేసుకోవచ్చుని చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఐడియాలజీ కాన్సెప్ట్‌ను చంద్రబాబు నాయుడు వేదికపై సాధారణ మహిళలు, పిల్లలతో కలిసి విడుదల చేశారు.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

చంద్రబాబునాయుడు 73వ పుట్టిన రోజు వేడుకలను మార్కాపురంలో జరుపుకున్నారు. మహిళలు, చిన్నారుల నడుమ 73 కిలోల కేక్‌ను చంద్రబాబు కట్ చేశారు. చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు చెప్పేందుకు ఆ పార్టీకి చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు రాష్ట్రం నలుమూలల నుంచీ తరలివచ్చారు.

రాజ్‌నాథ్‌సింగ్‌కు కోవిడ్ పాజిటివ్



న్యూఢిల్లీ : కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కరోనా బారిన పడ్డారు. ఆయనకు స్వల్ప లక్షణాలు ఉండటంతో గురువారం నాడు కోవిడ్ పరీక్షలు నిర్వహించగా, పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. వైద్యుల సూచన మేరకు ఆయన ప్రస్తుతం హోం క్వారంటైన్‌లో విశ్రాంతి తీసుకుంటున్నారు. భారత వాయుసేన కమాండర్ల సమావేశంలో గురువారం ఆయన పాల్గొనాల్సివుంది. కోవిడ్ పాజిటివ్‌గా తేలడంతో ఈ కార్యక్రమానికి మంత్రి దూరంగా ఉన్నారు. చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ మనోజ్ పాండేతో కలిసి ఆర్మీ కమాండర్స్ కాన్ఫరెన్స్‌లో మంత్రి బుధవారం పాల్గొన్న సంగతి తెలిసిందే. మరోవైపు దేశంలో కరోనా కేసులు పెరుగుతున్నాయి. గురువారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 12,591 కోవిడ్ కేసులు నమోదయ్యాయి. 40 మంది మరణించారు. గత ఎనిమిది నెలల్లో ఇంత భారీ సంఖ్యలో కేసులు వెలుగుచూడటం ఇదే మొదటిసారి.

బిజెపితో దేశానికి ప్రమాదం

- మోడీని గద్దె దింపేందుకు అన్ని పార్టీలూ కలిసి రావాలి
- ప్రచార భేరిలో సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శుల పిలుపు

సమావేశంలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు, వేదికపై రామకృష్ణ తదితరులు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి (తిరుపతి)

రానున్న ఎన్నికల్లో బిజెపిని ఇంటికి సాగనంపడానికి అన్ని రాజకీయ పార్టీలూ, ప్రజలు కలసి రావాలని సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, రామకృష్ణ పిలుపునిచ్చారు. వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులు అందుకు నడుం బిగించాలన్నారు. 'నిరంకుశ, మతోన్మాద బిజెపిని సాగనంపుదాం- దేశాన్ని కాపాడుకుందాం' అనే నినాదంతో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు చేపట్టిన ప్రచారభేరి బహిరంగ సభ గురువారం సాయంత్రం తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణం అంబేద్కర్ సర్కిల్ వద్ద జరిగింది. ఈ బహిరంగ సభకు సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు శ్రీనివాసరావు, రామకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి అనంతరం బహిరంగ సభనుద్దేశించి మాట్లాడారు. మోడీ ప్రభుత్వం హిందుత్వ కార్పొరేట్ కూటమనీ, ఓ వైపు దేశాన్ని హిందూ రాష్ట్రంగా మార్చాలని ప్రయత్నిస్తూనే మరో వైపు కార్పొరేట్లకు కొమ్ముకాస్తోందని విమర్శించారు. ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందుతుందని అన్నారు. దళితులు, ముస్లిం మైనార్టీలకు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్లపై అదనపు పన్నులు వేయకుండా సామాన్య ప్రజలపై పన్నుల భారాలు మోపుతున్నారన్నారు. తిరుపతి వెంకన్న సాక్షిగా ఎపికి ప్రత్యేక హోదా, వెనకబడ్డ జిల్లాలకు స్పెషల్ ప్యాకేజీ హామీని మోడీ ప్రభుత్వం తుంగలో తొక్కిందని విమర్శించారు.

రాష్ట్రంలో వెనుకబడ్డ ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల అభివృద్ధికి కేటాయిస్తామన్న నిధులు ఏమైపోయాయని ప్రశ్నించారు. మన రాష్ట్రానికి తలమానికమైన విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేస్తున్నారనీ, కడప స్టీల్ ఫ్యాక్టరీని అడ్డుకుంటున్నారనీ, రేణిగుంట ఎయిర్‌పోర్టును అమ్మకానికి పెట్టారని, మన్నవరం బెల్ ఫ్యాక్టరీని గుజరాత్‌కు తరలిస్తున్నారని తెలిసినా జగన్ ప్రభుత్వం ఎందుకు మౌనం వహిస్తుందో ప్రజలు తెలుసుకోవాలన్నారు. ప్రత్యేక హోదా నిరాకరించి, విభజన హామీలను తుంగలో తొక్కి రాష్ట్రానికి తీవ్ర హాని కలిగిస్తున్న బిజెపి కేంద్ర ప్రభుత్వం పట్ల అటు వైసిపి, ఇటు టిడిపి, జనసేన మౌనం వహించడాన్ని ప్రజలు ప్రశ్నించాలని వారు కోరారు. సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వి.నాగరాజు, పి. మురళి, నాయకులు రామానా యుడు, అంగేరి పుల్లయ్య, జయలక్ష్మి, జనార్ధన్, పెంచలయ్య, రాధాకష్ణ, నళిని, అజయ్, జనమాల గురవయ్య, గంధం మణి తదితరులు పాల్గొన్నారు.

పూంచ్‌లో ఉగ్రదాడి

- గ్రనేడ్లతో ట్రక్కు పేల్చివేత
- ఐదుగురు సైనికులు మృతి, మరొకరికి తీవ్రగాయాలు

న్యూఢిల్లీ : జమ్ముకాశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో ఉగ్రవాదులు సైనిక వాహనంపై గ్రనేడ్లతో విరుచుకుపడ్డారు. దీంతో ఆర్మీ వాహనం తగలబడి అందులోని సైనికుల్లో ఐదుగురు సజీవ దహనమయ్యారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పూంచ్ జిల్లా బింభేర్ గలి నుంచి సాంగియోట్ వైపు ట్రక్ వెళుతుండగా గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయం లో రాజౌరి సెక్టార్ వద్ద ఈ ఉగ్రదాడి చోటుచేసుకుంది. భారీ వర్షాలు, లో విజిబులిటీ వంటి పరిస్థితులను అనుకూలంగా చేసుకున్న ఉగ్రవాదులు గ్రనేడ్లతో మెరుపుదాడికి దిగారని సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ దాడిలో ట్రక్ మంటల్లో చిక్కుకుందని తెలిపింది. ఈ దాడిలో తీవ్ర గాయాలపాలైన ఒక సైనికుడిని చికిత్స కోసం రాజౌరిలోని సైనిక ఆస్పత్రికి తరలించారు. అమరులైన సైనికులందరూ రాష్ట్రీయ రైఫిల్స్ యూనిట్‌కు చెందినవారు. ఈ ఘటనపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

యాక్షన్ ప్లాన్‌కు నిధులు కరువు

రూ.95 కోట్లు లేక పక్కనబెట్టిన ప్రభుత్వం

పాడేరులో బావి పూడికతీతకూ నిధుల కటకట

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఒకవైపు వేసవి తీవ్రత పెరుగుతోంది. పలుచోట్ల రెండు రోజులకు ఒకసారి నీటిని సరఫరా చేస్తున్నారు. ఏప్రిల్ 15 నాటికే ఉష్ణోగ్రత 44 డిగ్రీలకు చేరుకుంది. మే నెలలో తీవ్రత మరింత పెరిగి పలు జిల్లాల్లో నీటి వనరులు పూర్తిగా ఎండిపోయే ప్రమాదముంది. వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులు అంచనాలు రూపొందించారు. నీటి సరఫరాకు, బోర్లు బాగుచేసేందుకు, పశువుల నీటి సరఫరాకు సుమారు రూ.95 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మార్చిలోనే దీన్ని ప్రభుత్వానికి పంపించినా ఇంతవరకు అమలుకు నోచలేదు. నిధులు ఇస్తున్నామా లేదా అనేది స్పష్టత ఇవ్వలేదు. రాష్ట్రంలో ఈ ఏడాది 26 జిల్లాల ప్రాతిపదికన ప్లాను రూపొందించారు. వీటిల్లో 16 జిల్లాల్లో సమస్య తీవ్రంగా ఉంటుందని అంచనా వేశారు. వేసవిలో 3,720 నివాస ప్రాంతాలకు (హ్యాబిటేషన్స్) ట్యాంకుల ద్వారా నీటి సరఫరాకు రూ.82.36 కోట్లు అవసరం ఉంటుందని లెక్కగట్టారు. 521 గ్రామాల్లో మనుషులతోపాటు ఆవులూ, గేదెలకూ నీటిని అందించాలని ప్రతిపాదించారు. దీనికోసం రూ.3.10 కోట్లు ఖర్చవుతుందని తేల్చారు. అవసరమైన నీటిని ప్రైవేటు వ్యక్తులకు సంబంధించి బోర్లు, బావుల నుండి కొనుగోలు చేసేందుకు రూ.5 కోట్లు అవసరమని తెలిపారు. పాడైపోయిన 1,061 బోర్లు బాగుచేసేందుకు రూ.1.91 కోట్లు, 718 బోర్లు లోతు పెంచేందుకు రూ.5.25 కోట్లు అవసరం ఉంటుందని తేల్చారు. ముఖ్యంగా పాడేరు ప్రాంతంలో బావి పూడికతీతకు రూ.2 కోట్ల వరకూ ఖర్చవుతుందని అంచనాలు రూపొందించినా దానికి సంబంధించి ఒక్క అడుగూ ముందుకు వేయడం లేదు. వేసవిలో చెరువులపై ఆధారపడ్డ 193 గ్రామాల్లో చెరువులను నింపేందుకు రూ.2.24 కోట్లు అవసరముంటుందని ప్రతిపాదించినా నిధులు లేకపోవడం వల్లే యాక్షన్ ప్లానుకు ఆమోదం పొందలేకపోయిందని చెబుతున్నారు. దీనిపై అధికారులను వివరణ అడిగితే తమకేమీ తెలియదని సమాధానం ఇచ్చారు.

పాత బకాయి రూ.230 కోట్లు

వేసవిలో బోర్ల ద్వారా నీటిని ఇచ్చినందుకు గానూ గత మూడేళ్లలో రూ.230 కోట్ల బకాయిలు ఉన్నాయి. వాటిని ప్రభుత్వం ఇంతవరకు విడుదల చేయలేదు. పాత బకాయిలు ఇవ్వకపోతే పనులు ఎలా చేస్తామని కాంట్రాక్టర్లు ప్రశ్నిస్తున్నారు.

'పది' స్పాట్ వాల్యుయేషన్‌లో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి-బాపట్ల

పదోతరగతి స్పాట్ వాల్యుయేషన్ విధులు నిర్వహిస్తున్న బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం పూసపాడు గ్రామానికి చెందిన బోడావుల శ్రీనివాసరావు (46) తీవ్ర అస్వస్థతకు గురై మరణించారు. స్పాట్ వాల్యుయేషన్‌కు ప్రతిరోజు ఆయన ఇంకొల్లు నుంచి బాపట్లకు వెళ్తున్నారు. గురువారం పేపర్లు దిద్దుతుండగా ఒక్కసారిగా కిందపడిపోయారు. తోటి ఉపాధ్యాయులు గమనించి గుంటూరుకు తరలించే క్రమంలో మరణించారు. మృతునికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. శ్రీనివాసరావు పర్చూరు వైఆర్ హైస్కూలులో గణిత ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నారు. శ్రీనివాసరావు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

పోలవరాన్ని పరిశీలించిన కేంద్ర జలశక్తి బృందం

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు పనులను కేంద్ర జల శక్తి బృందం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ గురువారం పరిశీలించింది. కేంద్ర జలశక్తి సంఘం కార్యదర్శి సతీష్ కుమార్, అసిస్టెంట్ సెక్షన్ అధికారి రామన్నంబర్, పోలవరం ప్రాజెక్టు అథారిటీ సిఇఒ శివానందన్‌కుమార్, ఎం.రఘురామ్, పి.దేవేందర్ బృందం పనులను పరిశీలించింది. వారికి పనుల వివరాలను పోలవరం ప్రాజెక్ట్ ఇంజినీర్ చీఫ్ సి.నారాయణరెడ్డి, ఎస్ఇ నరసింహమూర్తి, సిఇ సుధాకర్‌బాబు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా అంగుళూరు సమీపంలో ఉన్న నావిగేషన్ ఛానల్‌పై రెగ్యులేటర్, ఎడమ ప్రధాన కాలువ కనెక్టివిటీ పనులను వారు పరిశీలించారు. అనంతరం పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

రాష్ట్రం దివాలా

- టిడిపి ఎంపి కనకమేడల

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పథకాలకు డబ్బులు లేవని చీఫ్ సెక్రటరీ మీడియా సమావేశంలో చెప్పారని, దీన్నిబట్టి ఆంధ్రప్రదేశ్ దివాలా తీసిందని టిడిపి ఎంపి కనకమేడల రవీంద్ర కుమార్ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రం విడిపోయినప్పుడు కాకుండా ఎపి మరోసారి మోసపోయిందన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవని, ఒక ఫ్యాక్షనిస్టుకు అధికారం తోడయిందని అన్నారు. విభజన కంటే జగన్ సిఎం అయిన తరువాతే ఎపి మరింత నష్టపోయిందన్నారు. వివేకానందరెడ్డి హత్య కేసులో న్యాయ ప్రక్రియను ముఖ్యమంత్రి అడ్డుకుని దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఉద్యోగులకు సమయానికి జీతాలు, పెన్షన్లు కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు.

చెట్ల నరికివేతపై పిల్

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలో చెట్ల నరికివేతపై నిషేధం విధించాలంటూ హైకోర్టులో పిల్ దాఖలైంది. అయ్యల సోమయాజుల రామగణపతి శాస్త్రి దాఖలు చేసిన పిల్‌లో కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, అటవీశాఖ ముఖ్య కార్యదర్శి, పలు జిల్లాల కలెక్టర్లను ప్రతివాదులుగా చేశారు. అటవీ పరిరక్షణ, వాల్టా చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఇష్టానుసారంగా చెట్ల నరికివేత జరుగుతోందని, మహావృక్షాలను డిపోలకు తరలిస్తున్నారని పిల్‌లో పేర్కొన్నారు. సిజె బెంచ్ ఈ పిల్‌ను విచారణ చేయనుంది.

సంక్షేమ రాజ్యం అంటే

పన్నుల భారం వేయడమా?

- 600 శాతం పెంపుదలకు కుట్ర
- ఆస్తి పన్ను నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా ఒత్తిడి పెంచాలి
- ఆంధ్రప్రదేశ్ పట్టణ పౌర సమాఖ్య

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పట్టణ ప్రజలు పన్నులను చెల్లించేందుకు ఇళ్లు అమ్ముకునే దుస్థితిని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆంధ్రప్రదేశ్ పట్టణ పౌర సమాఖ్య కన్వీనరు సిహెచ్ బాబూరావు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న సంక్షేమ రాజ్యం అంటే భారీగా పన్నులను పెంచడమేనా? అని ప్రశ్నించారు. ఆస్తి విలువ ఆధారంగా రానున్న కాలంలో 600 శాతం ఆస్తి పన్నులను పెంచేలా ముందుకుపోతోందని, తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. సంస్కరణల పేరుతో కేంద్రం చెప్పినట్లు రాష్ట్ర ప్రభుత్వం చట్టవిరుద్ధంగా పన్నుల విధానాల్లో మార్పులు తెస్తుందని విమర్శించారు. ఇంటి పన్నును మూడేళ్లలో 50 శాతం పెంచిన ప్రభుత్వం ఈ ఏడాది మరో 15 శాతం పెంచిందన్నారు. ప్రజలను మభ్యపెట్టేలా ముందస్తు పన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ ఇస్తామని మోసం చేస్తోందని విమర్శించారు. ఇంటిపన్ను వసూలు కోసం డిమాండ్ నోటీస్ ఇచ్చాక ఒక ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ 1 నుంచి వచ్చే మార్చి 31లోపు ఎప్పుడైనా పన్ను చెల్లించే వెసులుబాటు వుంటే.. ఇప్పుడు జూన్, జులైలోపు కట్టకపోతే 24 శాతం వడ్డీతో పన్నులు వసూలు చేయడం తగదన్నారు. ఇళ్లులేని వారికి ఇళ్లు ఇస్తామని, ఇళ్లు నిర్మించుకునేవారికి ప్రోత్సాహకాలు ఇస్తున్నామని ఘనంగా చెబుతున్న పాలకులు ఇప్పటికే ఇళ్లు వున్నవారికి శిక్ష అనే రీతిలో భారీగా పన్నులు పెంచుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి చట్టవిరుద్ధంగా చెత్తపన్నును విధించి చెత్త ప్రభుత్వాలు అని నిరూపించుకున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్తిపన్నులోనే చెత్తపన్ను వుంటుందని, అందుకే రసీదు లేకుండా చెత్తపన్ను వసూలు చేస్తున్నారని అన్నారు. చెత్తపన్ను విషయంలో వాణిజ్య సంస్థలనూ భయపెట్టి బలవంతంగా వసూలు చేస్తున్నారన్నారు. ప్రజలు చెత్తపన్నును చెల్లించొద్దని కోరారు.

సంక్షేమ రాజ్యం అంటే చెత్తమీద, నీళ్లమీద పన్నులను వేయడమేనా? అని ప్రశ్నించారు. మంచినీటి కుళాయిలకు మీటర్లు పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారని, ఈ నిర్ణయాన్ని కూడా వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాగునీటితో వ్యాపారం చేయడం సిగ్గుచేటని అన్నారు. భూగర్భ డ్రెయినేజీ పేరుతో ఇంట్లో వున్న మరుగుదొడ్ల సంఖ్య ఆధారంగా పన్ను వసూలుకు రంగం సిద్ధం చేస్తున్నారని విమర్శించారు. ఇంటిపన్ను భారం అంటే ఇంటి యజమానులపై ఒక్కటేకాదు.. అందులో అద్దెకు వుండేవారిపై కూడా పడుతుందని అన్నారు. రానున్నది ఎన్నికల కాలం అయినందున పన్నుల పెంపుదల ప్రజా అజెండాగా మారేలా ప్రజా ప్రతినిధులపై ఒత్తిడి పెంచేందుకు ప్రజలు పోరాటాలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.

విజయవాడ లెనిన్ సెంటర్లో జరిగిన ధర్నాలో పాల్గొన్నా నాయకులు

ఉన్నావ్ దోషులను కఠినంగా శిక్షించాలి

- ఐద్వా, కెవిపిఎస్, డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో దళిత బాలికపై అత్యాచారం చేసి ఆ తర్వాత కేసును ఉపసంహరించుకోవాలని దౌర్జన్యంగా ఇంటికి నిప్పుపెట్టిన వారిని కఠినంగా శిక్షించాలని ఐద్వా, కెవిపిఎస్, డివైఎఫ్ఐ డిమాండ్ చేశాయి. ఉన్నావ్ దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ గురువారం విజయవాడ లెనిన్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి రమణ, ఐద్వా రాష్ట్ర నాయకులు కె శ్రీదేవి మాట్లాడారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో మహిళలపై, దళితులపై రోజురోజుకూ దాడులు పెరిగిపోతున్నాయన్నారు. ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ పాలనలో మహిళలు, దళితులపై భౌతికదాడులకు, అత్యాచారాలకు ప్రభుత్వమే సహకారం అందించడం సిగ్గుచేటన్నారు. గతేడాది 13 ఏళ్ల బాలికపై ఐదుగురు అత్యాచారం చేసిన కేసులో నిందితులు బెయిల్‌పై విడుదలై బాధిత కుటుంబంపై దౌర్జన్యానికి పాల్పడటం, వారు నివసించే గుడిసెను తగలబెట్టడం అనాగరికమైన చర్య అని అన్నారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ ఇద్దరు చిన్నారులు ప్రాణాపాయ స్థితిలో ఉన్నారన్నారు. నిందితులకు స్థానిక బిజెపి నాయకులు మద్దతు వుందని, వారి సహకారంతోనే ఈ దాడులకు పాల్పడ్డారని అన్నారు. తక్షణమే దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై రాము, నాయకులు పి కృష్ణ, ఎన్ నాగేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, సురేష్, నోహిత్ కృష్ణ, కెవిపిఎస్ నాయకులు నటరాజ్, సిహెచ్ శ్రీను, ఐద్వా నాయకురాలు ఆశ తదితరులు పాల్గొన్నారు.

కస్టడీలో విచారణపై డైరెక్షన్ ఇవ్వలేం

- భాస్కర్ రెడ్డి పిటిషన్‌పై హైకోర్టు స్పష్టీకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కస్టడీలో ఎలా విచారణ జరపాలో సిబిఐని నిర్దేశించలేమని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. దర్యాప్తు ఏ విధంగా చేయాలో చెప్పలేమని తెలిపింది. సిబిఐ కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో సవరణలు చేయాలని కోరుతూ వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి వేసిన పిటిషన్లపై గురువారం హైకోర్టులో విచారణ జరిగింది. ప్రశ్నలు లిఖితపూర్వకంగా ఇచ్చేలా సిబిఐని ఆదేశించాలని వారు కోరగా..న్యాయస్థానం పైవిధంగా స్పందించింది. భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిని ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కస్టడీలో విచారణ జరిపేందుకు సిబిఐకి అనుమతినిచ్చిన కోర్టు.. న్యాయవాదిని మాత్రం మధ్యాహ్నం రెండు గంటల వరకే అనుమతించిందని పిటిషనర్ల తరుపున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి తెలిపారు. భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి కనిపించే విధంగా న్యాయవాదిని అనుమతించాలని హైకోర్టు ఆదేశించింది. కస్టడీ విచారణను ఆడియో, వీడియో రికార్డింగ్ చేయడంతో పాటు సుప్రీంకోర్టు, హైకోర్టు మార్గదర్శకాలు పాటించాలని సిబిఐకి హైకోర్టు స్పష్టం చేసింది. కాగా, వైఎస్ అవినాష్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డిలు గురువారం కూడా సిబిఐ విచారణకు హాజరయ్యారు. రెండోరోజు కూడా ముగ్గురిని వేర్వేరుగా విచారించినట్లు తెలిసింది. ఈనెల 24 వరకు వారిని సిబిఐ విచారించనుంది.

ఎర్ర గంగిరెడ్డి బెయిల్ రద్దు చేయండి

మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడిగా ఉన్న ఎర్ర గంగిరెడ్డి బెయిల్ రద్దు చేయాలని తెలంగాణ హైకోర్టులో సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు జరిగాయి. వివేకానందరెడ్డి హత్య కేసులో గంగిరెడ్డి కీలకమని సిబిఐ తరపున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కోర్టుకు తెలిపారు. 'ఈ కేసులో కుట్ర, హత్య చేయడంలో గంగిరెడ్డిది కీలకపాత్ర. సిట్ ఛార్జ్‌షీట్ వేయనందునే ఆయనకు బెయిల్ వచ్చింది. దర్యాప్తు కీలకదశలో ఉన్నందున గంగిరెడ్డి బెయిల్ రద్దు చేయాలి' అని వారు వాదించారు. గంగిరెడ్డి తరపున సీనియర్ న్యాయవాది శేషాద్రి నాయుడు వాదనలు వినిపిస్తూ.. అన్నీ పరిశీలించాకే ఎపి హైకోర్టు బెయిల్ రద్దుకు నిరాకరించిందని చెప్పారు. సాక్షులను ప్రభావితం చేస్తారన్న అనుమానంతో బెయిల్ రద్దు చేయరాదన్నారు. సునీత తరపున సీనియర్ న్యాయవాది ఎల్.రవిచందర్ వాదనలు వినిపిస్తూ గంగిరెడ్డి బెయిల్ రద్దు చేయాలన్న సిబిఐ వాదనను సమర్థించారు. ఇరు పక్షాల వాదనలు విన్న హైకోర్టు.. తదుపరి విచారణను ఈనెల 25కి వాయిదా వేసింది.

దస్తగిరిని అప్రూవర్‌గా మార్చొద్దు

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో దస్తగిరిని అప్రూవర్‌గా మార్చవద్దని వైఎస్ భాస్కరరెడ్డి, వివేకా పిఎ కృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. దస్తగిరిని అప్రూవర్‌గా మార్చొద్దని భాస్కరరెడ్డి, కృష్ణారెడ్డి తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయస్థానం.. కౌంటర్ దాఖలు చేయాలని దస్తగిరికి నోటీసు జారీ చేసింది. దీనిపై తదుపరి విచారణను జూన్ మూడో వారానికి వాయిదా వేసింది.

అర్బన్‌లో చురుగ్గా భూముల రీ సర్వే

- అధికారులకు పెద్దిరెడ్డి సూచన
- 123 పట్టణ ప్రాంతాల్లో 15 లక్షల ఎకరాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో జగనన్న భూహక్కు, భూరక్ష సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో జగనన్న భూహక్కు, భూరక్షపై మంత్రి పెద్దిరెడ్డి అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ సమావేశం గురువారం జరిగింది. సమావేశానికి మంత్రులు ధర్మాన ప్రసాదరావు, బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజయ్‌కల్లం తదితరులు హాజరయ్యారు. సమగ్ర సర్వేపై ఇప్పటి వరకూ అధికారులు చేపట్టిన చర్యలపై వారు సమీక్షించారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 123 యుఎల్‌బిల్లో 15 లక్షల ఎకరాలు సర్వే చేయాల్సి ఉందని తెలిపారు. అర్బన్ ఏరియాల్లో 5.5 లక్షల ఎకరాలు అగ్రికల్చర్ ల్యాండ్‌గా ఉందని, మిగిలిన 9.44 లక్షల ఎకరాలు అర్బన్ ఏరియా కింద ఉందని పేర్కొన్నారు. ఈ మొత్తం ఏరియాలో 38.19 లక్షల ఆస్తులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. రెండు వేల గ్రామాల్లో మే 20వ తేదీలోగా సర్వే పూర్తి చేయాలన్న సిఎం ఆదేశాల ప్రకారం అధికారులు పనిచేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకూ 1,94,571 భూహక్కు పత్రాలను సిద్ధం చేశారని, ఇకెవైసి ద్వారా ఎటువంటి వివాదాలకు తావులేకుండా వాటిని పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. భూ వివాదాలకు ఆస్కారం లేకుండా భూ యజమానుల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్లు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు.

సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రి పెద్దిరెడ్డి, ధర్మాన ప్రసాదరావు, బొత్స సత్యనారయణ తదితరులు

10,409 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి
సబ్ కమిటీకి వివరించిన అధికారులు

మొదటి దశలో గుర్తించిన 12 వేల గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న సర్వే ప్రక్రియలో 10,409 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తయిందని చెప్పారు. 7,158 గ్రామాల్లో ఇమేజ్‌లను తీసుకుని 3,758 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తి చేశామని పేర్కొన్నారు. తుదిదశ సర్వే కోసం 2,391 గ్రామాల్లో రెవెన్యూ రికార్డుల పరిశీలన పూర్తయిందని తెలిపారు. సర్వే ప్రక్రియలో జాప్యం లేకుండా ఉండేందుకు ముందుగానే రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తున్నామని చెప్పారు. దీనిలో భాగంగా నాలుగు లక్షలకుపైగా రికార్డులకు మ్యుటేషన్ అవసరమని గుర్తించినట్లు తెలిపారు. జూన్ నాటికి రాష్ట్రంలో డ్రోన్ ప్రక్రియ పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని, ఇప్పటి వరకూ 86 చదరపు కిలోమీటర్ల మేర డ్రోన్ ఫ్లై పూర్తి చేశామని మంత్రులకు అధికారులు వివరించారు. ఇప్పటి వరకూ 25.8 లక్షల సర్వేరాళ్లు సిద్ధంగా ఉన్నాయని మైనింగ్ అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే 18.9 లక్షల సర్వే రాళ్లను సరఫరా చేశామని, మరో 12.3 లక్షల రాళ్లు ఆయా గ్రామాలకు తరలించడానికి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. మే 20లోగా సర్వే పూర్తయిన గ్రామాల్లో రాళ్లను పాతే ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు తెలిపారు. అర్బన్ ప్రాంతాల్లో సమగ్ర సర్వేపై ఇప్పటి వరకు 30.11 లక్షల ఆస్తులను వెరిఫై చేస్తే దానిలో 36.32 లక్షల నిర్మాణాలు ఉన్నాయని మున్సిపల్ అధికారులు మంత్రుల కమిటీకి వివరించారు. ఈ సమావేశంలో సిసిఎల్ఎ సాయిప్రసాద్, అటవీదళాల అధిపతి మధుసూదన్‌రెడ్డి, పంచాయతీరాజ్ కమిషనరు సూర్యకుమారి, సర్వే సెటిల్‌మెంట్ కమిషనరు సిద్ధార్థజైన్, ఎంఎయుడి కమిషనరు కోటేశ్వరరావు, మైనింగ్ డిజిఎం వెంకటరెడ్డి పాల్గొన్నారు.

కనీస పెన్షన్ రూ.9 వేలు

- రోడ్డెక్కిన ఇపిఎస్ పెన్షనర్లు
- సమస్యల పరిష్కారం కోసం పలుచోట్ల భిక్షాటన
- ఎంపిలకు వినతి పత్రాలు అందజేత

ప్రజాశక్తి - యంత్రాంగం

తమ సమస్యల పరిష్కారం కోసం ఇపిఎస్ పెన్షనర్లు రోడ్డెక్కారు. నెలకు కనీస పెన్షన్ రూ.9 వేలు, డిఎ తక్షణం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఇపిఎస్ 95 పెన్షనర్లు రాష్ట్రంలో పలుచోట్ల గురువారం ఆందోళనలు చేశారు. పలుచోట్లు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. నెలకు రూ.వెయ్యి పెన్షన్‌తో ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే వయసురీత్యా పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నామని, ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని ఇపిఎస్ పెన్షనర్లు డిమాండ్ చేశారు. అనంతరం తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు అందజేశారు.

విశాఖలో ఎంపి నివాసం వద్ద ప్లేట్లు వాయిస్తూ నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

విశాఖలో ఎంపి ఎంవివి.సత్యనారాయణ నివాసం ఎదుట ఆందోళన చేశారు. తొలుత ఉషోదయ జంక్షన్ నుంచి భిక్షాటన చేసి నిరసన తెలిపారు. అనంతరం ఎంపికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జింక్, షిప్‌యార్డు, హెచ్‌పిసిఎల్, ఆర్‌టిసి, సెయిల్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సంస్థల రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు. అనకాపల్లిలో నిరసన అనంతరం ఎంపి బివి.సత్యవతికి వినతిపత్రం అందజేశారు. కర్నూలు ఎంపి సంజీవ్ కుమార్‌కు.. అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు కె.సుధాకరప్ప ఆధ్వర్యాన వినతి పత్రం అందజేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఎంపి స్పందిస్తూ వచ్చే పార్లమెంటు సమావేశంలో పెన్షనర్ల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాకినాడలో కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ప్లేట్లు వాయించి నిరసన తెలిపారు. అనంతరం కాకినాడ ఎంపి వంగా గీత క్యాంపు కార్యాలయం వరకూ భిక్షాటన చేస్తూ ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి సిహెచ్.సత్యనారాయణరాజు పాల్గొన్నారు. శ్రీకాకుళంలోని ఎంపి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కార్యాలయం వద్ద భిక్షాటన చేశారు. అనంతరం వినతిపత్రం అందజేసి తమ సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. దీనిపై ఎంపి స్పందిస్తూ పెన్షనర్ల సమస్యలపై గతంలో పార్లమెంట్‌లో ప్రస్తావించడంతోపాటు కేంద్ర ఆర్థికశాఖ మంత్రికి లేఖ రాసినట్లు తెలిపారు. పెన్షనర్ల సమస్యలను మిగతా ఎంపిలకు వివరించి వారి సహకారంతో పార్లమెంట్‌లో పోరాడతానన్నారు. గుంటూరులో ఎంపి గల్లా జయదేవ్ పిఎకు వినతి పత్రం ఇచ్చారు. అనంతపురంలో ఆందోళన చేశారు.

రాగిజావకు బదులు చిక్కీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందిస్తున్న రాగిజావను ఈ విద్యా సంవత్సరంలో నిలిపివేయాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జావకు బదులు పల్లి చిక్కీని అందించాలని మధ్యాహ్న భోజన పథకం డైరెక్టరు నిధి మీనా గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. మంగళ, గురు, శనివారాల్లో విద్యార్థులకు రాగిజావను విద్యాశాఖ అందిస్తోంది. ప్రస్తుతం విద్యార్థులకు ఉదయం 8 నుంచి 11 గంటలలోపు పరీక్షలు జరుగుతున్నాయి. అందువల్ల జావను బదులు చిక్కీ ఇవ్వాలని ఆదేశించింది. ఈ విద్యా సంవత్సరం ఈ నెల 30తో ముగియనుంది.

సుప్రీంలో సునీత పిటిషన్

- నేడు విచారణకు వచ్చే అవకాశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కడప ఎంపి అవినాష్‌రెడ్డి ముందస్తు బెయిల్‌కు వ్యతిరేకంగా సునీతారెడ్డి సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఎంపి అవినాష్‌రెడ్డిని ఈ నెల 25 వరకు అరెస్టు చేయవద్దని సిబిఐని తెలంగాణ హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. అప్పటిదాకా ఆయన ప్రతిరోజూ సిబిఐ విచారణకు హాజరుకావాలంటూ స్పష్టం చేసింది. అయితే అవినాష్‌రెడ్డి మధ్యంతర బెయిల్‌కు వ్యతిరేకంగా వివేకా కుమార్తె వైఎస్ సునీత సుప్రీం కోర్టును ఆశ్రయించారు. సునీత పిటిషన్‌ను సుప్రీం విచారణకు స్వీకరించింది. గురువారం సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్ ధర్మాసనం ముందు సునీత పిటిషన్‌ను సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా ప్రస్తావించారు. శుక్రవారం విచారణకు స్వీకరిస్తామని సిజెఐ తెలిపారు. దీంతో నేడు సునీత పిటిషన్ విచారణకు వచ్చే అవకాశం ఉంది.

రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల విప్లవం

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- సోలార్ సిస్టం సైన్స్ ఎగ్జిబిట్స్, ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్‌కు ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - భవానీపురం (విజయవాడ)

రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల విప్లవం తీసుకువస్తున్నామని రాష్ట్ర ఇంధన, పర్యావరణ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఇంధన భద్రత పెంపునకు, కర్బన ఉద్గారాల తగ్గింపునకు, వాతావరణంలో గాలి నాణ్యత మెరుగుదలకు ఎలక్ట్రిక్ వాహనాల విప్లవాన్ని తీసుకువచ్చే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విజయవాడ భవానీపురంలోని రీజినల్ సైన్స్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను గురువారం మంత్రి పెద్దిరెడ్డి ప్రారంభించారు. అంతకుముందు రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఆవరణలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్‌ను, పునరుత్పాదక ఇంధన వనరుల కేంద్రాన్ని (ఆర్ఇఆర్‌సి) ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ భవిష్యత్‌లో రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లో ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకోసం ఎన్ఆర్ఇడిసిఎపి వారు రాష్ట్రంలో 250 ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు వీలు కల్పించారని తెలిపారు. రాష్ట్రం ఈ-మొబిలిటీకి ఒక నమూనాగా, పునరుత్పాదక ఇంధనానికి నాలెడ్జ్ హబ్‌గా మారాలని ఆకాంక్షించారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించే పాలసీ రూపకల్పన, ప్రభుత్వ ఉద్యోగులకు ఇఎంఐ ప్రాతిపదికన లక్ష ఎలక్ట్రిక్ వాహనాల పంపిణీ, రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు వంటి ప్రోత్సాహకాలను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్ర, సాంకేతిక శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, ఎపిసిపిడిసిఎల్ సిఎండి జె.పద్మ జనార్ధన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ఇంధన పరిరక్షణ మిషన్ సిఇఒ ఎ.చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి

- ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్
- 24న ఐసిడిఎస్ డైరెక్టర్ కార్యాలయం ముందు ధర్నా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) కోరింది. ఈ మేరకు గురువారం ఐసిడిఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ, డైరెక్టరుకు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె సుబ్బరావమ్మ, జి బేబీరాణి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మినీ వర్కర్లకు వేసవి సెలవులు ఇవ్వాలని, వారికి ప్రమోషన్ ఇచ్చి ఖాళీ పోస్టుల్లో నియమించాలని కోరారు. వారికీ మెయిన్ వర్కర్‌తో సమానంగా వేతనాలు ఇవ్వాలని కోరారు. గ్రేడ్-2 సూపర్‌వైజర్ పోస్టులకు అవకాశం ఇవ్వాలని, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ అమలుకు మెనూ ఛార్జీలు పెంచాలని, అదనపు హెల్పర్‌ను కేటాయించాలని కోరారు. 400 మంది జనాభా ఉన్నచోట మాత్రమే మినీ సెంటర్లు నడపాల్సి ఉండగా, రాష్ట్రంలో పలుచోట్ల 1000 నుంచి 1200 మంది వరకూ ఉన్న ప్రాంతాల్లోనూ మినీ సెంటర్లను నడుపుతున్నారని పేర్కొన్నారు. ఫోన్లు పనిచేయకపోయినా వర్కర్లను రికార్డులు రాయాల్సిందిగా బలవంతం చేస్తున్నారని తెలిపారు. ఈ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 24న గుంటూరులో ఐసిడిఎస్ డైరెక్టరు కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు.

వైసిపి-బిజెపి బంధం ప్రజలకు తెలుసు

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు
- ఎన్‌టిఆర్ భవన్‌లో చంద్రబాబు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిజెపి-వైసిపి మధ్య బంధం ఏమిటో ప్రజలకు తెలుసని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు అన్నారు. వారి మధ్య ఎలాంటి సంబంధం లేదని బిజెపి నేత సునీల్ థియోదర్, వేరెవరో అనుకుంటే ఫలితం లేదన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు అచ్చెన్నాయుడు ఆధ్వర్యాన టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో గురువారం జరిగాయి. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడుతూ.. అప్పులు, ఎఫ్ఆర్‌బిఎం విషయంలో ఏ రాష్ట్రానికి లేని వెసులుబాట్లు రాష్ట్రానికే వస్తున్నాయన్నారు. ఏప్రిల్ నెలలో ఇవ్వాల్సిన అప్పును మార్చిలోనే వచ్చేలా చేశారని చెప్పారు. బిజెపి-వైసిపి మధ్య సంబంధం ఏమిటో ఇలాంటి చర్యలు ద్వారా ప్రజలు గమనిస్తున్నారన్నారు.

వైఎస్ వివేకా హత్య కేసులో సిఎంకు చెందిన మరో బాబాయిని అరెస్టు చేశారని, దీనిని పక్కదారి పట్టించేందుకే జగన్ ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఉత్తరాంధ్రకు తాము చేసిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేస్తామని, వైసిపి ఏం చేసిందో చెప్పగలదా? అని ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వం వెంటిలేటర్‌పై ఉందన్నారు. చంద్రబాబు 73వ పుట్టిన రోజు సందర్భంగా టిఎన్ఎస్ఎఫ్, టిడిపి బిసి సెల్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన 73 కేజీల కేకును కట్ చేయడంతోపాటు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, టిడి జనార్ధన్, మాజీ మంత్రి పీతల సుజాత, ఎమ్మెల్సీ అశోక్ బాబు, మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్, నాయకులు కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

'బయో' వేస్టేజ్ నిర్మూలనకు చర్యలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో బయోమెడికల్ వేస్టేజీని అత్యంత కట్టుదిట్టమైన పద్ధతుల్లో వేస్టేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ల ద్వారా నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని పర్యావరణ, అటవీ, శాస్త్రసాంకేతిక మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో సచివాలయంలో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,68,255 బెడ్స్‌తో 13,728 వైద్య సంస్థలు పనిచేస్తున్నాయని వివరించారు. 2021 వార్షిక నివేదిక ప్రకారం ఏటా 7,197 టన్నుల బయో వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయని తెలిపారు. ఈ వ్యర్థాలను సురక్షిత విధానంలో నాశనం చేసేందుకు బయోమెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లకు తరలిస్తున్నారని చెప్పారు. దీనికోసం రాష్ట్రంలో 12 బయోమెడికల్ వేస్టేజీ ప్లాంట్లు పనిచేస్తున్నాయని వివరించారు. బయో వేస్టేజీపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాలను అధికారులు అమలుచేయాలని కోరారు. వైద్య సంస్థల సంఖ్య పెరగడం వల్ల అదనంగా బెడ్స్ ఏర్పాటవుతున్నాయని తెలిపారు. కాబట్టి రాష్ట్రంలో కొత్త బయోమెడికల్ వేస్టేజీ ప్లాంట్‌లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి అన్ని అర్హతలూ ఉంటే కొత్త ప్లాంట్ల ఏర్పాటుకు అనుమతులు జారీ చేయాలని ఆదేశించారు. ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, హానికరమైన వ్యర్థాలను సురక్షిత విధానాల్లో నాశనం చేసే విషయంలో ఎక్కడా రాజీపడకూడదని ఆదేశించారు. ఈ సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ సమీర్ శర్మ, పర్యావరణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్, మెంబర్ సెక్రటరీ బి శ్రీధర్, సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరు కెఎస్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

33కెవి సబ్‌స్టేషన్లకు కమిటీలు

33కెవి సబ్‌స్టేషన్లకు కమిటీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఇంధన, అటవీ, పర్యావరణశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. అన్ని అంశాలూ పరిష్కరించేందుకు రాష్ట్రంలోని ప్రతి 33 కెవి సబ్‌స్టేషన్‌కు ఎంపిపి, జెడ్‌పిటిసి, ముగ్గురు రైతులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాలని చెప్పారు. వేసవిలో విద్యుత్ సరఫరా, విశాఖలో జరిగిన ఇన్వెస్ట్‌మెంట్ సదస్సులో కుదిరిన ఎంఒయులపై సచివాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. విశాఖపట్నంలో జరిగిన సమ్మిట్‌లో కుదిరిన అవగాహన ఒప్పందాల (ఎంఒయు) ప్రకారం రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేయించేందుకు ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 16,500 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన సామర్థ్యంతో రూ.82,500 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన 10 ప్రాజెక్టులను జులై 15లోపు శంకుస్థాపనలు అయ్యేలా ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. ఎంఒయుల్లో 50 శాతం పరిశ్రమలైనా త్వరితగతిన ఏర్పాటు చేయించే దిశగా ముందుకెళ్తున్నామని చెప్పారు. ఇప్పటివరకూ ఎన్నడూలేని విధంగా విద్యుత్ డిమాండ్ గురువారం 246.9 మిలియన్ యూనిట్లు (ఎంయు) నమోదైందని అన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు దరఖాస్తు చేసుకున్న వెంటనే కనెక్షన్లు ఇచ్చే సదుపాయం కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, జెన్‌కో ఎమ్‌డి కెవిఎన్ చక్రధర్‌బాబు, ఇపిడిసిఎల్ సిఎమ్‌డి పృధ్వీతేజ్, ఇంధనశాఖ డిప్యూటీ సెక్రటరీ కుమార్ రెడ్డి, నెడ్‌క్యాప్ ఎమ్‌డి రమణారెడ్డి, సిపిడిసిఎల్, ఎస్‌పిడిసిఎల్ సిఎమ్‌డిలు పద్మజనార్ధన్ రెడ్డి, సంతోషరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఇస్రో పిఎస్‌ఎల్‌వి-సి55 రాకెట్ ప్రయోగం

ప్రజాశక్తి - సూళ్లూరుపేట (తిరుపతి)

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఈ నెల 22న మరో వాణిజ్య ప్రయోగానికి రంగం సిద్ధం చేసింది. సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లోని మొదటి ప్రయోగ వేదికపై నుండి శనివారం మధ్యాహ్నం 2 గంటల 19 నిమిషాలకు ఇస్రో పిఎస్‌ఎల్‌వి-సి55 రాకెట్ ద్వారా సింగపూర్‌కు చెందిన టెల్ ఇయోస్-2 ఉపగ్రహాన్ని ప్రయోగించనుంది. 741 కిలోల బరువు కలిగిన ఉపగ్రహంతోపాటు 16 కిలోల లుమొలైట్ అనే ఉపగ్రహాన్నీ ప్రయోగించడానికి సర్వం సిద్ధం చేసింది. ఈ ప్రయోగానికి సంబంధించిన కౌంట్‌డౌన్ 25:30 గంటల ముందు నుండి ప్రారంభించాలని శాస్త్రవేత్తలు నిర్ణయించారు.

ఎవరిని ఉద్ధరించడానికి విశాఖలో కాపురం

- యనమల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎవరిని ఉద్ధరించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖలో కాపురం పెడతానంటున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చాక అభివృద్ధి ఊసే ఎత్తలేదని గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఇప్పటికే మూడు రాజధానుల పేరుతో రాజధాని అమరావతిని చంపేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖలో రాజధాని మాటున రూ.40 వేల కోట్లు కొల్లగొట్టారని ఆరోపించారు. ధరలు, పన్నుల మోతతో పేదలు కడుపునిండా తిండి తినే పరిస్థితి లేదన్నారు. చంద్రబాబు పేదల సంక్షేమం కోసం అమలు చేసిన కొన్ని పథకాలను జగన్ ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా రద్దు చేసిందని, మరికొన్నింటికి పేర్లు మార్చుకోవడం మినహా చేసిందేముందని ప్రశ్నించారు. జగన్ అనాలోచిత నిర్ణయాలు, అసమర్థ పాలన వల్లే ప్రభుత్వ ఖజానా ఖాళీ అయిందని తెలిపారు. ఎన్నికలకు ఏడాది ముందు పోర్టులకు రిబ్బన్ కటింగ్ చేయడం, పెట్టుబడుల సదస్సు పేరుతో హడావుడి చేయడం దేనికి సంకేతమని ప్రశ్నించారు.

రాష్ట్రంలోని పరిశ్రమలను తరిమేస్తున్న జగన్ పెట్టుబడుల ఆకర్షణలో ఏ విధంగా అగ్రగామి అయ్యారో చెప్పాలని మాజీ మంత్రి ఎన్ అమర్‌నాథ్‌రెడ్డి మరో ప్రకటనలో ప్రశ్నించారు. జాతీయ సగటు కంటే రెట్టింపుగా రాష్ట్రంలో నిరుద్యోగ పట్టభద్రుల శాతం 35.14గా ఉందని పేర్కొన్నారు. చంద్రబాబు కడప జిల్లా పర్యటనలో సంఘ విద్రోహ శక్తులు వీరంగం చేస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారని టిడిపి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి మరో ప్రకటనలో ప్రశ్నించారు.

ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపండి

స్టీల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

గురువారం ధర్నాలో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలని, కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు), డివిఆర్‌ఎస్‌యుయు, ఎఐసిటియు, టిఎఫ్‌టియుఐ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఇడి (వర్క్స్) కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొని ప్రభుత్వ, యాజమాన్య వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఇడి (వర్క్స్) బికె.మహంతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ.. ప్లాంట్ ప్రైవేటీకరణను తక్షణం ఆపాలని డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతోనే స్థానిక యాజమాన్యం బ్లాస్ట్ ఫర్నేస్-3లో ఏడాదిగా ఉత్పత్తిని నిలిపివేసిందని విమర్శించారు. ముడి పదార్థాలను సమకూర్చాల్సిన బాధ్యత నుంచి ప్రభుత్వం వైదొలుగుతుంటే యాజమాన్యం చోద్యం చూస్తోందని మండిపడ్డారు. కర్మాగారాన్ని లాభాల్లో నడిపించేందుకు శక్తి వంచన లేకుండా కార్మికులు కృషి చేస్తున్నారని తెలిపారు. ఉత్పత్తికి అవసరమైన ముడి సరుకులను అందించాలన్నారు. సంఘం అధ్యక్షులు వైటి.దాస్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, డివిఆర్‌ఎస్‌యుయు, ఎఐసిటియు, టిఎఫ్‌టియుఐ నాయకులు డివి.రమణారెడ్డి, సిహెచ్.సన్యాసిరావు, దాసరి సురేష్ బాబు మాట్లాడారు. సెయిల్ కార్మికులకు నూతన వేతనాల అమలుతో పాటు వారికి రావాల్సిన వేతన బకాయిలను కూడా చెల్లించారని, కానీ ఇక్కడ నూతన వేతనాల అమలు కోసం కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు, టివికె.రాజు, మరిడయ్య, నీలకంఠం, గంగాధర్, యు.వెంకటేశ్వర్లు, కెవి.సత్యనారాయణ పాల్గొన్నారు.

పొలాల్లోనే వంటా వార్పు చేసుకుంటున్న రైతులు

నంద్యాల - జమ్మలమడుగు

జాతీయ రహదారి భూ సేకరణను వ్యతిరేకిస్తూ వంటావార్పు

- ప్రత్యామ్నాయ భూముల్లో రహదారి వేయండి : రైతుల డిమాండ్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల నుండి జమ్మలమడుగు వరకు ఏర్పాటు చేయనున్న జాతీయ రహదారి నిర్మాణం కోసం నంద్యాల జిల్లా కానాల, రైతు నగరం గ్రామాల్లో భూములను తీసుకోవడాన్ని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సిపిఎం ఆధ్వర్యంలో బాధిత రైతులు గురువారం ఆందోళన చేశారు. తమ భూముల్లో శిబిరం వేసుకొని, వంటా వార్పు నిర్వహించారు. ముందుగా ఇచ్చిన ప్లాన్‌ను మార్చి తమ భూముల్లో రహదారి వెళ్లేలా గెజిట్ రూపొందించారని, ఈ గెజిట్ వల్ల తమ జీవనోపాధి కోల్పోతామని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.నాగరాజు మాట్లాడుతూ.. నంద్యాల నుండి జమ్మలమడుగు జాతీయ రహదారి నిర్మాణం కోసం పేదల భూముల్లోకి సర్వేకు వస్తే బాధిత రైతులతో కలిసి అధికారులను అడ్డుకుంటామని హెచ్చరించారు. ప్రత్యామ్నాయ భూముల్లో జాతీయ రహదారి నిర్మాణానికి అవకాశం ఉన్నా, రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం గ్రామసభలు నిర్వహించకుండా, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా రైతుల భూముల్లో సర్వే చేయడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. రైతుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే కానాల, రైతు నగరం గ్రామాల్లో వెంటనే గ్రామ సభలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. రైతుల అభిప్రాయాలను తెలుసుకొని, తక్కువ నష్టం కలిగే విధంగా ప్రత్యామ్నాయ భూముల్లో రహదారిని నిర్మించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపి జోక్యం చేసుకొని రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

తోటి విద్యార్థిపై కత్తితో దాడి

ప్రజాశక్తి-రాజానగరం (తూర్పుగోదావరి జిల్లా)

పరీక్ష రాస్తున్న ఓ విద్యార్థిపై మరో విద్యార్థి కత్తితో దాడి చేసిన సంఘటన తూర్పు గోదావరి జిల్లా రాజానగరం జడ్‌పి పాఠశాలలో గురువారం చోటు చేసుకుంది. పరీక్ష హాల్లో ఉపాధ్యాయుల ఎదుటే విద్యార్థి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. ఉపాధ్యాయులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక పాఠశాలలో రాజానగరానికి చెందిన ఉదయ్ శంకర్, తూర్పుగోనగూడెంకు చెందిన హరిసాయి ప్రసాద్ తొమ్మిదో తరగతి తెలుగు పరీక్ష రాస్తున్నారు. పరీక్ష రాస్తుండగా ఉదయ్ శంకర్‌పై హరి సాయి ప్రసాద్ కత్తితో దాడి చేశాడు. మెడ, చేతిపైన తీవ్రంగా గాయపరిచాడు. ఉపాధ్యాయులు అడ్డుకోవడానికి ప్రయత్నించగా వారిని కత్తితో బెదిరించి అక్కడి నుంచి పరారయ్యాడు. గాయపడిన ఉదయ్‌శంకర్‌ను రాజమహేంద్రవరంలో ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ అఘాయిత్యానికి ప్రేమ వ్యవహారమే కారణమని తెలుస్తోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రాయదుర్గంలో సవాళ్ల పర్వం

- మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అరెస్టు

ప్రజాశక్తి- కణేకల్లు (అనంతపురం)

కాలవ శ్రీనివాసులను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

నాయకుల సవాళ్లతో అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం ఎస్.హనుమాపురంలో గురువారం ఉద్రిక్తత నెలకొంది. నియోజకవర్గం అభివృద్ధిపై అధికారపార్టీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, మాజీ మంత్రి, రాయదుర్గం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కాలవ శ్రీనివాసులు మధ్య గత వారం రోజులుగా మాటల యుద్ధం నడుస్తోంది. ఇటీవల ఈ నియోజకవర్గం పరిధిలోని కణేకల్లు మండలం ఎన్.హనుమాపురం గ్రామంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను రామచంద్రారెడ్డి ప్రారంభించారు. హనుమాపురాన్ని మీరేం అభివృద్ధి చేశారో గడపగడపకూ వెళ్లి ప్రజలను అడుగుదామని ఈ సందర్భంగా ఆయన శ్రీనివాసులకు సవాల్ విసిరారు. హనుమాపురం గ్రామ అభివృద్ధిపై తాను చర్చకు సిద్ధమని, గురువారం ఆ గ్రామానికి వస్తానంటూ శ్రీనివాసులు ప్రతిసవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో కాలవ శ్రీనివాసులు గురువారం మధ్యాహ్నం ఎన్.హనుమాపురం గ్రామానికి చేరుకున్నారు. ఆయనకు మద్దతుగా రాయదుర్గం నియోజకవర్గం టిడిపి నాయకులు, కార్యకర్తలూ అక్కడికి చేరుకున్నారు. ఇదే సమయంలో కాపు రామచంద్రారెడ్డి కూడా హనుమాపురం గ్రామానికి రాయదుర్గం నుంచి బయలు దేరారు. ఇద్దరి నేతల మధ్య సవాళ్ల పర్వాన్ని గుర్తించిన పోలీసులు అప్రమత్తమయ్యారు. టిడిపి కార్యకర్తలతో కలిసి హనుమాపురం గ్రామంలో ఉన్న కాలవ శ్రీనివాసులును పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి కళ్యాణదర్గం స్టేషన్‌కు తరలించారు. కాపు రామచంద్రారెడ్డిని బొమ్మనహాల్ పోలీస్ స్టేషన్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. శాంతిభద్రతల నేపథ్యంలో హనుమాపురం వెళ్లేందుకు వీల్లేదంటూ ఆయనకు నచ్చజెప్పి అక్కడి నుంచి వెనక్కు పంపించేశారు.

పొలం ఆక్రమిస్తున్నారంటూ

మార్కెట్‌యార్డు చైర్మన్ భర్త ఆత్మహత్యాయత్నం

ఆత్మహత్యా ప్రయత్నం చేస్తున్న బిక్కి హరి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం (అనంతపురం జిల్లా)

తన పొలాన్ని కాజేసేందుకు యత్నిస్తున్న వారికి అధికారులు సహకరిస్తున్నారని ఆరోపిస్తూ వైసిపి నాయకుడు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ భర్త ఆత్మహత్యకు యత్నించిన సంఘటన అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. కళ్యాణ దుర్గం పట్టణానికి చెందిన బిక్కి నాగలక్ష్మి కళ్యాణదుర్గం మార్కెట్‌యార్డు చైర్మన్‌గా పని చేశారు. ఆమె భర్త బిక్కి హరి వైసిపి నాయకునిగా ఉన్నారు. హరి పేరున కళ్యాణదుర్గం పట్టణ సమీపంలోని సర్వే నెంబర్ 409లో మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆ పక్కనే బి.తిప్పేస్వామి అనే వ్యక్తికి చెందిన పొలం ఉంది. పొలం విషయంలో వీరి మధ్య వివాదం ఏర్పడింది. తిప్పేస్వామి ఫిర్యాదు మేరకు భూమిని సర్వే చేసేందుకు సర్వేయర్లు గురువారం పొలం వద్దకు వెళ్లారు. విషయం తెలుసుకున్న హరి తహశీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్లి నిరసన తెలిపాడు.

అధికారులు తనకు అన్యాయం చేసేలా వ్యవహరి స్తున్నారని ఆరోపిస్తూ అప్పటికే తనతోపాటు తెచ్చు కున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. అక్కడున్న పోలీసులు అడ్డుకుని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. తిప్పేస్వామి తన పొలాన్ని ఆక్రమించుకునేందుకు తప్పుడు రికార్డులు సృష్టించి సర్వే చేయిస్తున్నాడని అధికారులకు తెలిపారు.

విద్యార్థులు, యువకులతో మాట్లాడుతున్న నారా లోకేష్

ప్రతి నియోజకవర్గంలో ఐటి కంపెనీలు

- నారా లోకేష్

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

తాము అధికారంలోకి రాగానే ప్రతి నియోజక వర్గంలో ప్లగ్ అండ్ ప్లే విధానంలో ఐటీ కంపెనీలు ఏర్పాటు చేస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ హామీనిచ్చారు. కెజి నుంచి పిజి వరకూ సబ్జెక్టులను ప్రక్షాళన చేస్తామని, చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగం వచ్చేలా విద్యార్థులను సిద్ధం చేస్తామని తెలిపారు. యువగళం పేరుతో ఆయన చేపట్టిన పాదయాత్ర గురువారం కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గం ములిగుందం నుంచి ప్రారంభమైంది. యాత్ర పెదపెండేకల్, ఆలేకల్, నాగలాపురం, కపతి క్రాస్ మీదుగా ఆదోని వరకూ సాగింది. పెదపెండేకల్ శివారు ఎర్రచెరువు వంకలో ఉపాధి హామీ కార్మికులను కలిసి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ పని చేస్తే రూ.150 కూలీ ఇస్తున్నారని, నీడ కోసం పరదాలు, తాగేందుకు మంచినీళ్లు కూడా లేవని కూలిలు ఆవేదన వ్యక్తం చేశారు. తాముఅధికారంలోకి రాగానే పనిదినాలు, కూలీ పెంచేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆరేకల్‌లో వాల్మీకులు లోకేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వాల్మీకుల మధ్య ప్రాంతీయ విభేదాన్ని తొలగించి ఎస్‌టి జాబితాలో చేర్చాలని కోరారు. నాగలాపురంలో విద్యార్థులు, యువతతో ముఖాముఖి నిర్వహించారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్ రావడం లేదని, గ్రూప్-2 ఉద్యోగాలు భర్తీ చేయడం లేదని, మహిళలకు భద్రత లేదని పలువురు విద్యార్థుల తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఫీజు రీఎంబర్స్‌మెంట్ అమలు చేస్తామని, బకాయిలన్నీ చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఏడాది నోటిఫికేషన్ విడుదల చేసి ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. ప్రత్యేక పాఠ్యాంశాలు పెట్టి మహిళల గొప్పతనం తెలిసేలా చేస్తామని తెలిపారు. ఆదోనిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, ఎమ్మెల్సీ బిటి నాయుడు, ఆదోని నియోజకవర్గ ఇనాచార్జీ మీనాక్షి నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఆదోని విడిది కేంద్రంలో బస ఏర్పాటు చేశారు. గురువారం మొత్తంగా 13.9 కిలోమీటర్లు పాదయాత్ర సాగింది. శుక్రవారం ఆదోని పట్టణంలో యువగళం యాత్ర వెయ్యి కిలోమీటర్ల మైలు రాయిని చేరుకోనుంది.

యూనిట్‌కు రూ.4.60 చెల్లింపు

- సిపిడిసిఎల్ సిఎమ్‌డి పద్మజనార్ధన్‌రెడ్డి
- ప్రజాశక్తి వార్తపై ప్రతిస్పందన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపిఇఆర్‌సి నిర్ణయించిన ప్రకారం సోలార్ రూఫ్‌టాప్ ఎనర్జీకి యూనిట్‌కు రూ.4.60 చెల్లిస్తున్నామని సిపిడిసిఎల్ సిఎమ్‌డి పద్మజనార్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 20న ప్రజాశక్తిలో ప్రచురితమైన 'అలా కుదరదు' అనే వార్తకు ప్రతిస్పందన పంపించారు. సోలార్ విద్యుత్ విధానంపై సమీక్ష చేసిన సమయంలో ఆ విధానంలో తేడాలను గమనించి ప్రస్తుత సోలార్ రూఫ్‌టాప్ పాలసీ 2018ని జనవరి 2023 నుంచి అమలు చేస్తున్నామని తెలిపారు. అధిక మొత్తంలో ఉన్న వినియోగదారులను దృష్టిలో పెట్టుకుని వారికి నష్టం జరగకుండా ఉండటం కోసం బిల్లింగ్ విధానాన్ని మార్చామని తెలిపారు. సోలార్ పవర్‌ను ఇంటి అవసరాలకు వాడుకున్న తరువాత మిగిలిన యూనిట్లకు బిల్లు వేస్తున్నామన్నారు. మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు ఎగుమతి చేస్తున్నామని, దాన్ని ఎపిసిపిడిసిఎల్ మీటరు ద్వారా రికార్డు చేస్తామని తెలిపారు. వినియోగదారుడు ఎగుమతి చేసిన యూనిట్‌కు రూ.4.60 పైసలు చెల్లిస్తున్నామని వివరించారు. సోలార్ నెట్ మీటరింగ్‌పై అపోహలు అవసరం లేదని తెలిపారు.

మొబైల్ రంగంలో మందగమనం

- ఒత్తిడిలో భారత మార్కెట్
- అమ్మకాల్లో 20% పతనం



హైదరాబాద్ : భారత మొబైల్ మార్కెట్‌లో మందగమనం చోటు చేసుకుంది. ప్రస్తుత ఏడాది మార్చితో ముగిసిన తొలి త్రైమాసికం స్మార్ట్‌ఫోన్ల సరఫరాలో 20 శాతం పతనం చోటు చేసుకుందని కెనలిస్ ఓ రిపోర్ట్‌లో తెలిపింది. 2022 డిసెంబర్ త్రైమాసికంలో 6 శాతం తగ్గుదలను చవి చూసిందని వెల్లడించింది. కెనలిస్ రీసెర్చ్ రిపోర్ట్ ప్రకారం.. భారత మొబైల్ మార్కెట్‌కు 2023 సవాలుగా ప్రారంభమైంది. మార్కెట్ ఇప్పటికీ డిమాండ్ లేమితో పోరాడుతోంది. అమ్మకాలు తగ్గి స్టాక్ మిగిలిపోతోంది. కాగా.. క్రితం క్యూ1లో సామ్‌సంగ్ 63 లక్షల యూనిట్ల అమ్మకాలతో 21 శాతం మార్కెట్ వాటా కలిగి మార్కెట్ లీడర్‌గా నిలిచింది. వివో, షావోమిలను వెనక్కి నెట్టిన ఒప్పో 55 లక్షల యూనిట్ల అమ్మకాలతో రెండో స్థానంలోకి వచ్చింది. వివో 54 లక్షల యూనిట్లతో మూడో స్థానంలో, షావోమి 5లక్షల యూనిట్లతో నాలుగో స్థానంలోకి, రియల్‌మి 29 లక్షల యూనిట్ల విక్రయాలతో ఐదో స్థానంలో ఉంది.

"భారత మొబైల్ మార్కెట్ కష్టాలను ఎదుర్కొంటున్నప్పటికీ విక్రేతలు ఆశాజనకంగానే ఉన్నారు. మాస్ మార్కెట్ సెగ్మెంట్ ఇప్పటికీ నెమ్మదిగానే ఉంది. మొబైల్ మార్కెట్‌కు 2023 సవాలుతో కూడినదిగా ఉంది. ప్రీమియం సెగ్మెంట్ వృద్ధికి సిద్ధంగా ఉంది. వినియోగదారులు క్రమంగా ప్రీమియం పరికరాలపై ఎక్కువ ఖర్చు చేయడానికి ఇష్టపడతారు. ఈ విభాగంలో విజయం సాధించాలంటే, బ్రాండ్‌లు తప్పనిసరిగా లభ్యత, స్థోమత, విలువకు ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రస్తుతం ఆపిల్, సామ్‌సంగ్ భారతదేశ స్మార్ట్‌ఫోన్ ఎగుమతి వృద్ధికి దోహదం చేస్తున్నాయి. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఎగుమతి వ్యూహాలపై దష్టి పెట్టాలి." అని కెనలిస్ విశ్లేషకుడు సన్యామ్ చౌరాసియా పేర్కొన్నారు.

హెచ్‌డిఎఫ్‌సి డిప్యూటీ ఎండిగా కైజాడ్ భరుచా

న్యూఢిల్లీ : హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్‌గా కైజాడ్ భరుచా నియామకానికి ఆర్‌బిఐ ఆమోదం తెలిపింది. భరుచా నియామకం బుధవారం నుంచే అమల్లోకి వచ్చింది. 2023 ఏప్రిల్ 29 నుంచి మూడేళ్ల పాటు ఆయన ఈ హోదాలో కొనసాగనున్నారు. ఇంతక్రితం ఈ హోదాలో ఐదేళ్ల పని చేసిన పరేష్ సుక్తాంకర్ 2022 నవంబర్‌లో రాజీనామా చేశారు. భరుచాకు బ్యాంకింగ్ రంగంలో 35 ఏళ్ల విశేష అనుభవం ఉంది.

'కూ'లో 30% ఉద్యోగులకు కోత

న్యూఢిల్లీ : సోషల్ మీడియా వేదిక 'కూ'లో 30 శాతం మంది ఉద్యోగులను తొలగించినట్లు బ్లూమ్‌బర్గ్ రిపోర్ట్ చేసింది. ట్విట్టర్‌కు ప్రత్యామ్నాయంగా భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించిన కూ ఇటీవల 260 మందిపై వేటు వేసిందని పేర్కొంది. అంతర్జాతీయంగా నెలకొన్న స్థూల ఆర్థిక అంశాల నేపథ్యంలో ఉద్యోగుల కోతకు మొగ్గు చూపింది. గతేడాది ఓ దశలో ట్విట్టర్‌తో భారత అధికారులకు ఘర్షణ వాతావరణం చోటు చేసుకోవడంతో కూకు ప్రాధాన్యత పెరిగింది. బాధిత ఉద్యోగులకు పరిహార ప్యాకేజ్‌తో పాటు వైద్య బెనిఫిట్స్ సహా కొత్త ఉద్యోగాలను అన్వేశించే క్రమంలో తమ సిబ్బందికి సాయం అందిస్తామని కూ ప్రతినిధి పేర్కొన్నారు. కూ సంస్థకు అంతకుముందు ఏడాదితో పోలిస్తే మార్చితో ముగిసిన త్రైమాసికంలో 75 శాతం మేర ఫండింగ్ తగ్గిన నేపథ్యంలో తొలగింపులు చోటు చేసుకున్నాయనే సాంకేతాలు వస్తున్నాయి.

బిఎల్‌డిసి టెక్నాలజీతో సింఫనీ ఎయిర్ కూలర్లు

హైదరాబాద్ : ప్రపంచంలోనే తొలిసారి బిఎల్‌డిసి టెక్నాలజీ ద్వారా నడిచే అత్యంత శక్తివంతమైన ఎయిర్ కూలర్ల శ్రేణీని ఆవిష్కరించినట్లు ఎయిర్ కూలర్లలో గ్లోబల్ లీడర్‌గా ఉన్న సింఫనీ లిమిటెడ్ తెలిపింది. ఇతర కూలర్లతో పోలిస్తే ఇవి 60 శాతం తక్కువ విద్యుత్తును వినియోగిస్తాయని ఆ సంస్థ పేర్కొంది. ఈ శ్రేణిలో 80 లీటర్లు, 55 లీటర్లు, 30 లీటర్ల వాటర్ ట్యాంక్ సామర్థ్యంతో 3 మోడళ్లను విడుదల చేసినట్లు తెలిపింది. 7 స్పీడ్ ఆప్షన్లు, 8 గంటల వరకు నైట్ స్లీప్ మోడ్, టచ్ స్క్రీన్ కంట్రోల్ ప్యానెల్, వాటర్ ట్యాంక్ ఖాళీ అయితే అలారం లాంటి అదనపు ఫీచర్లు వీటిలో ఉన్నాయని పేర్కొంది. ఎసిలతో పోలిస్తే ఇవి కేవలం 10 శాతం విద్యుత్తునే వాడుకుంటాయని సింఫనీ లిమిటెడ్ సిఎండి అచల్ బకేరీ తెలిపారు.

ఆపిల్ రెండో స్టోర్ ప్రారంభం

న్యూఢిల్లీ : టెక్ దిగ్గజం ఆపిల్ భారత్‌లో తన రెండో స్టోర్‌ను ఢిల్లీలో ఏర్పాటు చేసింది. దీన్ని గురువారం ఆ కంపెనీ సిఇఒ టిమ్ కుక్ లాంచనంగా ప్రారంభించారు. భారీ ఎత్తున వినియోగదారులు స్టోర్‌ను సందర్శించడానికి వచ్చారు. ఈ సందర్భంగా టిమ్‌కుక్ వినియోగదారులకు స్వాగతం పలికారు. టిమ్‌కుక్ బుధవారం ప్రధాని మోడీతో భేటీ అయ్యారు. అంతక్రితం రోజు ముంబయి స్టోర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న విషయం తెలిసిందే. భారత మార్కెట్‌పై ఆపిల్ కీలక దృష్టి సారించిన నేపథ్యంలో ఇక్కడ రిటైల్ స్టోర్ల ఏర్పాటును వేగవంతం చేసింది.

గ్యారంటీలు @1,49,770 కోట్లు

- 2023 మార్చికి లెక్కలు తేల్చిన ఆర్థికశాఖ
- రుణ ప్రతిపాదనలతో కేంద్రానికి నివేదిక

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ఖజానా, ప్రభుత్వరంగ సంస్థలపై గ్యారంటీల ద్వారా తీసుకునే రుణభారం పెరిగిపోతోంది. ప్రస్తుతం పలు ప్రభుత్వరంగ సంస్థలకు రూ.లక్షన్నర కోట్ల వరకు గ్యారంటీలు ఇచ్చింది. ఇందులో కొన్ని గ్యారంటీలను ఆయా సంస్థల ఆర్థిక పరిపుష్టి మేరకు ఇవ్వగా, మరికొన్ని గ్యారంటీలను ఎస్క్రో విధానంతో ఇచ్చింది. ఈ లెక్కలను కేంద్ర ఆర్థికశాఖకు రాష్ట్ర ఆర్థికశాఖ అధికారులు సమర్పించారు. రుణ ప్రణాళిక ప్రతిపాదనలు సమర్పిస్తూ అందులోనే ఈ గణాంకాలను కూడా అధికారులు పొందుపరిచారు.

మార్చి 31 నాటికి 38 శాఖలకు ప్రభుత్వం గ్యారంటీలను ఇస్తూ రుణాలను సేకరించేందుకు అనుమతిచ్చింది. ఈ మొత్తం రూ.1,49,770 కోట్లుగా తేలింది. మొత్తం గ్యారంటీల్లో 31 ప్రభుత్వం నేరుగా ఇచ్చినవి కాగా, మరో నాలుగు షరతులతో ఇచ్చినవి. ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీల్లో పౌరసరఫరాల సంస్థకే అత్యధికంగా రూ.35 వేల కోట్లు ఉన్నాయి. అనంతరం ఎపిపిఎఫ్‌సితో కలిపి విద్యుత్ పంపిణీ సంస్థలకు రూ.31 వేల కోట్లు గ్యారంటీలుగా ఇచ్చారు. బెవరేజ్ సంస్థకు రూ.11,482 కోట్లు, ఎపి పవర్‌ఫైనాన్స్ సంస్థకు రూ.10,649 కోట్లు, జల వనరుల అభివృద్ధి సంస్థకు రూ.8,317 కోట్లు, రాజధాని అభివృద్ధి అథారిటీకి రూ.3,860 కోట్లు, రహదారుల అభివృద్ధి సంస్థకు రూ.3,312 కోట్లు, టిడ్కోకు రూ.5,070 కోట్లు, మార్క్‌ఫెడ్‌కు రూ.5 వేల కోట్లు ఇచ్చారు. గృహ నిర్మాణ సంస్థ, జెన్‌కో, సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎపిఐఐసి వంటి అనేక ఇతర సంస్థలు తీసుకునే రుణాలకు కూడా భారీగానే ప్రభుత్వం గ్యారంటీలు ఇచ్చింది. ఇలా నేరుగా గ్యారంటీలు ఇచ్చినవి రూ.1,27,803 కోట్లుగా రికార్డయ్యాయి.

కండిషనల్ గ్యారంటీల పేరిట మరో రూ.21,966 కోట్లకు ప్రభుత్వం గ్యారంటీలు ఇచ్చింది. ఇందులో కేవలం రుణాల సేకరణ కోసమే ఏర్పాటుచేసిన రాష్ట్ర అభివృద్ధి సంస్థ (ఎపిఎస్‌డిసి)కు రూ.20,106 కోట్లు గ్యారంటీ ఇవ్వడం గమనార్హం. రాష్ట రహదారుల అభివృద్ధి సంస్థకు రూ.1,660 కోట్లు, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీకి రూ.200 కోట్లు గ్యారంటీగా ఇచ్చారు. ఎపిఎస్‌డిసికి ఇచ్చిన గ్యారంటీలో మద్యంపై విధించిన అదనపు పన్నునే గ్యారంటీగా చూపించినట్లు ఆర్థికశాఖ వెల్లడించింది.

సంస్థలదే బాధ్యత

ఆయా సంస్థలు తమ సొంత ఆదాయ వనరుల నుంచే రుణాన్ని తిరిగి చెల్లించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. సంస్థలు తీసుకున్న రుణాలను పిడి ఖాతాల ద్వారా ప్రభుత్వం తీసుకోవడం, వాటిని తిరిగి సంస్థలకు ఇవ్వడంలో జాప్యం జరుగుతుండడంతో బకాయిలు చెల్లించడంలో రుణగ్రహీతలు సమస్యలను ఎదుర్కొంటున్నాయి.

ఎస్క్రోతోనే రుణాలు

గడిచిన రెండేళ్లలో భవిష్యత్తు ఆదాయాన్ని గ్యారంటీగా చూపిస్తూ రుణాలను తీసుకోవడం విశేషం. 2021-22లో మద్యంపై అదనపు పన్నును గ్యారంటీగా చూపిస్తూ ఎపిఎస్‌డిసికి రూ.4,700 కోట్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ రుణాన్ని ఆర్థిక సామాజిక అభివృద్ధి పథకాలకు, విద్య, మహిళా సాధికారతలకు ఖర్చు చేయాలని నిర్ణయించింది. రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థకు రూ.699 కోట్లు, రూ.1,211 కోట్లు చొప్పున ఇచ్చిన రెండు గ్యారంటీలకు పెట్రోల్, డీజిల్‌పై వసూలు చేసే సెస్‌ను గ్యారంటీగా చూపించడం గమనార్హం.

'పది' మూల్యాంకనం పారితోషికం పెంపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదో తరగతి పబ్లిక్ పరీక్ష పత్రాలు మూల్యాంకనం చేసే ఉపాధ్యాయుల పారితోషికాన్ని రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. ఇందుకు సంబంధించిన జిఒ 37ను పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ గురువారం విడుదల చేశారు. ఏప్రిల్ నుంచి ఈ పెరిగిన పారితోషికం వర్తిస్తుందని పేర్కొన్నారు. పెంచిన పారితోషికం వివరాలను జిఒలో పొందుపరిచారు.

డ్రైవర్లు నిరంతరం ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి

- ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ డిజిఎం అనిల్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రవాణా రంగంలోని డ్రైవర్లు తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకునేందుకు నిరంతరం ఆరోగ్యపరీక్షలు చేయించుకోవాలని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ డిజిఎం అనిల్‌కుమార్ తెలిపారు. గురువారం విజయవాడలో ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, కొండపల్లి పెట్రోలియం ట్యాంకర్స్ అసోసియేషన్‌ల ఆధ్వర్యాన డ్రైవర్లకు, యజమానులకు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. సేవ్ యంగ్ హార్ట్ ఫౌండేషన్ ఆఫ్ కిరణ్ తేజ చారిటబుల్ సహకారంతో ఏర్పాటుచేసిన ఈ ఉచిత వైద్యశిబిరాన్ని ఐఒసి డిజిఎం అనిల్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎపి లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైవి ఈశ్వరరావు, అధ్యక్షులు ఎ రవీంద్రనాథ్, కిరణ్ తేజ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు చదలవాడ భాను ప్రసాద్, డాక్టర్ ఎమ్‌సి దాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ వైద్యశిబిరంలో ఎత్తు, బరువు, రక్తపరీక్షలు, ఇసిజి, ఎకో పరీక్షలు నిర్వహించారు. డ్రైవర్లు క్రమశిక్షణతో తమ ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణను ఉంచుకోవాలని వైవి ఈశ్వరరావు సూచించారు. ఈ వైద్యశిబిరంలో 300 మంది ఉచిత వైద్యసేవలు పొందారు.

సంపాదకీయం

ప్రపంచ పోలీసు!

ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ పైన, ఇంకొందరు ఐరాస అధికారులపైన అమెరికా గూఢచర్యానికి పాల్పడడం దారుణం. విస్తుగొలిపే ఈ వాస్తవాన్ని ఇటీవల లీకైన పెంటగాన్ పత్రాలు వెల్లడించాయి. ప్రపంచంపై తన ఆర్థిక, రాజకీయ, సైనిక పెత్తనం కోసం నిరంతరం ప్రయత్నించే అమెరికా ఇటువంటి సిగ్గుమాలిన పనులకు దిగజారుతోంది. శత్రు దేశాల సంగతి అటుంచి తన మిత్ర దేశాల అధినేతలపై కూడా ఇటువంటి గూఢచర్యానికి పాల్పడుతోంది. స్వయంప్రకటిత ప్రపంచ పోలీసు మాదిరిగా వ్యవహరించే అమెరికా దూకుడుకు, దుశ్చర్యలకూ అడ్డుకట్ట వేయడం అవసరం. గూఢచర్యంపై ఐరాస తన ఆందోళనను అమెరికాకు లాంఛనంగా తెలియజేసింది. దౌత్యపరంగా అది ప్రాథమిక ప్రతిస్పందన. కానీ ప్రపంచ దేశాల ప్రతినిధిగా వున్న సంస్థ అధినేతపైన, దాని అధికారులపైనా నిఘా వేయడం ఆ సంస్థను అవమానించడం, దాని ప్రత్యేక ప్రతిపత్తిని ధిక్కరించడమే అవుతుంది. ఐరాస స్వతంత్రతకు, స్వేచ్ఛకు భంగం కలిగించే రీతిలో అమెరికా వ్యవహరించడం ఎంత మాత్రం తగదు. ఐక్యరాజ్యసమితికి ఆతిథ్యమిస్తున్న దేశంగా అమెరికా ఇటువంటి చర్యలకు పాల్పడరాదు. ఈ సిగ్గుమాలిన చర్యపై అంతర్జాతీయ సమాజానికి వివరణ ఇవ్వడం అమెరికా కనీస బాధ్యత. అగ్రరాజ్యం ఆ పని చేయకుండా ప్రజాస్వామ్యం గురించి, స్వేచ్ఛ గురించీ ఉపన్యాసాలు ఉపదేశాలు చేస్తే కుదరదు. వివిధ ప్రభుత్వాలు, అంతర్జాతీయ సమాజం గట్టిగా ఒత్తిడి చేస్తేనే అమెరికా మెడలు వంచడం సాధ్యం.

ఐరాసపై అమెరికా గూఢచర్యానికి పాల్పడడం ఇదే తొలి సారి కాదు. గతంలో ఐరాస చీఫ్‌గా బాధ్యతలు నిర్వహించిన బాన్ కి మూన్ పైన, నాటి భద్రతా మండలిలోని నాలుగు దేశాల ప్రతినిధులతో సహా పలువురిపై నిఘా వేసిందని ది గార్డియన్ పత్రిక 2010 లోనే వార్తా కథనాలిచ్చింది. 2013లో లీకైన 'ప్రిజమ్' రహస్య పత్రాలు ఆ విషయాన్ని నిర్ధారించాయి. కాబట్టి అమెరికాకు ఇటువంటి తప్పుడు పనులు చేయడం ఓ అలవాటని విదితమవుతోంది. ఏవైనా పత్రాలు లీకైతేనో పరిశోధనాత్మక జర్నలిస్టులు వెలికి తీస్తేనో ఇలాంటి దుశ్చర్యల గురించి లోకానికి తెలుస్తోంది. అసలు వెల్లడి కాకుండా ఎన్ని దాగి ఉన్నాయో! ప్రపంచ దేశాల ప్రతినిధిగా ఐక్యరాజ్య సమితి, దాని అనుబంధ సంస్థలూ వివిధ రంగాల్లో విశేష కృషి చేస్తున్నాయి. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల మొదలు అత్యంత వెనుకబడిన దేశాల వరకూ ఉన్న యావత్ ప్రపంచ ప్రజల విద్య, వైద్య, ఆరోగ్య, ఆహార అంశాలతోబాటు సాంస్కృతిక విషయాలపై కూడా పరిశీలన, అధ్యయనం చేయడమేగాక పరిష్కార మార్గాలనూ ఆయా సందర్భాల్లో సూచిస్తున్నాయి. ప్రపంచ సంస్థగా అది నిరపేక్ష వైఖరి అనుసరిస్తున్నా వెనుకబడిన దేశాలకు బాసటగా నిలవడం సహజం. అమెరికాకు ఇది కంటగింపుగా ఉంది. ఆ కారణంగానే ఐరాస కు, డబ్ల్యుహెచ్ఓ వంటి ఇతర సంస్థలకూ అమెరికా చెల్లించవలసిన నిధుల వాటా చెల్లించకపోవడం లేదా భారీగా కోతలు విధించడం జరుగుతోంది. ఇంకొన్ని జి-7 దేశాలు కూడా ఆ బాట పట్టడంతో ఐరాస, దాని అనుబంధ సంస్థల నిర్వహణకు, కార్యకలాపాలు సాగించడమూ కష్టతరమవుతోంది. ఆర్థిక దిగ్బంధనానికి తోడు నిఘా చర్యలకు పాల్పడడం సిగ్గుచేటు.

ఇప్పటికీ ప్రపంచంలో ఐ.టి రంగంలో, సాంకేతికంగా తన ఆధిపత్యం కొనసాగుతున్నందునే అమెరికా ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతోంది. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ వంటి వాటిలో తనకున్న పట్టు, డిజిటల్ వ్యవస్థల్లో అమెరికన్ కంపెనీలే పైచేయిగా ఉండం తదితర కారణాలవల్ల అగ్రరాజ్యం ఆటలు సాగుతున్నాయి. ఏమైనప్పటికీ తాజాగా వెల్లడైన గూఢచర్యంపై అమెరికా బాధ్యతాయుతమైన రీతిలో వివరణ ఇవ్వాలి. ఐరాసకు అతిథ్యమిచ్చే దేశంగా అమెరికా దాని బాధ్యతలను నెరవేర్చేందుకు ఐరాస ఛార్టర్ ప్రకారం చేపట్టాల్సిన కొన్ని కచ్చితమైన చర్యలు అమలు చేయాల్సిందే. ఆ మేరకు అంతర్జాతీయ సమాజం నుండి ఒత్తిడి పెంచాలి. అమెరికా దురహంకారానికి చెక్ పెట్టాలి.

మహనీయుల మాట

జాతీయ స్థాయిలోను, అంతర్జాతీయంగానూ అర్థవంతమైన పాత్ర పోషించగలగాలంటే... ఆధునిక శాస్త్ర విజ్ఞానాన్ని మానవ సమాజ సమస్యల పరిష్కారానికి ఉపయోగించుకోవడంలో మనం ఎవరికీ తీసిపోకుండా ఉండాలి.

- విక్రమ్ సారాభాయి,
భారత అంతరిక్ష పితామహుడు



వ్యాఖ్య

మాంద్యంలో పెట్టుబడిదారీ విధానం

పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ కారణంగా పదేపదే ఏర్పడిన ప్రపంచ మాంద్యం సాధారణ ప్రజల జీవితాల్లో అస్థిరతను సృష్టించింది. ఉదారవాద ఆర్థిక చట్రంలో ఎవరికి ఉద్యోగం పోతుందో, జీతం ఎప్పుడు తగ్గుతుందో, రిటైర్మెంట్ తర్వాత పింఛను వస్తుందో లేదో.. లాంటి అనేక అంశాలతో ప్రయివేటు ఉద్యోగులే కాదు. ప్రభుత్వోద్యోగులు కూడా అల్లాడుతున్నారు. మార్క్స్ ప్రకారం, పెట్టుబడిదారీ విధానం ఇలాంటి సంక్షోభంలో మళ్లీ మళ్లీ పడుతుంటుంది. ఈ సంక్షోభం నుంచి బయటపడేందుకు ప్రత్యామ్నాయ వామపక్షాలే ఏకైక మార్గం.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు మాంద్యంలో ఉంది. ఇంకా కచ్చితంగా చెప్పాలంటే ప్రపంచంలోని వివిధ దేశాల ఆర్థిక వ్యవస్థల్లో మూడు నాలుగు అంశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అధిక నిరుద్యోగం, అధిక ద్రవ్యోల్బణం, బ్యాంకుల దివాళా, విలీనాలతో దాదాపు అన్ని దేశాలలో ఆర్థిక వృద్ధి నిలిచిపోయింది. ఇటీవల దివాలా తీసిన క్రెడిట్ సూయిస్ బ్యాంకును యుబిఎస్ బ్యాంక్ స్వాధీనం చేసుకుంది. ప్రపంచం మరో ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోబోతున్నది.

పెట్టుబడిదారీ దేశమైన అమెరికా 2007-08 ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించడానికి, దివాలా తీసిన బ్యాంకులను రక్షించడానికి ప్రభుత్వ ఖజానాను ఉపయోగించింది. ఆ సమయంలో లేమన్ బ్రదర్స్ వంటి ఆర్థిక సంస్థలు అమెరికాలో దివాళా తీశాయి. పోటీ మార్కెట్‌ను చేరుకోవడానికి, వడ్డీ రేటును తగ్గించడం ద్వారా గృహాలను కొనుగోలు చేయడానికి రుణాలిచ్చే విధానాన్ని చేపట్టారు. కానీ ఆ తర్వాత సెంట్రల్ బ్యాంక్ (ఫెడ్) వడ్డీ రేట్లను పెంచినప్పుడు, రుణగ్రహీతలు తిరిగి చెల్లించలేనందున ఆ బ్యాంకులు, ఆర్థిక సంస్థలు అన్నీ దివాలా తీశాయి. ప్రభుత్వ సహాయంతో పెట్టుబడి మూలధనం ఆదా చేయబడింది. ఆ విధంగా ఆర్థిక మాంద్య ఛాయలను ఎదుర్కొంది.

తాజాగా మళ్లీ బ్యాంకులు కుప్పకూలడం మొదలైంది. 167 ఏళ్ల స్విస్ బ్యాంక్ క్రెడిట్ సూయిస్ దివాలా తీసింది. ఆ బ్యాంక్ ప్రత్యర్థి అయిన యుబిఎస్ ఆ దివాలా తీసిన బ్యాంకును కొనుగోలు చేయవలసి వచ్చింది. దీనికి చెల్లించింది 300 కోట్ల యు.ఎస్ డాలర్ల కంటే ఎక్కువ. అయితే, క్రెడిట్ సూయిస్‌కి అందుకు అనేక రెట్లు ఎక్కువ ఆస్తులు ఉన్నాయి. వాస్తవానికి, ఈ బ్యాంకుల కష్టాలు ప్రపంచ స్టాక్ మార్కెట్లపై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. పెట్టుబడిదారులు తమ వాటాలను విక్రయించడానికి పోటీ పడటంతో స్టాక్ మార్కెట్ పతనమైంది. మొత్తం ఆర్థిక వ్యవస్థ కుప్పకూలడానికి సిద్ధంగా వుంది. కాబట్టి దివాలా తీయకుండా నిరోధించడానికి ప్రభుత్వం చర్య తీసుకోవాలి. అంటే పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించే బాధ్యత ప్రభుత్వ ఖజానా చేపడుతుందన్నమాట.

2008 మాంద్యాన్ని అధిగమించక ముందే ప్రపంచం మొత్తం కోవిడ్ బారిన పడింది. ఒక హెచ్చరికగా, ప్రపంచం మొత్తం గృహ నిర్బంధంలోకి వెళ్లింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మళ్లీ స్తంభించింది. ఆ ఆర్థిక సంవత్సరంలో (2020-21) అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలు (వృద్ధి పరంగా) ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. ఆ ప్రభావాలను మనం ఇంకా చవిచూస్తూనే ఉన్నాం. ఖర్చు తగ్గింపు, వేతన కోతలు, పెరిగిన పని గంటలు మొదలైన వాటితో పెట్టుబడిదారీ వ్యవస్థ లాభాల బాటలోకి తిరిగి రావడానికి ప్రయత్నిస్తున్నది. ప్రయివేటు బ్యాంకులు, ఇన్సూరెన్స్, ఆర్థిక సంస్థలు, బహుళజాతి ఐటీ కంపెనీలు వేల సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తున్నాయని ప్రతిరోజూ మీడియా ద్వారా తెలుసుకుంటున్నాం. సహజంగానే, ప్రభుత్వం లేదా ఇతర మార్గాల ద్వారా ఉపాధిని పొందలేని ఈ కాలంలో, నిరుద్యోగిత రేటు పెరుగుతూనే ఉంది.

ఇందుకు భారత్ మినహాయింపు కాదు. వివిధ సంస్థలలో పనిచేస్తున్న అనేక మంది కోవిడ్ అనంతర కాలంలో ఉద్యోగాలు కోల్పోయారు. లాక్‌డౌన్ సమయంలో ఉపాధి కోల్పోయిన వలస కార్మికులు...తాము పని చేస్తున్న ప్రాంతాల నుంచి స్వంత ఊళ్లకు తిరిగి రావాల్సి వచ్చింది. తిండి కూడా తినకుండా సుదీర్ఘ ప్రయాణం చేయాల్సి వచ్చింది. వారి దుస్థితిని తెలిపే ఈ విషాద చిత్రం మన స్మృతి పథంలో నిలిచిపోయింది. ఎటువంటి ముందస్తు హెచ్చరిక లేకుండా లాక్‌డౌన్ ప్రకటించబడినప్పుడు వలస కార్మికులు తమ ఉద్యోగాలను కోల్పోయారు. వారు ఇంటికి తిరిగి రావడానికి తమ కుటుంబంతో కలిసి కాలినడకన వందల వేల కిలోమీటర్లు వెళ్లారు. చాలామంది తిరిగి రాలేదు. కొందరు రోడ్డు, రైలు మార్గంలో మృతి చెందారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగుల సంఖ్య భారీగా పెరిగిందని తాజా గణాంకాలు చెప్తున్నాయి. కోవిడ్ రాకముందు రాత్రికి రాత్రి చేపట్టిన పెద్ద నోట్ల రద్దు విధానం దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసింది. ముఖ్యంగా అసంఘటిత రంగాన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది. ఎందుకంటే నగదుతో ఎక్కువగా పని ఇక్కడే జరుగుతుంది. ఉద్యోగావకాశాలు కూడా ఇక్కడే ఎక్కువ. దీంతో ప్రజలు ఉపాధి కోల్పోయారు. దీనికి జిఎస్‌టి విధానం అమలు కూడా తోడైంది. ఈ జిఎస్‌టి అమలు, పెద్ద నోట్ల రద్దు కారణంగా ఎదురైన జంట షాక్‌లు మన ఆర్థిక వ్యవస్థను కుంగదీశాయి.

కానీ ఆశ్చర్యంగా మార్కెట్‌లో వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి పోయాయి. నిరుద్యోగం తీవ్రరూపం దాల్చింది. ప్రజల దగ్గర డబ్బు లేదు. ఇలాంటి పరిస్థితిలో నిత్యావసర వస్తువులతో సహా అన్నింటి ధరలు ఎలా, ఎందుకు పెరిగాయన్నది ఆర్థికవేత్తలను సైతం ఆందోళనకు గురిచేస్తోంది. అర్థశాస్త్రం ప్రకారం ధరలు...సరఫరా, డిమాండ్ సమతుల్యత ద్వారా నిర్ణయించబడతాయి. నిరుద్యోగం కారణంగా డిమాండ్ తగ్గడమేగాని, పెరిగే అవకాశమే లేదు. డిమాండ్ పెరిగింది కాబట్టి సరుకుల ధరలు పెరిగాయని చెప్పలేము. సరఫరా తగ్గిందని అనలేము. కోవిడ్ అనంతర కాలంలో సప్లయ్ చైన్‌కు అవాంతరాలున్నా అవి చాలా నామమాత్రమేనని చెప్పాలి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కల్లోలాన్ని సృష్టించింది. ముఖ్యంగా చమురు సరఫరా, ధర ఈ రెండూ నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలకు హేతువులే. అయితే, పెట్టుబడిదారీ యజమానులు కూడా కోవిడ్ పరిస్థితి కారణంగా నష్టాలను భర్తీ చేయడానికి ధరలను పెంచేశారు. తద్వారా లాభాలను పోగేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

ద్రవ్యోల్బణాన్ని అరికట్టడానికి సెంట్రల్ బ్యాంక్ రెపో రేటును పెంచే ద్రవ్య విధానాన్ని తీసుకుంది. సెంట్రల్ బ్యాంక్ ఇతర వాణిజ్య బ్యాంకులకు ఇచ్చే వడ్డీ రేటును రెపో రేటు అంటారు. ఈ రేటు పెరిగినప్పుడు, వాణిజ్య బ్యాంకులు కూడా తమ వడ్డీ రేట్లను పెంచుతాయి. పెట్టుబడిదారులు అధిక వడ్డీ రేట్లకు రుణం తీసుకోవడానికి ఇష్టపడరు. డిమాండ్ తగ్గుతుంది. ద్రవ్యోల్బణం తగ్గుతుంది. కానీ ద్రవ్యోల్బణాన్ని తగ్గించే ఈ మార్గం మరొక ప్రభావాన్ని చూపుతుంది. ఉదాహరణకు, వడ్డీ రేట్లు మొదట పెరిగేకొద్దీ, ఇంతకు ముందు తక్కువ వడ్డీని చెల్లించిన వారు ఇప్పుడు బ్యాంకుకు ఎక్కువ డబ్బును వడ్డీగా చెల్లించవలసి ఉంటుంది. చాలామంది అధిక వడ్డీరేట్లను భరించలేరు. దాంతో, బ్యాంకు లేదా బ్యాంకులు డబ్బు తిరిగి చెల్లించే అవకాశం తక్కువగా ఉంటుంది. బ్యాంకులు సంక్షోభంలో పడతాయి. 2008లో లేమన్ బ్రదర్స్ విషయంలో ఇదే జరిగింది. క్రెడిట్ సూయిస్ రూపంలో అదే ఇప్పుడు పునరావృతమైంది. వడ్డీ రేటు మరోసారి పెరిగితే విదేశీ పెట్టుబడులు కూడా తగ్గుతాయి. కాబట్టి దేశీయ, విదేశీ పెట్టుబడిదారులు ఇద్దరూ పెట్టుబడులు పెట్టడానికి నిరుత్సాహపడితే, ఆర్థిక వృద్ధి దెబ్బ తింటుంది. రెపో రేట్లను పెంచడం ద్వారా ద్రవ్యోల్బణాన్ని తగ్గించేందుకు ప్రపంచవ్యాప్తంగా సెంట్రల్ బ్యాంకులు ద్రవ్య విధానాన్ని అవలంబిస్తున్నాయి. కాబట్టి నయా ఉదారవాద ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్ర విష వలయంలో ఉందని చెప్పవచ్చు.

పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ కారణంగా పదేపదే ఏర్పడిన ప్రపంచ మాంద్యం సాధారణ ప్రజల జీవితాల్లో అస్థిరతను సృష్టించింది. ఉదారవాద ఆర్థిక చట్రంలో ఎవరికి ఉద్యోగం పోతుందో, జీతం ఎప్పుడు తగ్గుతుందో, రిటైర్మెంట్ తర్వాత పింఛను వస్తుందో లేదో.. లాంటి అనేక అంశాలతో ప్రయివేటు ఉద్యోగులే కాదు. ప్రభుత్వోద్యోగులు కూడా అల్లాడుతున్నారు. ఈ సమయంలో, పెట్టుబడిదారీ దేశాలైన బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కార్మికులు తమ కంపెనీలను రక్షించుకోవడానికి, పెన్షన్లను కాపాడుకోవడానికి, ఉద్యోగాలకు హామీ పొందడానికి ఉద్యమ బాట పట్టారు. లాటిన్ అమెరికా దేశాల్లో ప్రత్యామ్నాయ వామపక్ష రాజకీయాలు పుంజుకుంటున్నాయి. భారతదేశంలో రైతులు తమ డిమాండ్ల కోసం మళ్లీ లాంగ్ మార్చ్ చేశారు. కార్మికులు తమ డిమాండ్ల కోసం సమ్మె చేస్తున్నారు. బ్యాంకు-ఇన్సూరెన్స్ కార్మికులు జీతాలు, ఇతర ప్రయోజనాల కోసం ఆందోళన చేస్తున్నారు. టెలికాం కంపెనీని కాపాడుకునేందుకు కార్యకర్తలు కృషి చేస్తున్నారు. ఉద్యోగాల కోసం యువత వీధుల్లోకి వస్తున్నారు. మార్క్స్ ప్రకారం, పెట్టుబడిదారీ విధానం ఇలాంటి సంక్షోభంలో మళ్లీ మళ్లీ పడుతుంటుంది. ఈ సంక్షోభం నుంచి బయటపడేందుకు ప్రత్యామ్నాయ వామపక్షాలే ఏకైక మార్గం.

/'గణశక్తి' సంపాదకీయం/

కవిత్వం

నేటి లోకం

నీళ్ళ కోసం
కంటి నిండా కన్నీళ్ళు

విద్యుత్ కోసం
రోజంతా నిరీక్షణ

ధరల విఘాతాలకు
విలవిలలాడుతున్న
జన జీవనం

ఉద్యోగం, ఉపాధి లేక
వలస పక్షుల్లా యువత

విషపు కోరలతో
కాటేస్తున్న కల్తీ మద్యం

కులమత వైషమ్యాలతో
రక్త సిక్తమవుతూ
ప్రజానీకం

కామాంధుల దాడిలో
ప్రాణాలు విడుస్తున్న
మహిళా లోకం

విలువలు కోల్పోతున్న
ప్రజాస్వామ్యం

న్యాయ వ్యవస్థకే
రక్షణ లేని వైనం

ఓటు వేసిన
తప్పిదానికి
ఐదేళ్ళు జీవన్మరణ శిక్ష.

– కయ్యూరు బాలసుబ్రమణ్యం

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

అభిప్రాయం

ప్రశ్నను పక్కదారి పట్టించేందుకే...

నలభై మంది జవాన్లను పొట్టన పెట్టుకున్న పుల్వామా దాడిలో ఇప్పటికీ నివృత్తికాని అనేక సందేహాలను ఇటీవల ప్రముఖులు పలువురు ప్రశ్నించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అయింది. ప్రశ్నించిన వారు సాధారణ వ్యక్తులు కాదు! వారిలో ఒకరు ఘటన జరిగిన సమయంలో జమ్మూకాశ్మీర్ గవర్నర్‌గా ఉన్న సత్యపాల్ మాలిక్, మరొకరు సైనిక వ్యవహారాలపై పూర్తి పట్టున్న రిటైర్డ్ ఆర్మీ చీఫ్ జనరల్ రాయ్ చౌదరి. వారి ప్రశ్నతోనే దేశం యావత్తూ సందేహంలో మునిగిపోయింది. 2019 ఫిబ్రవరి 14వ తేదీన పుల్వామాలో సైనికుల వాహనాలు వెళుతున్న సమయంలో అనూహ్యంగా వారి వాహనాల మధ్యలోకి వచ్చిన కారు పేలిపోయింది. దేశం యావత్తూ ఆందోళనకు గురిచేసిన ఆ ఘటనలో 40 మంది వీర సైనికులు ప్రాణాలు కోల్పోయారు. దేశం కోసం నిరంతరం పరితపించే సైనికుల ప్రాణాలను ఫణంగా పెట్టిన ఆ ఘటనపై ఇప్పటికీ అనేక సందేహాలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. వాటిల్లో ఒకటి సైనికులను తరలించేందుకు విమానం ఇవ్వాలని కోరితే రక్షణశాఖ అంగీకరించలేదనేది సత్యపాల్ మాలిక్ చేసిన అత్యంత విలువైన విమర్శ. దేశంలో విమర్శలు అనేకం చేస్తుంటారు. కానీ విలువైన విమర్శలు కొన్నే ఉంటాయి. వాటిలో సత్యపాల్ చేసిన వ్యాఖ్యానాలు ఇప్పుడు యావత్ దేశాన్ని ఒకింత ఆందోళనకు గురిచేశాయనడంతో సందేహం లేదు.

ఇక్కడ ఆలోచించాల్సిన విషయం ఏమిటంటే కేంద్రంపై విమర్శలు వచ్చిన ప్రతిసారీ మొత్తం మీడియాను పక్కదారి పట్టించే ఘటనలు జరుగుతున్నాయి. అదీ బిజెపి అధికారంలో ఉన్న ఉత్తరప్రదేశ్ లోనే కావడం విశేషం. వరుసగా జరుగుతున్న అనేక అంశాల్లో ఒకే రీతిలో జరుగుతున్న ఘటనలు పలు ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ప్రస్తుతం పుల్వామాపై మాజీ గవర్నర్ లేవనెత్తిన అంశాలపై చర్చ జరుగుతున్న సమయంలో ఉత్తరప్రదేశ్‌లో బహిరంగంగా ఒక డాన్‌ను ఎన్‌కౌంటర్ చేశారు. దీంతో మీడియా ఆలోచనంతా పుల్వామా నుండి ఎన్‌కౌంటర్ వైపు మళ్లింది. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశానికంటాయని ప్రజలు ఘోషిస్తున్న సమయంలో నేపాల్ వైపు చైనా చొచ్చుకొస్తోందని ఒక రకమైన తీవ్ర ప్రచారాన్ని ముందుకు తెచ్చారు. కరోనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఉగ్రదాడులను ప్రచారం చేశారు. రైతాంగ పోరాటం సాగుతున్న సమయంలో దాన్ని పక్కదారి పట్టించేందుకు పంజాబ్‌లో ఎన్‌కౌంటర్ చేశారు. రైతాంగ ఉద్యమం కీలక దశలో ఉన్న సమయంలో ఉత్తరప్రదేశ్‌లో మంత్రి కుమారుడు కారుతో రైతులను గుద్దించి చంపారు. దీనిపై చర్చ జరుగుతున్న తరుణంలోనే బుల్డోజర్ వ్యవహారాన్ని నడిపారు. ఆ తర్వాత ఎర్రకోట ఘటన. ఇలా ఒకదాని వెంట ఒకటి నేరపూరిత ఘటనలను ముందుకు తేవడం ద్వారా యావత్ దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వారి ఆలోచనను పక్కదారి పట్టించే చర్యలకు దిగుతున్నారు. పుల్వామాపై పలువురు లేవనెత్తిన సందేహాలను ఇలాగే ఎన్‌కౌంటర్‌తో పక్కదారి పట్టించారు.

ఆ ఘటనపై సందేహాలెన్నో

పుల్వామాలో ప్రమాదకరమైన రోడ్డుమార్గంలో వందల మంది సైనికులను తరలించడం. నిఘా వైఫల్యం. ఇక్కడ పుల్వామా రహదారి దేశంలోనే అత్యంత ప్రమాదకరమైన రోడ్డని రికార్డుల్లోనే ఉంది. అటువంటి రోడ్డుపై 2500 మంది సైనికులతో కూడిన 78 వాహనాలను పంపడం. ఒకవేళ సైనికులను పంపాలి అనుకుంటే పూర్తి భద్రత కల్పించాల్సి ఉంది. కానీ సుమారు 250 కిలోలకు పైగా ఆర్‌డిఎక్స్‌ను తీసుకుని ఒక వాహనం దేశంలోకి చొరబడ టం, అది 10 నుండి 15 గ్రామాలను దాటుకుని రావడం నిఘా వ్యవస్థ పనితీరును ప్రశ్నిస్తోంది. నిజంగా నిఘా లేదా? ఆ సమయంలో పని చేయలేదా? అనే సందేహాలను రాయ్ చౌదరి ప్రశ్నించారు. ఒక పథకం ప్రకారం వారిని ఆ మార్గంలో వెళ్లేలా చేశారనే అనుమానాలనూ వ్యక్తం చేశారు. సంఘటన జరిగిన సమయంలో తాను మాట్లాడుతుంటే ఏమీ మాట్లాడవద్దని ప్రధాన కార్యాలయం ఆదేశించిందని సత్యపాల్ మాలిక్ చెప్పడం కూడా ఇక్కడ ఆలోచించాల్సిన విషయం. ఈ రెండు ప్రశ్నలూ ప్రభుత్వ ఆలోచనా తీరును బయట పెడుతున్నాయి.

ఎన్నికల సమయంలోనే పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు దేశంపై దాడి చేయడం కూడా పలు సందేహాలకు తావిస్తోంది. కేంద్ర ప్రభుత్వంపై తీవ్రమైన విమర్శలు వచ్చిన సమయంలో వాటిని పక్కదారి పట్టించే ఎన్‌కౌంటర్లు జరగడం అదీ ఉత్తరప్రదేశ్ లోనే కావడం కీలకం. విమానం అడిగితే ఎందుకు ఇవ్వలేదో చెప్పాలని సత్యపాల్ మాలిక్ అడిగిన ప్రశ్నతో కేంద్రం పూర్తిగా ఇరుకున పడింది.

– వి. గీతావాణి

విమర్శ

ఇంకా తేరుకోని నవాడా

ఎంతో ఉత్సాహంగా, భక్తిభావంతో పండుగ జరుపుకుంటున్న ప్రజలకు ఏం తెలుసు? కొద్దిసేపటికే అక్కడ పెద్ద ఎత్తున హింస చెలరేగుతుందని? తమ కళ్ల ముందే అంతా సర్వనాశనం అవుతుందని? బీహార్ లోని నవాడాలో గత నెల 31న చోటుచేసుకున్న మతపరమైన హింసాకాండ, విధ్వంసం నుండి ఇంకా ఆ ప్రాంతం తేరుకోనేలేదు. ఎక్కడ చూసినా కాలి బూడిదైన వాహనాలు, తగలబడిపోయిన దుకాణాలు, ఇళ్లు, దోపిడీకి గురైన వ్యాపార సముదాయాలే కన్పిస్తున్నాయి. ఎప్పుడూ ప్రశాంతంగా కన్పించే ఈ పురాతన నవాడా పట్టణంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా జరిగిన ఊరేగింపు హింసకు దారితీసింది. ఇప్పటికీ రోడ్లపై చెల్లాచెదురుగా పడి ఉన్న రాళ్ళు, పగిలిపోయిన గ్లాసు ముక్కలు ఆ దారుణ ఘటనకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తుంటే, అల్లరి మూకలు చెలరేగిపోయి కొన్ని గంటల పాటు విధ్వంసాన్ని సృష్టించారు.

అయితే వాస్తవానికి అక్కడ జరిగిందేమిటి? రామనవమి సందర్భంగా శోభాయాత్ర నిర్వహించేందుకు బజరంగ్‌దళ్ సంస్థకు అధికారులు అనుమతి ఇచ్చారు. ఆ రోజు దుకాణాలు తెరవొద్దంటూ నిర్వాహకులు అంతకు ముందు ప్రచారం చేశారు. శోభాయాత్రకు యాభై వేల మంది హాజరయ్యారని జిల్లా మెజిస్ట్రేట్ శశాంక్ శుభంకర్ చెప్పారు. అయితే కేవలం ఐదు వేల మందికి మాత్రమే అనుమతి ఉంది. పోలీసుల సంఖ్యతో పోలిస్తే ప్రదర్శనకారుల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. డీజేలు ఉపయోగించడం, ఆయుధాలు ధరించడం వంటి చర్యలను నిషేధించామని అధికారులు చెబుతున్నప్పటికీ ట్రక్కుల మీద పెద్ద పెద్ద లౌడ్‌స్పీకర్లను ఏర్పాటు చేశారు. రెచ్చగొట్టే పాటలు, నినాదాలను వినిపించారు. ఊరేగింపు ఒక మసీదు వద్దకు చేరగానే డీజేలలో వినిపించిన పాటల స్వరం ఒక్కసారిగా మారిపో యింది. రామమందిరం నిర్మిస్తామని, ముస్లింలకు వేరే స్థలం చూపుతామని, వారు కూడా రామ నామమే జపించాలని నినాదాలు విన్పించాయి. 'వారిని చంపండి... లేదా పాకిస్తాన్ కు పంపండి' అనే పాట విన్పించారు. ఇలాంటి రెచ్చగొట్టే పాటలు వేస్తూ... అభ్యంతరకరమైన నినాదాలు చేస్తూ... ఊరేగింపులో ముందుకు కదిలారు. జిల్లా మెజిస్ట్రేట్ కూడా దీనిని అంగీకరించారు. అయితే పోలీసులు స్వాధీనం చేసుకున్న సీడీలు, పెన్‌డ్రైవ్‌లలో అలాంటి నినాదాలు, పాటలు వినిపించలేదని సెలవిచ్చారు.

'డీజేలను నిషేధించాం. అయితే వాటిని బలవంతంగా తొలగించలేకపోయాం. అలా చేస్తే పరిస్థితి మరింత విషమిస్తుంది' అని మెజిస్ట్రేట్ చెప్పుకొచ్చారు. ప్రదర్శన మసీదు ముందుకు రాగానే కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అయితే ఇరుపక్షాల పెద్దలు నచ్చచెప్పడంతో ప్రదర్శన ముందుకు సాగింది. ఈ దశలో కొందరు గూండాలు ఇద్దరు ముస్లిం యువకులను అడ్డగించి 'జై శ్రీరామ్' అంటూ నినాదాలు చేయాలని బలవంత పెట్టారు. నిరాకరించిన యువకుడిని తీవ్రంగా హింసించారు. అంతలోనే ఒక శ్మశానవాటిక దగ్గర కాషాయ జెండాను ఎగరేయడంతో పరిస్థితి అదుపు తప్పింది. ఇరు పక్షాలు పరస్పరం ఘర్షణకు దిగాయి. తొక్కిసలాట జరిగింది. దుండగులు రెండు బస్సులకు నిప్పుపెట్టారు. వాహనాలు, దుకాణాలు, ఇళ్లను తగలబెట్టారు. ముందస్తు ప్రణాళికతోనే ఈ విధ్వంసానికి పాల్పడ్డారు. అధికార జె.డి.యు కు చెందిన నాయకుడి సిటీ ప్యాలెస్‌కు నిప్పు పెట్టారు. ఈ ఘటనలో మూడంతస్థుల ఆ మ్యారేజ్ హాలు పూర్తిగా ధ్వంసమైంది. వెయ్యి మంది సాయుధ దుండగులు ఆ భవనాన్ని చుట్టుముట్టడంతో ఎవరూ అక్కడికి వెళ్లలేకపోయారు. అదే సమయంలో అల్లరి మూకలు రోడ్లపై రాళ్లు రువ్వారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. డి.వి.ఆర్‌ను ఎత్తుకెళ్లారు. పోలీసులకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎవరూ స్పందించ లేదు. అగ్నిమాపక వాహనాలు వచ్చేసరికే అంతా బూడిద అయింది. సిటీ ప్యాలెస్ ఎదురుగా ఉన్న ఓ హోటల్‌కు కూడా దుండగులు నిప్పంటించారు. జనరేటర్‌ను తగలబెట్టడంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో సి.సి టీవీ కెమేరాలు పని చేయలేదు. ముస్లింల దుకాణాలు, ఇళ్లు, ప్రార్థనా స్థలాలే లక్ష్యంగా దాడులు జరిగినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సుమారు వెయ్యి మంది మతోన్మాదులు ఓ మసీదులో ప్రవేశించి రెండు గుమ్మటాలను కూల్చేశారు. క్యాంపస్‌లో నిలిపివున్న వాహనాలను తగలబెట్టారు. సుమారు 45 నిమిషాల పాటు విధ్వంసం సాగినా పోలీసులు ఆ ఛాయలకు కూడా రాలేదు. పండ్లు, కూరగాయలు అమ్ముకునే వారిని కూడా దుండగులు వదలలేదు. వారికీ జీవనోపాధి లేకుండా చేశారు. ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు.

మరో ఘటనలో వెయ్యి మంది మతోన్మాదులు పెట్రోల్ బాంబులతో మదర్సాపై దాడి చేసి తగలబెట్టారు. లైబ్రరీ లోని ఐదు వేల పుస్తకాలు అగ్నికి ఆహుతయ్యాయి. 'డిజిటల్ దునియా' పేరిట షాపు నడుపుతున్న ఆజామ్ తన అనుభవాన్ని వివరిస్తూ తన దుకాణాన్ని అల్లరిమూకలు దోచుకున్నారని వాపోయారు. ఇప్పటి వరకూ ఎవరూ తనకు సాయపడలేదని చెప్పారు. బీహార్‌లో రామనవమి సందర్భంగా జరిగిన హింసాకాండ చరిత్రలో చీకటి అధ్యాయంగా నిలిచిపోతుంది. ఈ ఘటన అనేక మంది హృదయాలను గాయపరిచింది. ఆ గాయాలు మానడానికి చాలా సమయం పడుతుంది.

– ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

ఏలూరు జిల్లా ముసునూరు మండలంలో మూడు కరోనా కేసులు నమోదయ్యాయి. ముసునూరులో 1, చింతలవల్లిలో 2 కేసులు నమోదైనట్లు పిహెచ్‌సి వైద్యులు కిరణ్‌కుమార్ తెలిపారు.

వడదెబ్బతో ఉపాధి కార్మికుడు మృతి

ప్రజాశక్తి-పత్తికొండ (కర్నూలు) : ఎండ వేడికి తాళలేక ఉపాధి కార్మికుడు మృతి చెందిన సంఘటన కర్నూలు జిల్లా పత్తికొండ మండలం హోసూరు గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు ఉపాధి కార్మికుడు కోరిచిన్న రామాంజనేయులు గత రెండు రోజుల క్రితం ఉపాధి పని చేస్తూ కళ్ళు తిరిగి కింద పడిపోయారు. తోటి కూలీలు గమనించి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి గురువారం మరణించారు. మృతుని కుటుంబానికి రూ. 10 లక్షల పరిహారం చెల్లించాలని ఉపాధి కార్మికులు డిమాండ్ చేశారు.

మేడే స్ఫూర్తితో కార్మిక చట్టాల అమలుకు పోరు

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - ఏలూరు

ప్రాణత్యాగాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీప్రభుత్వం అత్యంత సంపన్నుల కోసం మార్పులు చేయడం సిగ్గుచేటని, కార్మికచట్టాలను మేడే స్ఫూర్తితో పటిష్టంగా అమలు చేసుకోవాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. ఏలూరు జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు అధ్యక్షతన గురువారం జరిగింది. ముఖ్యఅతిథి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, భారత రాజ్యాంగం, లౌకికవాదం, ఫెడరలిజం, మత సామరస్యం అంటే ఏమాత్రం ఇష్టంలేని బిజెపి దేశంలో మతోన్మాదాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఒకశాతం పెట్టుబడిదారుల కోసం దేశ ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టడం దుర్మార్గమన్నారు. కార్మికవర్గాలకు రక్షణగా ఉన్న 44 చట్టాలను కార్పొరేట్ల కోసం నాలుగు లేబర్ కోడ్లుగా మార్చారన్నారు. మోడీ పాలనలో నిరుద్యోగం రోజురోజుకీ పెరుగుతుందన్నారు. రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం చేసిన బిజెపితో మన రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన అంటకాగుతున్నాయన్నారు. మేడే స్ఫూర్తితో బిజెపి నుంచి దేశాన్ని, ప్రజానీకాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం మేడే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డి.ఎన్.వి.డి.ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో 27 మండలాల్లో అన్ని పట్టణాల్లో మేడే పతాకావిష్కరణలు, ప్రదర్శన, సభలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులోకం పెద్దసంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. నేతలు బి.సోమయ్య, కె.విజయలక్ష్మి, జి.రాజు, ఎం.నాగమణి, కె.వెంకట్రావు, ఎస్.రాంబాబు, ఆర్‌విఎస్.నారాయణ, ఎస్‌కె.సుభాషిణి, వి.సాయిబాబా పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా కోసం వికలాంగుడి పోరు

ధర్మవరం చేరుకున్న మూడు చక్రాల సైకిల్‌యాత్ర

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విశాఖపట్నం రైల్వేజోన్ కోసం మూడు చక్రాల సైకిల్ యాత్ర చేపట్టినట్లు వికలాంగుడు ప్రసాద్ తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం బుర్రా గ్రామానికి చెందిన తాను 2018లోనే ఇచ్ఛాపురం నుండి ఉమ్మడి జిల్లా అనంతపురానికి మూడు చక్రాల సైకిల్ యాత్రను ప్రారంభించానన్నారు. అయితే కరోనా కారణంగా 2020లో నంద్యాల వరకు యాత్ర నిర్వహించి నిలిపివేశానన్నారు. అతదుపరి తిరిగి ఈఏడాది జనవరి మొదటి వారం నుండి సైకిల్ యాత్రను ప్రారంభించినట్లు చెప్పారు. 23 జిల్లాలోనూ ఈ సైకిల్ యాత్ర నిర్వహించి ఢిల్లీకి వెళ్లానన్నారు. తాను నిర్వహించిన ఈ యాత్రలో జిల్లాలో ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని ఢిల్లీ పెద్దల దృష్టికి తీసుకెళ్లానన్నారు. ప్రతి నియోజకవర్గంలో రెవెన్యూ పోలీసు తనకు సహకరిస్తున్నారని ఆయన తెలిపారు. గురువారం రాత్రి ధర్మవరానికి చేరుకున్నానని, తిరిగి శుక్రవారం ఉదయం బయలుదేరి లేపాక్షి వరకు ఈ యాత్రను కొనసాగిస్తానని ప్రసాద్ తెలిపారు.

భారతీయ టెకీ అనురాగ్ మలూని గుర్తించిన రెస్క్యూ బృందం

ఖాట్మండ్ : నేపాల్‌లో గల్లంతైన భారతీయ టెకీ అనురాగ్ మలూ (34) ని రెస్క్యూ బృందం గుర్తించింది. మలూ పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆయన సోదరుడు సుధీర్ తెలిపారు. రాజస్థాన్‌లోని కిషన్‌గఢ్ కి చెందిన మలూ గతవారం కొంత మంది పర్వతారోహకులతో కలిసి మౌంట్ అన్నపూర్ణ ఎక్కారు. సోమవారం కిందకి దిగుతూ 6,000 మీటర్ల ఎత్తు నుండి కిందకి జారిపడిపోయిన సంగతి తెలిసిందే. రెస్క్యూ బృందాలు ఆయనను గుర్తించాయని.... పరిస్థితి విషమంగా ఉండటంతో ఆస్పత్రికి తరలించినట్లు ఆయన సోదరుడు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 8,000 మీటర్ల పైన ఉన్న మొత్తం 14 శిఖరాలను అధిరోహించడంతో పాటు ఐరాస గ్లోబల్ గోల్స్‌ను సాధించే లక్ష్యంతో అనురాగ్ మలూ ఈ మిషన్ చేపట్టారు. దీంతో మొత్తం ఏడు ఖండాల్లోని ఏడు ఎత్తైన పాయింట్లను అధిరోహించే లక్ష్యంతో ఉన్నారు. 2041 అంటార్కిటికా యూత్ అంబాసిడర్‌గా ఇండియా నుంచి ఎంపికయ్యారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

అచ్చెన్నాయుడుకు మంత్రి అప్పలరాజు సవాల్

ప్రజాశక్తి - పలాస (శ్రీకాకుళం జిల్లా)

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై అదే పనిగా అసత్య ప్రచారం చేస్తున్న టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు... టిడిపి హయాంలో, నాలుగేళ్ల వైసిపి పాలనలో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు సవాల్ విసిరారు. కాశీబుగ్గలోని ప్రభుత్వ అతిథిగృహంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు హయాంలో ఉత్తరాంధ్ర అభివృద్ధికి చేసిందేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు ఒక్క పోర్టు గాని, హార్బర్ గాని కనీసం శంకుస్థాపన చేసినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని, చంద్రబాబు కనీసం ఆ ఆలోచన కూడా చేయలేకపోయారని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల పూర్వయాన రాష్ట్రం మొత్తమ్మీద నాలుగు ప్రాంతాల్లో 6 పోర్టులు మాత్రమే ఉండేవని, వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 46 నెలల కాలంలో మరో నాలుగు పోర్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. సంతబొమ్మాళి మండలం మూలపేటలో 24 మిలియన్ టన్నుల సామర్థ్యంతో, నాలుగు బెర్తులతో నిర్మించనున్నట్లు పోర్టులో వేల సంఖ్యలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం తీరంలో రూ.365.81 కోట్లతో ఫిషింగ్ హార్బర్‌తో పాటు వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేట వద్ద ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌ను ఫిషింగ్ హార్బర్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ సిఎం ప్రకటించడంపై కృతజ్ఞతలు తెలిపారు.

21న ఉగ్రం టీజర్



హీరో నరేష్, విజయ్ కనకమేడల దర్శకత్వంలో 'ఉగ్రం' సినిమా చేస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా మే 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో వరుస అప్‌డేట్‌లు ప్రకటిస్తూ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నారు. సినిమా ట్రైలర్‌ను ఈ నెల 21న రిలీజ్ చేయనున్నట్లు ఓ వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోలో గాని (శ్రీను, శివ కుమార్ ఇలా నరేష్ పోషించిన రెండు పాత్రలతో విభిన్నంగా రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కుతున్న చిత్రాన్ని షైన్ స్క్రీన్ పతాకంపై సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మిస్తున్నారు. మిర్నా మీనన్ హీరోయిన్‌గా నటిస్తుంది. శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్న ఈ సినిమాకు అబ్బూరి రవి మాటలు రాస్తున్నారు.

దక్షిణమధ్య రైల్వే

ఇ-టెండరింగ్ ఆహ్వాన ప్రకటన (thorughhttp://ireps.gov.inద్వారా)

భారత రాష్ట్రపతి తరపున, సిపిఇ (నిర్మాణము), ద.మ.రైల్వే, సికింద్రాబాద్ వారు దిగువ పనుల కొరకు ఇ-టెండరును ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం.: 1. **నిట్ నం.:** 11-సిపిఇ-సిఎస్‌సి-2023 తేది: 03.04.2023 మరియు సవరణ నం.1 తేది: 11.04.2023, **పని పేరు:** ఎస్‌సిఆర్ నిర్మాణ సంస్థ- నడికుడి-శ్రీకాలహస్తి స్టేషన్ల మధ్య -కొత్త బిజి లైన్-గుండ్లకమ్మ మరియు కనిగిరి (సహా) మధ్య సిహెచ్.73450మీ. నుండి సిహెచ్.155000మీ.ల వరకు పి-వే మెటీరియల్స్ రవాణాచేయుట, బిజి ట్రాక్ లేయింగ్& లింకింగ్, పాయింట్స్& క్రాసింగ్స్ అసెంబ్లింగ్& ఇన్సర్షన్, స్టోన్ బలాస్ట్ లీడింగ్& డంపింగ్ మరియు ఇతర చిన్నపాటి పనుల నిర్వహణ ప్రతిపాదన. **అంచనా విలువ (రూ):** 44,04,77,734.12 పై.లు, **ధరావత్తు (రూ):** 23,52,400/- **పూర్తిచేయు కాలవ్యవధి:** 18 (పద్దెనిమిది) నెలలు. **తెరుచు తేది:** 27.04.2023న 15:00గం.లు.

క్ర.సం.: 2. **నిట్ నం.:** 12-సిపిఇ-సిఎస్‌సి-2023 తేది: 12.04.2023. **పని పేరు:** ఎస్‌సిఆర్ నిర్మాణ సంస్థ- గుంటూరు-గుంతకల్ (డబ్లింగ్)- చీకటీగాలపాలెం స్టేషన్ వద్ద ప్రతిపాదిత బలాస్ట్ డిపో వద్ద ఫెన్సింగ్, అప్రోచ్ రోడ్, కెర్బ్ వాల్ మరియు చిన్నపాటి పనులుచేయుట. **అంచనా విలువ (రూ):** 2,28,37,725.71 పై.లు **ధరావత్తు (రూ):** 2,64,200/-, **పూర్తిచేయు కాలవ్యవధి:** 04 (నాలుగు నెలలు), **తెరుచు తేది:** 04.05.2023న 15:00గం.లు.

క్ర.సం.: 3. **నిట్ నం.:** 13-సిపిఓ-సిఎస్‌సి-2023 తేది: 12.04.2023. **పని పేరు:** ఎస్‌సిఆర్ నిర్మాణ సంస్థ- నాందేడ్ డివిజన్-అకోలా- ఖన్వాడ్ సెక్షన్-అకోట్-అమల్లాఖుర్ద్ సెక్షన్ మధ్య ఎంజి నుండి బిజికి ట్రాక్ గేజ్ మార్చుట (ఫేజ్-3)-తుఖాతాడ్-అడ్గాన్ బజుర్గ్ స్టేషన్ల మధ్య వివరణాత్మక ప్రాజెక్టు రిపోర్టు, ప్లాన్స్, డ్రాయింగ్స్, ల్యాండ్ ప్రపోజల్స్& ఇతర సంబంధిత పత్రాలను తయారుచేయుటతో సహా ఉసర్ని మరియు జామోద్ (కొత్త స్టేషన్లు) మధ్య ప్రతిపాదిత టన్నల్ (6.65కి.మీ.ల పొడవు) కొరకు మరియు వాటిపై డైవర్షన్ అలైన్‌మెంట్ (73.917కి.మీ.) కొరకు సర్వే, డిజైన్ మరియు జియోటెక్నికల్ ఇన్వెస్టిగేషన్స్ చేపట్టుట. (80.567కి.మీ.). **అంచనా విలువ (రూ):** 10,87,03,791.10 పై.లు, **ధరావత్తు (రూ):** 6,93,500/-, **పూర్తిచేయు కాలవ్యవధి:** 06 (ఆరు) నెలలు. **తెరుచు తేది:** 04.05.2023న 15:00గం.లు

1. బిడ్ పత్రం మరియు ఇతర వివరాల కొరకు, దయచేసి వెబ్‌సైట్. www.ireps.gov.inను లాగిన్‌చేయండి.
2. టెండరుదారులు టెండరు ముగింపుకు ఏదైతే పదిహేను రోజుల ముందుగానే టెండరు దాఖలుచేయు కాలవ్యవధిలో వారి ఆఫర్లను ఆన్‌లైనులో దాఖలుచేయవలెను.
3. టెండరుదారులు ఏవేని సవరణ (ఆన్‌లైన్ ద్వారా మాత్రమే జారీచేయబడుతాయి)ను టెండరు దాఖలుచేయు కాలవ్యవధి ప్రారంభ తేదీ వరకు వీక్షించవచ్చును.

చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, నిర్మాణము, సికింద్రాబాద్.

టి. టెండరు నం. డిప్యూటీ సిఇ/జిఎస్/ఎస్‌సి/13-15/2023/ఓటి. తేది: 19.04.2023

భారత రాష్ట్రపతి తరపున, క్రింది సంతకందారు దిగువ పనుల కొరకు ఇ-టెండరును ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం.: 1. **ఇ-టెండరు నం.:** 13-జిఎస్-ఎస్‌సి-23-ఓటి. **పని పేరు:** సికింద్రాబాద్ డివిజన్: అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ క్రింద స్టేషన్ ప్రమాణాలు పెంచు పనులు కొరకు ప్రాజెక్టు సూపర్‌వైజన్ సర్వీసెస్ (పిఎస్ఎస్) ఏర్పాటుచేయుట మరియు గాటి శక్తి యూనిట్ లో సంబంధిత పనులుచేపట్టుట. **సుమారు టెండరు విలువ (రూ)లలో:** 2,88,03,968/- **ధరావత్తు (రూ):** 2,94,000/- **పూర్తిచేయు కాలవ్యవధి నెలల్లో:** 18. **నిర్వహణ కాలవ్యవధి నెలల్లో:** నిల్. **స్టాండర్డ్ అర్హతా నియమావళికు స్వభావతీరుగా పరిగనించు పనులు:** ప్రతిపాదిత (ఆర్ఎఫ్‌పి) పత్రం కొరకు అభ్యర్థన ప్రకారం మ్యాన్‌పవర్ కొరకు క్రిటేరియా& ఎవల్యూషన్. **ముగింపు తేది/ సమయం:** 19.05.2023న 14:00గం.లు.

క్ర.సం.: 2. **ఇ-టెండరు నం.:** 14-జిఎస్-ఎస్‌సి-23-ఓటి. **పని పేరు:** హైటెక్ సిటీ, హఫీజ్‌పేట్ & కరీంనగర్- అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ క్రింద రైల్వే స్టేషన్ల వద్ద కవర్ ఓవర్ ప్లాట్‌ఫారాలు ఏర్పాటుచేయుట. **సుమారు టెండరు విలువ (రూ)లలో:** 7,49,66,762/- **ధరావత్తు (రూ):** 5,24,800/- **పూర్తిచేయు కాలవ్యవధి నెలల్లో:** 09. **నిర్వహణ కాలవ్యవధి నెలల్లో:** 36. **స్టాండర్డ్ అర్హతా నియమావళికు స్వభావతీరుగా పరిగనించు పనులు:** బి-5: స్ట్రక్చరల్ స్టీల్ పనుల ఫ్యాబ్రికేషన్/ ఎరెక్షన్/ లాంచింగ్ కలిగియున్న ఏవేని సివిల్ ఇంజినీరింగ్ పని. **ముగింపు తేది/సమయం:** 12.05.2023న 14:00గం.లు.

క్ర.సం.: 3. **ఇ-టెండరు నం.:** 15-జిఎస్-ఎస్‌సి-23-ఓటి. **పని పేరు:** సికింద్రాబాద్ డివిజన్: (ఎస్‌డబ్ల్యు-1) అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ క్రింద (అటాచ్‌చేసిన లొకేషన్ల జాబితా-11నం.లు) ర్యాంప్‌తో 12 మీటర్ల వెడల్పు ఎఫ్ఓబి ఏర్పాటుచేయుట, (ఎస్‌డబ్ల్యు-2) లిఫ్టులు ఏర్పాటుచేయుట (సివిల్ భాగం)(అటాచ్‌చేసిన లొకేషన్ల జాబితా-35నం.లు), (ఎస్‌డబ్ల్యు-3) ఎస్కలేటర్స్ ఏర్పాటుచేయుట (సివిల్ భాగం) (అటాచ్‌చేసిన లొకేషన్ల జాబితా-28నం.లు). **సుమారు టెండరు విలువ (రూ)లలో:** 1,37,18,17,050/- **ధరావత్తు (రూ):** 70,09,100/- **పూర్తిచేయు కాలవ్యవధి నెలల్లో:** 09. **నిర్వహణ కాలవ్యవధి నెలల్లో:** 36. **స్టాండర్డ్ అర్హతా నియమావళికు స్వభావతీరుగా పరిగనించు పనులు:** బి-5: స్ట్రక్చరల్ స్టీల్ పనుల ఫ్యాబ్రికేషన్/ ఎరెక్షన్/ లాంచింగ్ కలిగియున్న ఏవేని సివిల్ ఇంజినీరింగ్ పని. గమనిక: రీఇన్‌ఫోర్స్‌మెంట్ స్టీల్ పరిమాణం మరియు కాంక్రీట్ పరిమాణం లు స్వభావ అనుభవం నిమిత్తం పరిగణించబడవు. **ముగింపు తేది/సమయం:** 26.05.2023న 14:00గం.లు.

1. టెండరుదారులు ఇ-టెండరింగ్ ద్వారా మాత్రమే పాల్గొవలెను మరియు మాన్యువల్ ఆఫర్లు పరిగణించబడవు.
2. ఆసక్తిగల టెండరుదారులు అందరూ ధరావత్తు మొత్తాన్ని ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా మాత్రమే చెల్లించవలసిందిగా కోరబడుచున్నది.
3. ఏ కారణం చూపకుండానే టెండరును రద్దుచేయు అధికారాలు రైల్వేలు కలిగియుంటారు.
4. ఆసక్తిగల టెండరుదారులందరూ జిఎస్‌టిఇన్ గుర్తింపు నం.లు పొంది మరియు దానిని వారి ఆఫర్‌తోపాటు దాఖలుచేయవలసిందిగా సలహా ఇవ్వబడుచున్నది.

డిప్యూటీ చీఫ్ ఇంజినీర్/ గాటి శక్తి/ సికింద్రాబాద్

ఇ-టెండరు ప్రకటన నం. 405/డిఆర్ఎం/డబ్ల్యు/జిఎన్‌టి తేది: 18.04.2023 PUB/0395

క్రింది సంతకందారు దిగువ పేర్కొన్న పనుల కొరకు 12.05.2023న 15:30గం.ల వరకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం.: 1. **టెండరు ఐడి:** 2564. **సీనియర్ డిఇఎన్/డిఇఎన్:** ఉత్తరం, **పని వివరణ:** టిఎఫ్‌టిఆర్: కి.మీ.23.621 నుండి 29.16 వరకు మొత్తం 5.539కి.మీ.ల దూరం కొరకు జిఎన్‌టి-ఎన్‌డికెడి సెక్షన్ (ఎస్ఎల్) లో ఆర్‌డిఎస్ఓ/2020/జిఇ: ఐఆర్ఎస్-0004 ప్రమాణాలు ప్రకారం బ్లాంకెటింగ్ మెటీరియల్‌తో త్రూ ఫార్మేషన్ ట్రీట్మెంట్. **అంచనా విలువ (రూ)లలో:** 5,67,71,848.79 పై.లు **ధరావత్తు (రూ):** 4,33,900/-

క్ర.సం.: 2. **టెండరు ఐడి:** 2565. **సీనియర్ డిఇఎన్/డిఇఎన్ ఉత్తరం, పని వివరణ:** టిఎఫ్‌టిఆర్: కి.మీ.12.00 నుండి 12.80, కి.మీ.17.00 నుండి 20.20 వరకు మొత్తం 4.00కి.మీ.ల దూరం కొరకు జిఎన్‌టి-ఎన్‌డికెడి సెక్షన్ (ఎస్ఎల్) లో ఆర్‌డిఎస్ఓ/2020/జిఇ: ఐఆర్ఎస్-0004 ప్రమాణాలు ప్రకారం బ్లాంకెటింగ్ మెటీరియల్‌తో త్రూ ఫార్మేషన్ ట్రీట్మెంట్. **అంచనా విలువ (రూ)లలో:** 4,20,58,951.95 పై.లు **ధరావత్తు (రూ):** 3,60,300/-

క్ర.సం.: 3. **టెండరు ఐడి:** 2566. **సీనియర్ డిఇఎన్/డిఇఎన్:** పడమర, **పని వివరణ:** ఎస్‌డబ్ల్యు-1: సిటిఆర్(పి)-38.635కి.మీ.ల దూరం కొరకు జిఎన్‌టి-ఎన్‌డిఎల్ సెక్షన్‌లో బలాస్ట్ యొక్క డీప్ స్క్రీనింగ్ మరియు 35 సె.మీ.లకు బలాస్ట్ కుషన్ పెంచుట మరియు రీక్యూప్మెంట్‌తోసహా కొత్త పిఎస్‌సి6 స్లీపర్లు 1660నం./కి.మీ.ల పై కొత్త 60కెజి/ఆర్260 రేయిల్స్‌తో పిఎస్‌సి5 స్లీపర్ల 1310/1540/1660 డెన్సిటీ పై ప్రస్తుత 52కెజి/72 & 90యుటిఎస్ రెయిల్స్ యొక్క పూర్తి ట్రాక్ రినెవల్ (ప్రైమరీ). ఎస్‌డబ్ల్యు-2: టిఆర్ఆర్(పి)- 0.825కి.మీ.ల దూరం కొరకు జిఎన్‌టి-ఎన్‌డిఎల్ సెక్షన్ లో కొత్త 60కెజి/ఆర్260 రేయిల్స్‌తో పిఎస్‌సి6 స్లీపర్ల 1540/1660 డెన్సిటీ పై ప్రస్తుత 52కెజి/90యుటిఎస్ రెయిల్స్ యొక్క పూర్తి ట్రాక్ రినెవల్ (ప్రైమరీ). ఎస్‌డబ్ల్యు-3: సిటిఆర్(పి)-5.633కి.మీ.ల దూరం కొరకు జిఎన్‌టి-ఎన్‌డిఎల్ సెక్షన్‌లో బలాస్ట్ యొక్క డీప్ స్క్రీనింగ్ మరియు 35 సె.మీ.లకు బలాస్ట్ కుషన్ పెంచుట మరియు రీక్యూప్మెంట్‌తోసహా కొత్త పిఎస్‌సి6 స్లీపర్లు 1660నం./కి.మీ.ల పై కొత్త 60కెజి/ఆర్260 (ఎల్‌డబ్ల్యుఆర్) రేయిల్స్‌తో పిఎస్‌సి5 స్లీపర్ల 1310/1540/1660 డెన్సిటీ పై ప్రస్తుత 52కెజి/72 & 90యుటిఎస్ రెయిల్స్ యొక్క పూర్తి ట్రాక్ రినెవల్ (ప్రైమరీ). ఎస్‌డబ్ల్యు-4: సిటిఆర్(పి)-1.797కి.మీ.ల దూరం కొరకు పిజిడిపి-ఎన్‌డికెడి సెక్షన్‌లో బలాస్ట్ యొక్క డీప్ స్క్రీనింగ్ మరియు 35 సె.మీ.లకు బలాస్ట్ కుషన్ పెంచుట మరియు రీక్యూప్మెంట్‌తోసహా కొత్త పిఎస్‌సి6 స్లీపర్లు 1660నం./కి.మీ.ల పై కొత్త 60కెజి/ఆర్260 రేయిల్స్‌తో పిఎస్‌సి5 స్లీపర్ల 1310/1540/1660 డెన్సిటీ పై ప్రస్తుత 52కెజి/72 & 90యుటిఎస్ రెయిల్స్ యొక్క పూర్తి ట్రాక్ రినెవల్ (ప్రైమరీ). **అంచనా విలువ (రూ)లలో:** 4,39,86,687.06 పై.లు **ధరావత్తు (రూ):** 3,69,900/-

తదుపరి టెండర్ నియమాలు/వివరాలు మరియు టెండర్ డాక్యుమెంట్ల డౌన్‌లోడ్ కోసం దయచేసి వెబ్‌సైట్ https:www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.inని సందర్శించండి.

దక్షిణమధ్య రైల్వే
మమ్మల్ని @SCRailwayindia ద్వారా అనుసరించవచ్చు, ద.మ రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చు.

ఇ-టెండరు ప్రకటన నం. జిఎన్‌టి/క్యాటెరింగ్/01/2023 తేది: 18.04.2023 PUB/0401

భారత రాష్ట్రపతి తరపున, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే, గుంటూరు డివిజన్, గుంటూరు వారు దిగువ వివరించబడినట్లుగా 5 సం॥ల కాలవ్యవధి కొరకు దిగువ క్యాటెరింగ్ యూనిట్లు నిర్వహించుటకు లైసెన్స్ మంజూరుచేయుట కొరకు ఆసక్తిగల పార్టీల నుండి ఇ-బిడ్స్‌ను ఆహ్వానింపబడుచున్నవి.

టెండరు ప్రకటన నంబరు	స్టేషన్ పేరు & క్యాటగరీ	యూనిట్ పేరు	స్టాల్ ఐడి	ప్లాట్‌ఫారం నం.	లొకేషన్	రిజర్వుడ్ ఫర్	వార్షికానికి కేటాయించిన లైసెన్స్ ఫీజు	ధరావత్తు డిపాజిట్ (రూ.)	టెండరు విధానం
Catg/01/2023	గుంటూరు-ఎ	టీ స్టాల్	GMU-1	1	ఎన్ఎల్‌పిడి చివరి వైపు	జెనరల్	12,42,670/-	3,23,100/-	రెండు ప్యాకెట్ల విధానం
Catg/02/2023	గుంటూరు-ఎ	టీ స్టాల్	GMU-8	2&3	ప్లాట్‌ఫారం మధ్యలో	జెనరల్	5,79,700/-	1,50,800/-	
Catg/03/2023	గుంటూరు-ఎ	టీ స్టాల్	GMU-9	4&5	సబ్ వేకు ఎదురుగా	జెనరల్	13,40,314/-	3,48,500/-	
Catg/04/2023	నల్లగొండ-బి	టీ స్టాల్	MU-19	1	జిఎన్‌టి చివరి వైపు	మహిళల జనరల్	1,10,583/-	28,800/-	
Catg/05/2023	నల్లగొండ-బి	జ్యూస్ స్టాల్	MU-20	1	బుకింగ్ ఆఫీసు దగ్గరలో	జెనరల్	2,05,337/-	53,400/-	
Catg/06/2023	గుంటూరు-ఎ	మిల్క్ బార్	MS-1	1	టిఇఎల్ చివరి వైపు	జెనరల్	2,18,000/-	56,700/-	సింగిల్ ప్యాకెట్ విధానం
Catg/07/2023	గుంటూరు-ఎ	మిల్క్ బార్	MS-2	2&3	ప్లాట్‌ఫారం మధ్యలో	జెనరల్	2,16,000/-	56,200/-	
Catg/08/2023	నంద్యాల-బి	మిల్క్ బార్	MS-4	2&3	ప్లాట్‌ఫారం మధ్యలో	జెనరల్	76,000/-	19,800/-	
Catg/09/2023	నల్లగొండ-బి	మిల్క్ బార్	MS-7	1	జిఎన్‌టి చివరి వైపు	జెనరల్	56,500/-	14,700/-	
Catg/10/2023	నడికుడి-డి	మిల్క్ బార్	MS-6	2&3	ప్లాట్‌ఫారం మధ్యలో	జెనరల్	35,000/-	9,100/-	

టెండరు పత్రంను www.ireps.gov.inలో వీక్షించవచ్చును మరియు వెబ్‌సైట్ www.ireps.gov.inవద్ద దాఖలుచేయవచ్చును. టెండరుదారులు/బిడ్డరుదారులు తప్పనిసరిగా తరగతి-3 డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికేట్‌ను కలిగియుండవలెను& తప్పనిసరిగా ఐఆర్ఇపిఎస్ పోర్టల్ పై రిజిస్టర్‌చేసుకొని యుండవలెను. రిజిస్టర్‌చేసుకొన్న టెండరుదారులు/ బిడ్డరుదారులు మాత్రమే ఇ-టెండరింగ్‌లో పాల్గొనవచ్చును. అన్ని సంబంధిత పత్రాలను ఇ-టెండరింగ్ లో పాల్గొను సమయంలో అప్‌లోడ్‌చేయవలెను. మాన్యువల్ ఆఫర్లు పరిగణించబడవు. ధరావత్తును నెట్ బ్యాంకింగ్ లేదా పేమెంట్ గేట్‌వే విధానంలో సమర్పించవలెను.
గమనిక: టెండరుదారులు డిజిటల్ సర్టిఫికేట్‌తో సంతకంచేసిన సరైన టెండరు ఫారంను అప్‌లోడ్ చేయవలెను.

ముఖ్యమైన తేదీలు

ప్రచురించు తేది	20.04.2023
ముగింపు తేదీ& సమయం	16.05.2023 15.00 గం.లకు
టెండరు ఆహ్వానించు అధికారి	సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, డివిజనల్ రైల్వే మేనేజర్ వారి కార్యాలయం, గుంటూరు డివిజన్, దక్షిణ మధ్య రైల్వే, గుంటూరు-6

తదుపరి వివరాల కొరకు, బిడ్డరుదారులు క్రింది సంతకందారున్ని ఏదేని పనిదినమున సంప్రదించవచ్చును. ప్రకటన వెబ్‌సైట్ http://www.ireps.gov.in పై అప్‌లోడ్‌చేయబడినది.

A0562

ఈడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
Edelweiss Ideas create, values protect

రిజిస్టర్డ్ ఆఫీస్: 5వ ఫ్లోర్, టవర్ 3, వింగ్ బి, కోహినూర్ సిటీ మాల్, కోహినూర్ సిటీ, కిరోల్ రోడ్, కుర్లా (వెస్ట్), ముంబయి 400070
రీజినల్ ఆఫీస్: మెసెర్స్.ఈడల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఎవిఆర్ ఆర్కెడ్, నం.40-9-76/3, సాయి నగర్, బెంజి సర్కిల్ వద్ద, విజయవాడ-520010.

ఇ-వేలం- చట్టబద్ధమైన 15 రోజుల విక్రయ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్ట్ 2002, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 క్రింద ఇ-వేలం ద్వారా విక్రయం.
సాధారణ ప్రజలకు, ముఖ్యంగా రుణగ్రహీత/హామీదారులకు ఈ నోటీసు ద్వారా తెలియచేయునది ఏమనగా రుణబకాయిల రికవరీ ప్రక్రియ పూర్తయ్యే వరకూ జమ అయ్యే వడ్డీ, ఇతర వర్తించే ఖర్చులు, ఛార్జీల కోసం ఈ దిగువ పేర్కొనబడిన ఆస్తి 'ఎక్కడ ఎలా వున్నది అలా, అక్కడ ఏది వుంటే అది' అన్న ప్రాతిపదికపై విక్రయించబడును. ఈ దిగువ పేర్కొన్న ఆస్తిని రుణగ్రహీత(లు), సహరుణగ్రహీత(లు), హామీ దారు(లు) పొందిన రుణ సౌకర్యాల కోసం మెస్సర్స్ ఈడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు తనఖా పెట్టబడినవి. ఈ దిగువ పేర్కొనబడిన సెక్యూర్డ్ అస్సెట్స్‌ను సెక్యూర్డ్ క్రెడిటార్ లాంఛనపూర్వకంగా స్వాధీనం చేసుకున్నారు.

క్ర. సం	రుణగ్రహీత/సహ రుణగ్రహీత/ హామీదారుల పేరు	రికవరీ మొత్తం	రిజర్వ్ ధర, ఇఎండి	వేలం తేదీ, సమయం	తనిఖీ తేదీ మరియు సమయం
1.	సత్యనారాయణ జిదగం (రుణగ్రహీత), ఎస్ వెంకట రామరాజు (సహ రుణగ్రహీత) మరియు శ్రీ హరి ఆనియన్స్ (సహ రుణగ్రహీత)	రుణఖాతా నెం.LVIJPSC0000048574 లో బకాయి మొత్తం రు.2,29,26,396.80/- (రెండు కోట్ల ఇరవై తొమ్మిది లక్షల ఇరవై ఆరు వేల మూడు వందల తొంభై ఆరు రూపాయల ఎనభై పైసలు మాత్రము) 18.04.2023 నాటికి + దానిపై తదుపరి వడ్డీ + లోను బకాయి రికవరీ వరకు చట్టపరమైన ఖర్చులు.	రూ.2,00,96,055/- (రెండు కోట్ల తొంభై ఆరు వేల యాభై ఐదు రూపాయలు మాత్రము) ధరావత్తు మొత్తం డిపాజిట్ రూ.20,09,605.5/- (ఇరవై లక్షల తొమ్మిది వేల ఆరు వందల ఐదు రూపాయల ఐదు పైసలు మాత్రమే)	11.05.2023 ఉ.11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకూ (5 నిమిషముల అపరిమిత స్వీయ పొడిగింపుతో)	2.5.2023 ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకూ

సెక్యూర్డ్ అస్సెట్ వివరాలు: కృష్ణాజిల్లా, విజయవాడ రిజిస్ట్రేషన్ జిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రీ, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, విజయవాడ, భవానిపురం వద్ద ఉన్న ఆర్.ఎస్.నం.16/1బి మరియు 16/1ఎ లో ఉన్న రెసిడెన్షియల్ సైట్ విస్తీర్ణం 637.97 చ.గ.లు. లేదా 533.42 చ.మీ.లు. తో కలిసి ఎసిసి రేకుల షెడ్ తో అన్నీ సైలభ్య హక్కులు, మున్సిపల్ వార్డు నం.29, పాత మూల్యాంకనం నం.31047/861, కొత్త మూల్యాంకనం నం.340252, డో.నం.76-17-860, క్రింది విధంగా ఉన్న సరిహద్దులు: తూర్పు: 40 అడుగుల వెడల్పు రోడ్డు, దక్షిణం: మహమ్మద్ కబీర్ పాషా యొక్క ఆస్తి, పడమర: పొన్నం వెంకయ్య యొక్క ఆస్తి, ఉత్తరం: కె.పుష్ప యొక్క ఆస్తి.

గమనిక:1. వేలం ప్రక్రియ ఆన్‌లైన్‌లో https://sarfaesi.auctiontiger.net ద్వారా నిర్వహించబడును. కేవలం తమ ఇ-మెయిల్, ఐడి ప్రూఫ్, ఫొటోప్రూఫ్, పాన్‌కార్డ్ కలిగి, ఇఎండిని DEMAND DRAFT/ NEFT/RTGS ద్వారా చెల్లించిన బిడ్డర్లు మాత్రమే ఆన్‌లైన్ ఇ-వేలంలో పాల్గనేందుకు అర్హులు.
2. ఆసక్తి కలిగిన బిడ్డర్లు తమ ఇఎండిని లబ్దిదారు సంస్థ ఈడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థకు- డిమాండ్ డ్రాఫ్ట్/ఆర్‌టిజిఎస్/ఎన్ఇఎఫ్‌S ద్వారా చెల్లించాల్సి వుంటుంది.
లబ్దిదారుని పేరు: ఈడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
3. బ్యాంక్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతా నెం.65226845199, SARFAESI- Auction, EDELWEISS HOUSING FINANCE LIMITED, IFSC code: SBIN0001593.
4. ఇఎండితో సహా ఆన్‌లైన్‌లో బిడ్‌ఫారమ్ దరఖాస్తును దాఖలు చేయుటకు చివరి తేదీ 10.05.2023

మొబైల్ నెం.8885462308
తేదీ: 21.04.2023

సం/- అధీకృత అధికారి
ఈడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

వేసవిలో విద్యుత్ సంక్షోభం ?

సౌర విద్యుత్ ఉత్పత్తే పరిష్కారం

న్యూఢిల్లీ : దేశంలోని పలు ప్రాంతాలలో ఈ సంవత్సరం మార్చి నెలలోనే వేసవి తన ప్రతాపం చూపించింది. ఈ నెలలో అయితే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరుకున్నాయి. దీంతో విద్యుత్ సరఫరాపై ఒత్తిడి పెరిగింది. పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ కారణంగా విద్యుత్ డిమాండ్ అధికంగా ఉంటోంది. మరోవైపు రాత్రి సమయాలలో డిమాండ్ కంటే సరఫరా 1.7 శాతం తక్కువగా ఉంది. రాత్రి సమయంలో గరిష్టంగా 217 గిగా వాట్ల (ఒక గిగా వాట్ అంటే బిలియన్ వాట్లు) విద్యుత్ డిమాండ్ ఉంటోంది. ఇది గత సంవత్సరపు గరిష్ట డిమాండ్ కంటే 6.4 శాతం అధికం. ఈ దశలో సౌర విద్యుత్ ఉత్పత్తి పరిస్థితిని కొంత చక్కదిద్దే అవకాశం ఉంది.

అన్నాడిఎంకె అధినేతగా పళనిస్వామికి గుర్తింపు

- రెండు ఆకుల గుర్తు కేటాయింపు : ఇసి

న్యూఢిల్లీ : అన్నాడిఎంకె (ఎఐఎడిఎంకె) ప్రధానకార్యదర్శిగా ఇడప్పడి కె పళనిస్వామిని గుర్తిస్తున్నట్లు భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) గురువారం ప్రకటించింది. దీంతో పాటు రెండు ఆకుల ఎన్నికల చిహ్నాన్ని కూడా కేటాయిస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు పళనిస్వామికి ఎన్నికల సంఘం ఒక లేఖ రాసింది. 'ఎఐఎడిఎంకె పార్టీ నిబంధనలను, మార్గదర్శకాలకు చేసిన సవరణలను గుర్తిస్తున్నాం' అని ఇసి తన లేఖలో పేర్కొంది. పళనిస్వామిని అన్నాడిఎంకె అధినేతగా గుర్తించడంతో కర్ణాటకలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడిఎంకె రెండు ఆకుల గుర్తుతో పోటీ చేయవచ్చు.

షాంఘై సమావేశానికి పాక్ మంత్రి

ఇస్లామాబాద్ : భారత్‌లో జరిగే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) విదేశాంగ మంత్రుల సమావేశానికి పాకిస్థాన్ మంత్రి బిలావల్ భుట్టో జర్దారి కూడా హాజరుకానున్నారు. ఇదే జరిగితే భారత్‌లో పాక్ విదేశాంగ మంత్రి పర్యటించడం 12 ఏళ్ల తరువాత ఇది తొలిసారి కానుంది. ఎస్‌సిఒలో భారత్, చైనా, రష్యా, పాకిస్థాన్ సభ్యులుగా ఉన్నాయి. ఎస్‌సిఒ సమావేశం మే 4 నుంచి రెండు రోజుల పాటు గోవాలో జరగనుంది. భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఆహ్వానం మేరకు ఈ సమావేశంలో భుట్టో జర్దారీ పాల్గొంటారని పాకిస్థాన్ విదేశాంగ కార్యాలయం అధికార ప్రతినిధి ముంతాజ్ జహ్రా బలోచ్ గురువారం మీడియాకు తెలిపారు. చివరిసారిగా 2011లో అప్పటి పాక్ విదేశాంగ మంత్రి హినా రబ్బానీ భారత్‌లో పర్యటించారు.

మరో 'క్లీన్‌చిట్'

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పుడు అహ్మదాబాద్ కోర్టు నిర్దోషిగా విడిచి పెట్టింది. నరోడా గ్రామంలో మారణకాండకు సంబంధించి నమోదైన ఎఫ్ఐఆర్‌లో మొత్తం 86 మందిని నిందితులుగా పేర్కొన్నారు. వీరందరిపైనా ఛార్జిషీట్ కూడా దాఖలు చేశారు. వీరిలో 18 మంది విచారణ సమయంలో చనిపోయారు. ఒకరిని ఇదివరకే నిర్దోషిగా ప్రకటించారు. తదనంతరం 2009 వరకు విచారణ కొనసాగింది. 67 మంది విచారణను ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో కేసు నమోదైన 21 ఏళ్ల తర్వాత న్యాయస్థానం తీర్పు వెలువరించింది. వాస్తవానికి ఈ నెల 5ననే కేసు విచారణ పూర్తి అయ్యింది. ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి ఎస్‌కె బక్షి ఈ తీర్పును గురువారం వెలువరించారు. 67 మందిని నిర్దోషులుగా ప్రకటించారు. తీర్పు వెలువరించిన సమయంలో కోర్టుకు ఇద్దరు మినహా నిందితులందరూ హాజరయ్యారు. నిందితులపై హత్య, దోపిడి, చట్ట విరుద్ధంగా సమావేశమవ్వడం, నేరపూరిత కుట్ర, తదితర తీవ్రమైన నేరాలకు సంబంధించిన వివిధ సెక్షన్ల కింద అభియోగాలు మోపారు. తీర్పు వెలువడిన వెంటనే నిందితుల బంధువులు, మద్దతుదారులు 'జై శ్రీరామ్', భారత్ మాతకి జై అంటూ నినాదాలతో హోరెత్తించారు. నరోడా గ్రామంలో చోటుచేసుకున్న ఈ మారణకాండ పై సుప్రీంకోర్టు నియమించిన సిబిఐ మాజీ డైరెక్టర్ ఆర్‌కె రాఘవన్ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తు చేపట్టింది. సిట్ ప్రత్యేక న్యాయస్థానం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా 187 మంది సాక్షులను, బాధితులను సిట్ విచారించింది. తగిన సాక్ష్యాధారాలు సమర్పించి దోషులకు శిక్ష వేయించడంలో సిట్ విఫలమైందన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

వలస, అసంఘటిత కార్మికులకు

మూడు నెలల్లో రేషన్ కార్డులు

- రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సుప్రీంకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం నేతృత్వంలోని 'ఇ-శ్రమ్' పోర్టల్‌లో నమోదైన వలస, అసంఘటిత కార్మికులందరికీ మూడు నెలల్లోగా రేషన్ కార్డులను అందజేయాలని రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. వలస కార్మికులకు డ్రై రేషన్, ఓపెన్ కమ్యూనిటీ కిచెన్లపై 2021లో జారీ చేసిన సుప్రీంకోర్టు ఆదేశాలను కేంద్ర ప్రభుత్వం, కొన్ని రాష్ట్రాలు పాటించడం లేదని పేర్కొంటూ సామాజిక కార్యకర్తలు హర్ష్ మందర్, అంజలి భరద్వాజ్, జగదీప్ చోకర్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లాతో కూడిన ధర్మాసనం గురువారం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించారు. జనగణన చేపట్టకపోవడం, తాజా జనాభా లెక్కలు వివరాలు లేకపోవడం కారణంగా 10 కోట్ల మంది పైగా ప్రజలు రేషన్ బియ్యానికి కూడా నోచుకోవడం లేదని ఆయన పేర్కొన్నారు. జాతీయ ఆహార భద్రతా చట్టం-2013లో రక్షిత గొడుగు నుండి రేషన్ కార్డులు కూడా వీరికి మంజూరు కాలేదన్నారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా నిర్ణయించిన ఆహార భద్రతా చట్టం కింద కవరేజీ ప్రస్తుత జనాభాకు ఎంతమాత్రమూ చాలదని, వెంటనే కవరేజీని పెంచి ప్రజలందరికీ తిండి గింజలు అందేలా చూడాలని కోరారు. ప్రశాంత్ భూషణ్ వాదనతో సానుకూలంగా స్పందించిన ధర్మాసనం తదనుగుణంగా ఏర్పాట్లు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసింది. 'ప్రస్తుతం కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ పోర్టల్‌లో నమోదైన వలస కార్మికులకు జాతీయ ఆహార భద్రతా చట్టం (ఎన్ఎఫ్ఎస్ఎ) కింద ప్రయోజనాలను పొందేందుకు విస్తృత ప్రచారం కల్పించాలి. ఇ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న వారికి రేషన్ కార్డులను జారీ చేయాలి. ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి మరో మూడు నెలలు సమయం ఇస్తున్నాం. కలెక్టర్ల కార్యాలయాన్ని సంప్రదించి విజ్ఞప్తి చేసినవారికీ, పోర్టల్‌లో నమోదైనవారికి రేషన్ కార్డులు జారీ చేయాలి. తద్వారా జాతీయ ఆహార భద్రతా చట్టం-2013 ప్రయోజనాన్ని పొందవచ్చు' అని ధర్మాసనం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇదివరకు తాము ఇచ్చిన ఆదేశాలపై స్థాయి నివేదికను నివేదించాలని కేంద్ర ప్రభుత్వానికి ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబర్ 3న వాయిదా వేసింది.

ఇ-శ్రమ్ పోర్టల్‌లో నమోదైన 28.55 కోట్ల మంది వలస, అసంఘటిత కార్మికులు రేషన్ కార్డులను కలిగి ఉన్నారా? వారందరికీ ఆహార ప్రయోజనాలను అందించారా? లేదా? అనేది తెలియజేయాలని గత విచారణలో సుప్రీంకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. జాతీయ ఆహార భద్రతా చట్టం, గ్రామీణ, పట్టణ పేదలకు లక్షిత ప్రజా పంపిణీ వ్యవస్థ (టిపిడిఎస్) కింద సబ్సిడీతో కూడిన ఆహార ధాన్యాలను పొందేందుకు కార్మికులు అర్హులేనని, పోర్టల్‌లో నమోదు మాత్రమే సరిపోదని ధర్మాసనం అప్పట్లో వ్యాఖ్యానించింది. ప్రభుత్వాల పథక ప్రయోజనాలు నిరుపేదలకు చేరడం అత్యవసరమని స్పష్టం చేసింది. వలస కార్మికులు ఎందరున్నారు? అసంఘటిత కార్మికుల సంఖ్య ఎంత? వంటి గణాంకాలకు సంబంధించిన సమాచారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం ఇచ్చిపుచ్చుకోవడం వంటి అంశాలపై మాకు ఆసక్తి లేదు. దానికంటే మిన్నగా కార్మికులందరికీ తిండి గింజలు అందుతున్నాయా? లేదా? అనేదే మాకు ప్రధానం. దీనికి కావాల్సిన ఏర్పాట్లు చేయండి' అని ఈ కేసులో ప్రభుత్వం తరుపున కోర్టుకు హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటికి జస్టిస్ ఎంఆర్ షా స్పష్టం చేశారు.

సిఎం తల తెగ నరుకుతా !..అని

బెదిరించినోడికి బిజెపి టిక్కెట్

- శివమొగ్గ నుంచి చెన్నబసప్ప పోటీ
- మాజీ మంత్రి ఈశ్వరప్ప కుమారుడికి మొండి చేయి

బెంగళూరు : బిజెపికి ఎలాంటి వ్యక్తులు కావాలో, దాని భావజాలమేంటో మరోమారు ప్రస్ఫుటమైంది. శివమొగ్గ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు ఎస్ఎన్ చెన్నబసప్పకు బిజెపి టిక్కెట్ ఇచ్చింది. అయితే చెన్నబసప్ప 8 ఏళ్ల కిందట నాటి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తలను తెగ నరుకుతా అంటూ బెదిరింపులకు పాల్పడి అప్పట్లో అరెస్టు కూడా అయ్యారు. ఇప్పుడు అదే చెన్న బసప్ప మే 10న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో శివమొగ్గ నుంచి బిజెపి తరుపున బరిలో నిలుస్తుండటంపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 59 ఏళ్ల వయస్సున్న చెన్నబసప్ప అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తూ బుధవారం సాయంత్రం బిజెపి అధినాయకత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నామినేషన్ల దాఖలుకు చివరి రోజు అయిన గురువారం నాడు ఆయన తన నామినేషన్ దాఖలు చేశారు. ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కెఎస్ ఈశ్వరప్ప తదితరులతో కలిసి ర్యాలీగా వెళ్లి చెన్నబసప్ప నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు.

ఈశ్వరప్ప ఆశలు అడియాసలు

ఎన్నికల రాజకీయాల నుంచి తాను వైదొలుగుతున్నట్లు ఈ నెల 11న ఈశ్వరప్ప ప్రకటించారు. అయితే ఆయన తన స్థానంలో తన కుమారుడు కెఇ కంతేశ్‌కు బిజెపి టిక్కెట్ ఇస్తుందని ఆశించారు. బిజెపి అధినాయకత్వం ఆయనకు మొండి చేయి చూపింది. ఆయన ఆశలపై నీళ్లు కుమ్మరించి వివాదస్పదుడైన చెన్నబసప్పకు పచ్చజెండా ఊపింది. టిక్కెట్ కావాలంటే 'తల తెగ నరుకుతా' అని బెదిరించి సమర్థత చాటుకోవాలా? అంటూ స్వపక్షంలోనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే మాజీ ముఖ్యమంత్రి జగదీష్ శెట్టార్ వంటి సీనియర్ నేతలకు టిక్కెట్ నిరాకరించడంతో వారంతా తిరుగుబాటు జెండా ఎత్తి కాంగ్రెస్, తదితర పార్టీల్లో చేరిన సంగతి తెలిసిందే.

చెన్నబసప్ప నేపథ్యం..

చెన్నబసప్ప శివమొగ్గ సిటీ మున్సిపల్ కౌన్సిల్‌కు, ఆ తర్వాత శివమొగ్గ సిటీ కార్పొరేషన్‌కు అనేక పర్యాయాలు ఎన్నికయ్యారు. విశ్వ హిందూ పరిషత్, బజ్‌రంగ్ దళ్ వంటి హిందూత్వ సంస్థల్లో చెన్నబసప్ప క్రియాశీలకంగా ఉంటూ ఇతర మతాల పట్ల విద్వేషాన్ని వెళ్లగక్కుతూ ఉంటారన్న విమర్శలు ఆయనపై మొదటి నుంచీ ఉన్నాయి. 2015 నవంబరు 2న అప్పటి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గోమాంసం (బీఫ్) వినియోగంపై చేసిన వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ హిందూత్వ సంఘాలు ఒక నిరసన కార్యక్రమం చేపట్టాయి. ఈ కార్యక్రమంలో చెన్న బసప్ప కూడా పాల్గొన్నారు. శివమొగ్గలో బీఫ్ వినియోగిస్తే దానికంటే ముందుగానే ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తలను నరికేస్తానని చెన్నబసప్ప తీవ్రమైన హెచ్చరికలు చేశారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ శివమొగ్గ శాఖ అధ్యక్షులు పివి విశ్వనాథ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మత ప్రాతిపదికన వైషమ్యాలు సృష్టించి ప్రజల్లో చీలికలు తెచ్చేందుకు కుట్ర పన్నుతారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో చెన్నబసప్పను అదే ఏడాది నవంబరు 3న పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం బెయిల్‌పై ఆయనను విడుదల చేశారు. ఆసక్తికరమైన విషయమేమిటంటే తీవ్రమైన బెదిరింపులకు పాల్పడిన చెన్నబసప్పతో తమకు సంబంధం లేదన్నట్లుగా బిజెపి అప్పట్లో నాటకాలు ఆడింది. ఇప్పుడు అదే చెన్నబసప్పకు బిజెపి టిక్కెట్ ఇవ్వడం లౌకిక వాదులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నామినేషన్ అనంతరం చెన్నబసప్ప మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో తప్పకుండా విజయం సాధిస్తానని తెలిపారు.

కనీసం కారు లేదట!

బిజెపి అభ్యర్థిగా శివమొగ్గ నుంచి నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా చెన్నబసప్ప తన ఆస్తిపాస్తుల వివరాలను అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తాను 9వ తరగతి వరకే చదువుకున్నట్లు తెలిపారు. తనకు, తన భార్యకు కలిసి రూ.1.05 కోట్ల విలువ చేసే ఆస్తులున్నట్లు పేర్కొన్నారు. దంపతులిద్దరికీ కలిసి మూడు ద్విచక్ర వాహనాలు ఉన్నాయని, అయితే కారు మాత్రం లేదని ప్రకటించారు.

కోవిడ్ కారణంగా 6.7 కోట్ల మంది పిల్లలు టీకాలకు దూరం

ఐరాస: కోవిడ్ మహమ్మారి లాక్ డౌన్లు, ఆరోగ్య సంరక్షణకు అంతరాయాల కారణంగా 2019-21 మధ్య ప్రపంచ వ్యాప్తంగా6 కోట్ల 70 లక్షల మంది పిల్లలు సాధారణ వ్యాక్సిన్‌లను పాక్షికంగా లేదా పూర్తిగా కోల్పోయారని ఐక్యరాజ్యసమితి సమగ్ర శిశుఅత్యయిక నిధి (యునిసెఫ్) బుధవారం వెల్లడించింది.6.7 కోట్ల మంది పిల్లల్లో 4.8 కోట్ల మంది సాధారణ వ్యాక్సిన్‌లను పూర్తిగా కోల్పోయారని యునిసెఫ్ తాజా నివేదిక తెలిపింది. 112 దేశాల్లో ముఖ్యంగా ఆఫ్రికా, దక్షిణాసియా దేశాల్లో పిల్లలు ఎక్కువగా నష్టపోయారని ఐరాస పిల్లల ఏజెన్సీ ఆందోళన వ్యక్తం చేసింది. కోవిడ్‌కు ముందు 86 శాతంగా ఉన్న సాధారణ వ్యాక్సినేషన్ కోవిడ్ మహమ్మారి దెబ్బకు 81 శాతానికి పడిపోయింది. 2008 తరువాత ఇంత తక్కువకు పడిపోవడం ఇదే మొదటిసారి. దీంతో పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుదల నిలిచిపోయిందని యునిసెఫ్ నివేదిక పేర్కొంది. టీకాలు ప్రతి సంవత్సరం 44 లక్షల మంది పిల్లలను కాపాడతాయి. టీకాల విషయంలో ఎవరూ వెనకబడకూడదు అన్న ఐరాస 2030 లక్ష్యం నెరవేరాలంటే ఈ టీకాల కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలి. ఎక్కువ మంది పిల్లలు ఆరోగ్యంగా, దీర్ఘకాలం జీవించేలా చేయడంలో టీకాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. 1963లో టీకా కార్యక్రమం చేపట్టక ముందు తట్టు వ్యాధితో యేటా 26 లక్షల మంది పిల్లలు చనిపోయేవారు. తట్టు వ్యాధికి టీకాలు వేశాక ఈ మరణాలు చాలా వరకు తగ్గిపోయాయి. యునిసెఫ్ ఇమ్యునైజేషన్ కార్యక్రమానికి నిధుల కొరత వెంటాడుతోంది. ఐరాస వేదికపై పెద్ద పెద్ద మాటలు చెప్పే దేశాలు ఈ టీకా కార్యక్రమానికి నిధులు అందించడంలో వెనకబడుతున్నాయని యునిసెఫ్ నివేదిక పేర్కొంది.

కిలో కాప్సికమ్ ఒక రూపాయే !

ధర లేక రోడ్డుపై పారబోస్తున్న పంజాబ్ రైతులు

లూధియానా : తాము కష్టపడి పండించిన కాప్సికమ్ పంటకు కనీస ధర కూడా లభించకపోవడంతో పంజాబ్‌లోని మన్సా జిల్లా రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కిలోకు రూపాయి ధర మాత్రమే పలుకుతుండడంతో పంటను రోడ్డు పైనే పారబోసి నిరసన తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి భగవంత్ మాన్ సూచన మేరకు తాము కాప్సికమ్ పంట వేశామని, ఇప్పుడేమో కనీస ధర కూడా లభించక నిండా మునిగిపోయామని రైతులు తెలిపారు. ముఖ్యమంత్రి మాటలు విని ఐదు ఎకరాలలో పంట వేశానని, ఇప్పుడేం చేయాలో తోచడం లేదని గోరాసింగ్ అనే రైతు వాపోయారు. సీజన్ ప్రారంభంలోనే ఇంత తక్కువ ధర పలుకుతోందని, 15-17 కిలోల సంచీని 15 రూపాయలకు కొంటున్నారని చెప్పారు. పంజాబ్‌లో ఏడున్నర లక్షల ఎకరాలలో కూరగాయలు పండిస్తున్నారు. వీటిలో సుమారు నాలుగు వేల ఎకరాలలో కాప్సికమ్ వేశారు. ఈ సంవత్సరం ఇతర రాష్ట్రాల నుండి కూడా పంట పెద్ద ఎత్తున పంజాబ్‌కు రావడంతో ధర ఒక్కసారిగా పడిపోయింది. కోవిడ్ సమయంలో సైతం కిలో 10-15 రూపాయల ధర పలికిందని రైతులు గుర్తు చేశారు. ఆ తర్వాత 2020, 2021 సంవత్సరాలలో కూడా కిలో 20 రూపాయల వరకూ పలికింది. తమను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని రైతులు విమర్శించారు. పంటను కొల్‌కతా తీసికెళ్లి అమ్ముకునేందుకు సాయపడాలని వారు కోరుతున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం పెదవి విప్పడం లేదు.

క్యూబా అధ్యక్షుడిగా కానెల్ తిరిగి ఎన్నిక

హవానా : క్యూబా అధ్యక్షుడిగా డియాజ్ కానెల్ తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 462 మంది సభ్యులు గల క్యూబా జాతీయ అసెంబ్లీ బుధవారం ఆయనను రెండవ పర్యాయం అధ్యక్షుడిగా ఎన్నుకుంది. ఆయన మరో అయిదేళ్ల పాటు ఈ బాధ్యతల్లో కొనసాగనున్నారు. కానెల్ ఎన్నికను జాతీయ అసెంబ్లీ అధిపతి ఎస్టెబాన్ లాజ్ లాంఛనంగా ప్రకటించారు. 62 ఏళ్ల ఈ ఎలక్ట్రికల్ ఇంజినీర్ 2018లో మొదటిసారి క్యూబా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. 1959 క్యూబన్ విప్లవం తరువాత పుట్టి ఆ దేశ అత్యున్నత పదవిని అధిష్టించిన మొదటి వ్యక్తి ఈయనే. ఫైడెల్ కాస్ట్రో, ఆయన సోదరుడు రావుల్ కాస్ట్రో తరువాత క్యూబా సారథ్య బాధ్యతలు చేపట్టిన కానెల్ గత అయిదేళ్లలో అనేక సవాళ్లను దీటుగా ఎదుర్కొని దేశాన్ని సోషలిస్టు మార్గంలో నడిపించారు. కానెల్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు 2021 నవంబరులో అమెరికా కుట్ర పన్నింది.అంతేకాదు, 1960 వ దశకం నుంచి క్యూబాకు వ్యతిరేకంగా అమెరికా కొనసాగిస్తున్న ఆర్థిక దిగ్బంధనం, ఆంక్షల మధ్య క్యూబా ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించడంలో కానెల్ సఫలీకృతుడయ్యారు.

రాహుల్‌కు దక్కని ఊరట

- శిక్షను నిలిపివేయాలన్న పిటిషన్‌ను తిరస్కరించిన సూరత్ సెషన్స్‌కోర్టు
- అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయాలు వినియోగించుకుంటాం : కాంగ్రెస్

న్యూఢిల్లీ : కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీకి ఎదురుదెబ్బ తగిలింది. 'మోడీ' ఇంటిపేరు వ్యాఖ్యలపై పరువు నష్టం కేసులో తనకు విధించిన రెండేండ్ల శిక్షను నిలిపివేయాలని ఆయన చేసిన అభ్యర్థనను సూరత్ సెషన్స్ కోర్టు తోసిపుచ్చింది. దీంతో అనర్హత వేటు నుంచి రాహుల్ గాంధీ తప్పించుకోవడం దాదాపు అసాధ్యమని నిపుణులు, విశ్లేషకులు తెలిపారు. ఈ పరువునష్టం కేసులో సూరత్‌లోని మెట్రోపాలిటన్ మేజిస్ట్రేటు కోర్టు రాహుల్ గాంధీకి రెండేండ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పిన విషయం తెలిసిందే. పై కోర్టులో సవాలు చేసేందుకు వీలుగా 30 రోజుల గడువును సైతం రాహుల్‌కు కల్పించింది. అనంతరం పార్లమెంటరీ సెక్రెటేరియట్ ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేసింది. దీంతో ఇప్పటికే ఆయన ప్రభుత్వ బంగ్లాను సైతం ఖాళీ చేశారు.

దీంతో రాహుల్ తనకు విధించిన శిక్షను నిలుపుదల చేయాలంటూ సూరత్ సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. శిక్ష నిలుపుదలతో పాటు తనను దోషిగా తేలుస్తూ ఇచ్చిన తీర్పును సైతం నిలిపివేయాలంటూ కోర్టులో రెండు పిటిషన్లను దాఖలు చేశారు. ట్రయల్ కోర్టు ఈ కేసుపై పారదర్శకంగా విచారణ జరపకుండా కఠినంగా వ్యవహరించిందనీ, ఇది రెండేండ్ల జైలు శిక్ష విధించాల్సిన కేసు కాదని రాహుల్ తన పిటిషన్‌లో కోరారు. శిక్షను నిలిపేయకపోతే తన ప్రతిష్టకు నష్టం కలుగుతుందని వివరించారు. రాహుల్ పిటిషన్‌పై న్యాయమూర్తి ఆర్‌పీ మొగేరా గత గురువారం (ఈనెల 13న) వాదనలు విన్నారు. దీనిపై గురువారం తీర్పును వెలువర్చారు. అలాగే, ఈనెల 3న విచారణ చేపట్టిన కోర్టు.. రాహుల్‌కు బెయిల్‌ను మంజూరు చేసిన విషయం విదితమే.

అయితే రాహుల్ పిటిషన్‌ను తిరస్కరిస్తూ సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పుపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. చట్టప్రకారం తమకు అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయాలను వినియోగించుకుంటామని తెలిపింది. ఈ మేరకు ఆ పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ట్వీట్ చేశారు. సెషన్స్ కోర్టు తీర్పును సవాలు చేస్తూ గుజరాత్ హైకోర్టు లేదా సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం రాహుల్‌కు ఉన్నదని నిపుణులు తెలిపారు.

ఎన్‌టిసి మిల్లుల కార్మికుల ధర్నా

చెన్నయ్ : కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని జాతీయ టెక్స్‌టైల్ కార్పొరేషన్ (ఎన్‌టిసి) మిల్లుల్లో పనిచేస్తున్న కార్మికులు గురువారం కోయంబత్తూరు సహా వివిధ ప్రాంతాల్లో ధర్నా చేపట్టారు. తమిళనాడులో ఎన్‌టిసి మిల్లులు ఆరున్నాయి. ఆందోళనలో భాగంగా మిల్లుల వద్ద వంటా వార్పు కార్యక్రమం చేపట్టి కార్మికులు నిరసన తెలియజేశారు. వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కోయంబత్తూరులో జరిగిన ఆందోళనలో దాదాపు 500 మంది కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు. వీరిలో 150 మంది మహిళలు కూడా ఉన్నారు. 2020 ఏప్రిల్ నుంచి ఈ మిల్లులను మూసివేసిన కేంద్ర ప్రభుత్వం అప్పటి నుంచి వేతనాల్లో సగం మొత్తం మాత్రమే అందజేస్తోంది. అయితే గత ఐదారు నెలల నుంచి ఈ సగం వేతనాలు కూడా నిలిపివేసింది. ఈ రెండేళ్లలో ఉద్యోగ విరమణ పొందిన కార్మికులు, ఉద్యోగులు ఎవ్వరికీ కనీసం గ్రాట్యూటీ కూడా ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో మిల్లులను తిరిగి ప్రారంభించాలని, వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు. మిల్లులను మూసివేసినా కొన్ని తప్పనిసరి నిర్వహణా కార్యకలాపాలు కోసం కొందరు సిబ్బంది ఇప్పటికీ విధులకు హాజరవుతూనేవున్నారు. వారికి కూడా వేతనాలు ఆపేశారు. ఇప్పటికైనా వేతనాలను, ఇతర ప్రయోజనాలను కేంద్రం తక్షణమే చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు.

శరద్ పవార్‌తో అదానీ భేటీ

- ఎన్సీపీ అధినేతతో రెండు గంటల పాటు చర్చ
- ముంబయిలోని శరద్ పవార్ నివాసమే వేదిక



ముంబయి : హిండెన్‌బర్గ్ నివేదికతో అటు వ్యాపారపరంగా, ఇటు రాజకీయంగా తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటున్న గౌతమ్ అదానీ.. ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్‌ను కలిశారు. ముంబయిలోని శరద్ పవార్ ఇంటిలో ఆయనతో భేటీ అయ్యారు. ఆర్థిక అవకతవకలు, స్టాక్ మోసాలకు పాల్పడ్డారని అదానీపై హిండెన్‌బర్గ్ తన నివేదికలో సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ సహా ఇతర పార్టీలు జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) వేయాలని కొంత కాలంగా డిమాండ్ చేస్తున్న విషయం విదితమే. ఇలాంటి తరుణంలో అదానీ.. శరద్ పవార్‌ను కలవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. అయితే అదానీ, శరద్ పవార్‌ల మధ్య భేటీ రెండు గంటలు సాగినట్టు విశ్వసనీయంగా తెలిసింది.

సుప్రీంకోర్టు పర్యవేక్షణలోని బృందంతో అదానీపై విచారణ జరపాలని మొదట్లో శరద్ పవార్ డిమాండ్ చేశారు. అయితే ఆ తర్వాత ఆ డిమాండ్ నుంచి ఆయన కాస్త వెనక్కి తగ్గినట్టుగా కనిపించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షం డిమాండ్ చేస్తున్నట్టుగా జేపీసీకి కూడా తనకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆ తర్వాత తెలిపారు. అదానీ-హిండెన్‌బర్గ్ అంశంపై జేపీసీ వేయాలని ఇటు కాంగ్రెస్.. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ద్వారా నియమించబడిన బృందం ద్వారా దర్యాప్తు జరపాలని, దీని ద్వారానే దర్యాప్తుపై అధికార బీజేపీ ప్రభావం ఉండకుండా నిజాలు బయటకు వచ్చే అవకాశం ఉంటుందని అటు శరద్ పవార్ అనడం.. రాజకీయ వర్గాల్లో కాస్త అనైక్యతకు దారి తీశాయని విశ్లేషకులు తెలిపారు. మహారాష్ట్రలో కాంగ్రెస్, ఎన్సీపీలు మిత్రపక్షాలుగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే, అదానీ అంశంలో శరద్ పవార్ కొంత వెనక్కి తగ్గినట్టుగా కనిపిస్తున్నదని విశ్లేషకులు తెలిపారు. అదానీని 'లక్ష్యంగా' చేసుకుంటూ ఆరోపణలు వచ్చాయని అప్పట్లో ఎన్డీటీవీ(ఈ ఛానెల్ ప్రస్తుతం అదానీ చేతిలో ఉన్నది)కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఎన్సీపీ అధినేత చెప్పారు. దీంతో ఆయన కామెంట్లపై అప్పుడు కొందరు ప్రతిపక్ష నాయకులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మరికొందరు శరద్ పవార్ తీరును తప్పుబట్టారు. ఇప్పుడు అదానీతో భేటీ సైతం ఇలాంటి అనుమానాలకు బలం చేకూరుస్తున్నదని రాజకీయ విశ్లేషకులు, నిపుణులు అభిప్రాయపడ్డారు.

ఉక్రెయిన్‌లో నాటో చీఫ్ ఆకస్మిక పర్యటన

- నాటో సభ్యత్వం కోసం జెలెన్‌స్కీ విజ్ఞప్తి

కీవ్ : రష్యా అధ్యక్షుడు పుతిన్ ఉక్రెయిన్‌లోని రష్యన్ మిలిటరీ కేంద్రాన్ని సందర్శించి, అక్కడి పరిస్థితిని మదింపు వేసిన రెండు రోజులకే నాటో చీఫ్ జెన్స్ స్టాల్టెన్‌బర్గ్ ఉక్రెయిన్‌లో ఆకస్మిక పర్యటన జరిపారు. ఒక వైపు రష్యాకు వ్యతిరేకంగా స్వీడన్, ఉక్రెయిన్‌లకు అమెరికా నేతృత్వంలోని నాటో కూటమిలో సభ్యత్వం ఇచ్చేందుకు యత్నాలు జరుగుతున్న సమయంలో నాటో చీఫ్ ఈ పర్యటనకు రావడం గమనార్హం. రష్యాకు వ్యతిరేకంగా ఆ దేశ సరిహద్దులను ముట్టడించేందుకు నాటో చేస్తున్న యత్నాలను రష్యా సైన్యం దీటుగా తిప్పికొడుతోంది. ఉక్రెయిన్‌లో అమెరికా, నాటో దళాల పరిస్థితిని అంచనా వేసేందుకు స్టాల్టెన్‌బర్గ్ ఇక్కడకు వచ్చారు. ఉక్రెయిన్ సంక్షోభం తలెత్తిన తరువాత స్టోల్టెన్‌బర్గ్ కీవ్‌ను సందర్శించడం ఇదే మొదటిసారి. రష్యాతో సైనిక ఘర్షణల్లో మరణించిన సైనికులకు ఆయన నివాళులర్పించారు. జులైలో జరిగే నాటో సమావేశానికి ఉక్రెయిన్‌ను ఆయన ఆహ్వానించడం, ఆ వెంటనే అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆయనకు కృతజ్ఞతలు తెలపడం చకచకా జరిగిపోయాయి.ఉక్రెయిన్‌కు తమ సైనిక మద్దతు నిరంతరం ఉంటుందని స్టాల్టెన్‌బర్గ్ తెలిపారు.

కొలీజియం సిఫార్సు బుట్టదాఖలు !

- బిజెపి నేతలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయమని ఆదేశించిన జడ్జి
- అది మనసులో పెట్టుకొనే సిఫార్సును తొక్కిపెట్టిన కేంద్రం
- చేసేదేమీ లేక వెనక్కి తీసుకున్న సుప్రీం



న్యూఢిల్లీ : ఒరిస్సా హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ ఎస్. మురళీధర్‌ను మద్రాస్ హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలంటూ ఆరు నెలల క్రితం కేంద్ర ప్రభుత్వానికి తాను చేసిన సిఫార్సును సుప్రీంకోర్టు కొలీజియం వెనక్కి తీసుకుంది. తన సిఫార్సును కేంద్రం ఆమోదించకపోవడం, జస్టిస్ మురళీధర్ మరో నాలుగు నెలలలోనే పదవీవిరమణ సమీపిస్తుండటంతో కొలీజియం ఈ నిర్ణయానికి వచ్చింది. జస్టిస్ మురళీధర్ ఆగస్ట్ 4వ తేదీన పదవీవిరమణ చేయాల్సి ఉంది. గత సంవత్సరం సెప్టెంబర్ 28వ తేదీ నుండి కేంద్ర ప్రభుత్వం తను సిఫార్సును పెండింగ్‌లో ఉంచిందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ ఎస్‌కె కౌల్, కేఎం జోసఫ్, ఎంఆర్ షా, అజయ్ రస్తోగీతో కూడిన సుప్రీం కొలీజియం గుర్తించింది. ఒకవేళ ఇప్పటికిప్పుడు జస్టిస్ మురళీధర్‌ను మద్రాస్ హైకోర్టుకు పంపినా ఆయన ఆరు నెలల పాటు కూడా అక్కడ పదవిలో ఉండే అవకాశం లేదని అభిప్రాయపడింది. దీంతో ప్రస్తుతం బాంబే హైకోర్ట్ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ ఎస్‌వీ గంగాపుర్వాలాను మద్రాస్ హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని కొలీజియం సిఫార్సు చేసింది.

హైకోర్ట్ న్యాయమూర్తులను బదిలీ చేయాలన్న సిఫార్సును కేంద్రం 10 రోజులలో ఆమోదించని పక్షంలో కొలీజియం తన సిఫార్సును వెనక్కి తీసుకుంటుందని ఫిబ్రవరి 3న జస్టిస్ కౌల్ నేతృత్వంలోని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. కాగా జస్టిస్ మురళీధర్ నియామకానికి కేంద్రం మోకాలడ్డడానికి బలమైన కారణమే ఉందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. జస్టిస్ మురళీధర్ ఢిల్లీ హైకోర్ట్ న్యాయమూర్తిగా ఉన్నప్పుడు ఆయన నేతృత్వంలోని బెంచ్ 2020 ఫిబ్రవరి 26న ఢిల్లీ పోలీసులపై మండిపడింది. ఢిల్లీ అల్లర్లకు దారితీసేలా విద్వేషపూరిత ప్రసంగాలు చేసిన బీజేపీ నేతలు కపిల్ మిశ్రా, అనురాగ్ ఠాకూర్ (ప్రస్తుత కేంద్ర మంత్రి), ఎంపీ పర్వేష్ సాహెబ్ సింగ్ వర్మలపై ఎందుకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ప్రశ్నించింది. రెచ్చగొట్టే ప్రసంగాలతో కూడిన వీడియో క్లిప్పింగులను చూసి, ఎఫ్ఐఆర్ నమోదుపై నిర్ణయం తీసుకోవాలని ఢిల్లీ పోలీస్ కమిషనర్‌ను ఆదేశించింది. అయితే అదే రోజు రాత్రి జస్టిస్ మురళీధర్‌ను కేంద్రం పంజాబ్ హర్యానా కోర్టుకు బదిలీ చేసింది. కోర్టు ఆదేశించినప్పటికీ బీజేపీ నేతలపై ఎలాంటి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయలేదు.

మీకోసం

కూరల్లో, పులుసుల్లో ఉప్పు, కారం ఎక్కువైతే రెండు చెంచాల వేయించిన శనగపిండిని కలుపుకోవాలి.

జీవన సౌరభం

నిరంతరం వెలిగే సూర్యుణ్ణి చూసి చీకటి భయపడినట్లే.. నిరంతరం శ్రమించే వాడిని చూసి ఓటమి భయపడుతుంది.

ఆశాజీవి

ఎడారిలో ఒంటె చూడు
ఎలా నడుస్తున్నదో!
బ్రహ్మజెముడు మొక్క చూడు
ఎలా బతుకుతున్నదో!
నిప్పులు చెరిగిన ఎండను
లెక్కచేయలేదెప్పుడు!
ఉప్పెనలా లేచు యిసుక
ముప్పును కని జడువలేదు!

హిమఖండంపైన తిరుగు
ఎలుగ్గొడ్డు తీరు చూడు!
కిమకిమమని పెంగ్వింగులు
కేళిచేసి తిరుగుచూడు!
గడ్డకట్టి వీచుచుండు
సుడిగాలికి వెరుపు లేదు!

ఆశావాదం మనిషికి
ఔషధమై పనిచేయును
నిరాశాజ్వాలలెపుడు
నిన్నుగాల్చ ముందుండును!

- కిలపర్తి దాలినాయుడు

చుక్కలు కలపండి



చిన్నారులూ , ఇక్కడ అంకెలు, సంఖ్యల దగ్గర చుక్కలను ఒకదాని తర్వాత ఒకటి కలపండి. ఏ బొమ్మ వచ్చిందో చూడండి.

నేను గీసిన బొమ్మ

ఇనియల్,
3వ తరగతి,
ఎన్.ఎస్.ఎం. పబ్లిక్ స్కూలు,
పటమట,
విజయవాడ.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఉద్యోగం లేక పిచ్చివాడినయ్యా..

1998లో ఉపాధ్యాయ పరీక్షలో ఉత్తీర్ణత అయ్యి, అర్హత సాధించిన వారిలో అల్లక కేదారేశ్వరరావు ఒకరు. కొన్ని ఏళ్ల పాటు న్యాయం కోసం పోరాటం చేసి అలసిపోయాడు. ఉద్యోగం కోసం ఎదురుచూసి చూసి... విసిగిపోయాడు. వేరే ఉద్యోగంలో ఇమడలేకపోయాడు. ఉద్యోగం రాలేదన్న బాధలో నిరాశ, నిస్పృహతో మానసికంగా కుంగిపోయాడు. ఉపాధి లేక పేదరికంతో తల్లిని కోల్పోయాడు. చెల్లిని చూసుకోలేకపోయాడు. ఎన్నో అవమానాలు, హేళనలు భరించాడు. ఇక ఎప్పటికీ టీచర్‌గా తనని తాను చూసుకోలేను అనుకున్నాడు. కానీ ఇన్నాళ్లకు తన కల నెరవేరడంతో కేదారేశ్వరరావు ఆనందానికి అవధులు లేవు. ఈ భావోద్వేగాన్ని తన మాటల్లో...

'మాది శ్రీకాకుళం జిల్లా , పాతపట్నం మండలం సీధీ గ్రామం. నాన్న నా చిన్నతనంలో చనిపోయాడు. దాంతో అమ్మ కుటుంబ బాధ్యతలు తీసుకుంది. పేద కుటుంబం. ఆస్తులు ఏమీ లేవు. చదువుకుంటే భవిష్యత్తు బాగుంటుం దని అమ్మ అనుకుంది. చదువులో నా మార్కులు చూసి అమ్మ చాలా సంతోషించేది. అప్పు చేసి మరీ మా ఖర్చులు భరించింది. 1992లో అన్నామలై విశ్వవిద్యాలయంలో బిఈడి పూర్తి చేశా. టీచర్ ఉద్యోగం సంపాదించాలన్న పట్టుదలతో రాత్రింబవళ్లు కష్టపడ్డా. 1998లో డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించా. ఇంటర్వ్యూ కూడా పూర్తి చేశా. ఉద్యోగం తప్పకుండా వస్తుందని ఆశగా ఎదురుచూశా. కాని అప్పటి ప్రభుత్వం పోస్టులను కుదించేసి, తక్కువ సంఖ్యలో భర్తీ చేసింది. ఆవేదన చెందా. నాలాగే ఎంతో మంది అభ్యర్థులు న్యాయపోరాటానికి దిగారు. నేనూ వాళ్లతో పాటు పోరాటంలో పాల్గొన్నా. అధికారులు చుట్టూ తిరిగి, తిరిగి విసిగిపోయా.

అమ్మ మరణం..

సంవత్సరాలు గడిచే కొద్దీ ఇల్లు గడవడం కష్టం అయ్యింది. ఏదైనా ప్రయివేటు స్కూల్లో చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యా. ఉద్యోగ ప్రయత్నాలు విఫలమయ్యాయి. దాంతో హైదరాబాద్‌కు వెళ్లా. అక్కడ అన్నీ కొనుక్కోవడమే. దాంతో తిండి లేక మంచినీళ్లు తాగి గడిపిన రోజులే ఎక్కువ. ఓ బట్టల దుకాణంలో పనికి కుదిరా. పిల్లలకు పాఠాలు చెప్పాల్సిన వాడు ఇలా పని చేస్తున్నాడంటూ చాలా మంది నవ్వుకునేవారు. ఆ మాటలు నన్ను ఎంతగానో బాధించేవి. అప్పు చేసి చెల్లికి పెళ్లి చేసి పంపించాం. కాని ఆమెకు పుట్టినింటి నుంచి జరిగే లాంఛనాలు ఏమీ చేయలేకపోయాం. నా నిరుద్యోగం మరింత పేదరికంలోకి నెట్టింది. అమ్మ పని చేసి చేసి అనారోగ్యానికి గురైంది. ఆమెకు సరైన వైద్యం, ఆహారం అందించలేకపోయా. బంధువులు సాయం చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ఎవరైనా అప్పు ఇచ్చినా...తిరిగి తీర్చలేని స్థితిలో నేను ఉన్నానని అందరికీ అర్థమయ్యింది. అమ్మ చనిపోవడంతో మానసికంగా కుంగిపోయా. ఒంటరివాడినయ్యా. అందరూ పెళ్లి చేసుకోమని చెప్పారు. కానీ ఉద్యోగం లేకుండా భార్యను ఎలా పోషించాలి. అందుకే చేసుకోలేదు.

ఎందుకింత జాప్యం?

తిరిగి ఊరికి వచ్చా. జీవనం కోసం ఊరూరా తిరిగి సైకిల్ మీద బట్టలు అమ్మాను. ఈ వ్యాపారంలో పెట్టుబడి పెట్టాలి. అంత డబ్బు లేక వ్యాపారం సరిగ్గా సాగలేదు. ఒక్కోరోజు ఖాళీ కడుపుతోనే పడుకునే వాడిని. నా దుస్థితి చూసి ఊరిలో జనం అన్నం పెట్టేవారు. సంవత్సరాలు గడిచేకొద్దీ నా పరిస్థితి మరింత దిగజారి పోయింది. ఇల్లు పాతది కావడంతో గోడలు పడిపోయాయి. కప్పు కూలిపోయింది. డబ్బులేక బాగుచేయించలేదు. ఎప్పటికైనా ప్రభుత్వ టీచర్ ఉద్యోగం వస్తుందని ఎదురుచూశా. మా ఊరికి వచ్చిన ప్రతి రాజకీయ నాయకులను అర్థించా. అధికారులనూ కలిసి అడిగా. ఏం లాభం లేకపోయింది. నా అవతరం చూసి 'ఉద్యోగం రాకపోవడంతో పిచ్చివాడు అయ్యాడు' అనుకునేవారు. కోర్టులో ఇన్ని సంవత్సరాలు కేసు నడుస్తోంది. ఫలితం ఉంటుందా? ఉండదా? ఉద్యోగం వస్తుందా? అనే ఆలోచనలు నన్ను వదిలేవి కావు. ఎక్కడికెళ్లినా ఉద్యోగం లేదని చిన్నచూపు చూసేవారు. అవమానాలు పడ్డా. ఎందుకు బతుకుతున్నానో అర్థమయ్యేది కాదు. పెరిగిన జుట్టు, గడ్డం, చినిగిన బట్టలు చూసి జనం జాలి చూపేవారు. ఎంతో మానసిక క్షోభ అనుభవించా. చివరకు 57 ఏళ్ల వయసులో ఉద్యోగ అవకాశం వచ్చింది. ఈ విషయం కూడా ఊరి జనం చెప్పారు. నాకు క్షవరం చేయించి, కొత్తబట్టలు కుట్టించి ఇచ్చారు. కేక్ కట్ చేయించి సంబరాలు చేశారు. చాలా సంతోషంగా ఉంది.'

కేదారేశ్వరరావు జీవితమే కాదు... ఇటువంటి ఎంతో మంది నిరుద్యోగులకు సకాలంలో ఉద్యోగాలు లేక ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. పేదరికంలోకి నెట్టబడుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వాలు కళ్లు తెరవాలి. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి.

వేసవిలో జుట్టు సంరక్షణ ఇలా..

వేసవి కాలంలో జుట్టు ఆరోగ్యం క్రమంగా దెబ్బతింటుంది. ఎండ వేడి నేరుగా తలకు తగలడం వల్ల చెమట ఎక్కువగా పడుతుంది. దీంతో చుండ్రు సమస్య కూడా అధికమవుతుంది. సమ్మర్‌లో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే.. జుట్టును ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని నిపుణులు అంటున్నారు. అవేంటో చూద్దాం..

- బయటకు వెళ్లేప్పుడు.. జుట్టును స్కార్ఫ్ లేదా క్యాప్‌తో కవర్ చేసి ఉంచండి.
- కొంతమంది ఎండ వేడి తట్టుకోలేక, రోజూ తలస్నానం చేస్తూ ఉంటారు. దీనివల్ల జుట్టులోని తేమ, నూనెలు తొలగిపోయి జుట్టు నిర్జీవంగా తయారవుతుంది. కాబట్టి వీలైనంత వరకు తక్కువసార్లు తలస్నానం చేయాలి.
- జుట్టు కుదుళ్లు బలంగా తయారయ్యేందుకు గోరువెచ్చని నూనెతో మర్దన చేయాలి.
- సాధారణంగా పొడవాటి జుట్టు ఉన్నవారికి వేసవి వేడి వాతావరణంలో జుట్టుపై శ్రద్ధ పెట్టడం పెద్ద సమస్య. కాబట్టి పొడవు జుట్టు ఉన్న వారు జుట్టు రాలకుండా, చిట్లకుండా ఉండేలా పైకి టై చేసుకోవాలి.
- సముద్రం, ఈత కొలనుల్లో స్నానాలు చేసినప్పుడు జుట్టు పొడిబారుతుంది. బలహీనంగా, పెళుసుగా మారుతుంది. కాబట్టి అటువంటిచోట స్నానం చేసిన తరువాత మంచి నీళ్లతో మరోసారి తలస్నానం చేయాలి.
- వేడినీటి స్నానం శరీరానికే కాదు, జుట్టుకు కూడా మంచిదే. అయితే వేడినీటి స్నానం తరువాత చివరగా జుట్టును చల్లటి నీటితో కడగాలి. ఇలా చేస్తే.. జుట్టుకు బలం పెరిగి మెరుపుగా తయారవుతుంది.
- అలాగే తలస్నానం చేసిన తరువాత జుట్టును తుడిచేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. తడి ఆరాలని అదే పనిగా గట్టిగా రుద్దకూడదు. మెల్లగా తుడవాలి.
- ఎండలో బయటకు వెళ్లేటప్పుడు జుట్టుకు లేదా మాడుకు సన్‌స్క్రీన్ లోషన్ రాయాలి.
- సన్‌స్క్రీన్ లోషన్ రాసుకున్నప్పుడు రాత్రి పడుకోబోయే ముందు తలస్నానం చేయాల్సి ఉంటుంది. అలా సాధ్యం కానప్పుడు ఆ లోషన్లకు బదులు కొబ్బరి నూనెతో మర్దనా చేయాలి.
- వేసవికాలంలో జుట్టుకు నిమ్మరసం వాడినట్లయితే మరింత నిర్జీవంగా మారే ప్రమాదం ఉంది. కాబట్టి కాఫీ డికాషన్ లాంటి కండీషనర్లను వాడటం మంచిది.

నిప్పులు చెరిగిన సిరాజ్



కోహ్లి-డుప్లెసిస్ సెంచరీ భాగస్వామ్యం
పంజాబ్‌పై 24 పరుగుల తేడాతో బెంగళూరు గెలుపు

మొహాలీ: ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్)లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) మూడో విజయాన్ని నమోదు చేసుకుంది. తొలుత బెంగళూరు ఓపెనర్లు డుప్లెసిస్-కోహ్లి బ్యాటింగ్‌లో రాణించడంతో ఆ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 174పరుగులు చేసింది. ఛేదనలో పంజాబ్ జట్టు 18.2ఓవర్లలో 150పరుగులకే కుప్పకూలింది. హైదరాబాద్ పేసర్ మహ్మద్ సిరాజ్ నాలుగు వికెట్లు తీసి పంజాబ్‌ను దెబ్బకొట్టాడు.

కోహ్లి-డుప్లెసిస్ సెంచరీ భాగస్వామ్యం..

టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరుకు ఓపెనర్లు కెప్టెన్ డూప్లెసిస్, విరాట్ కోహ్లీ సెంచరీ భాగస్వామ్యాన్ని అందించారు. వీళ్లిద్దరూ కలిసి తొలి వికెట్‌కు 137 పరుగులు జతచేశారు. డుప్లెసిస్(84; 56బంతుల్లో 5ఫోర్లు, 5సిక్సర్లు), కోహ్లి(59; 47బంతుల్లో 5ఫోర్లు, సిక్సర్) తొలి వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యం అందించారు. వీరిద్దరి నిష్క్రమణ తర్వాత బెంగళూరు స్కోర్ నెమ్మదించింది. మ్యాక్స్‌వెల్(0), దినేశ్ కార్తీక్(7), లామ్రోర్(7నాటౌట్), షాబాజ్(5నాటౌట్) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. పంజాబ్ బౌలర్లలో హర్‌ప్రీత్ బ్రార్ రెండు వికెట్లు, ఎల్లిస్, అర్షదీప్ సింగ్ ఒక్కో వికెట్ దక్కాయి.

పంజాబ్ విల విల..

ఛేదనలో పంజాబ్ జట్టు ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్(46) రాణించినా.. అథర్వ(4) నిరాశపరిచాడు. ఆ తర్వాత షార్ట్(8), లివింగ్‌స్టోన్(2) వెంట వెంటనే ఔటవ్వడంతో పంజాబ్ జట్టు 43పరుగులకే 4వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. కోట్లాది రూపాయలు కుమ్మరించి కొనుగోలు చేసిన సామ్ కర్రన్(10)తోపాటు షారుక్(7) విఫలం, చివర్లో జితేశ్ శర్మ(41) ఒంటరి పోరాటం మాత్రమే మిగిలాయి. ఇక పంజాబ్ జట్టు బ్యాటింగ్ ఆర్డర్‌ను పేసర్ మహ్మద్ సిరాజ్ దెబ్బకొట్టాడు. 4 ఓవర్లలో 21 పరుగులిచ్చి నాలుగు వికెట్లు తీసాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సిరాజ్‌కు లభించింది.

స్కోర్‌బోర్డు...

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (సి)జితేశ్ శర్మ (బి)హర్‌ప్రీత్ బ్రార్ 59, డుప్లెసిస్ (సి)సామ్ కర్రన్ (బి)నాథన్ ఎల్లిస్ 84, మ్యాక్స్‌వెల్ (సి)అథర్వ (బి)హర్‌ప్రీత్ బ్రార్ 0, దినేశ్ కార్తీక్ (సి)అథర్వ (బి)ఆర్షదీప్ 7, లామ్రోర్ (నాటౌట్) 7, షాబాజ్ (నాటౌట్) 5, అదనం 12. (20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 174పరుగులు. **వికెట్ల పతనం:** 1/137, 2/137, 3/151, 4/163 **బౌలింగ్:** ఆర్షదీప్ 4-0-34-1, హర్‌ప్రీత్ బ్రార్ 3-0-31-2, నాథన్ ఎల్లిస్ 4-0-41-1, సామ్ కర్రన్ 4-0-27-0, రాహుల్ చాహర్ 4-0-24-0, లివింగ్‌స్టోన్ 1-0-9-0

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: అథర్వ (ఎలబి)సిరాజ్ 4, ప్రభ్‌సిమ్రన్ సింగ్ (బి)పార్నెల్ 46, షార్ట్ (బి)హసరంగ 8, లివింగ్‌స్టోన్ (ఎల్‌బి)సిరాజ్ 2, హర్‌ప్రీత్ సింగ్ (రనౌట్) సిరాజ్ 13, సామ్ కర్రన్ (రనౌట్) హసరంగ 10, జితేశ్ శర్మ (సి)షాబాస్ (బి)హర్షల్ 41, షారుక్ ఖాన్ (స్టంప్) కార్తీక్ (బి)హసరంగ 7, హర్‌ప్రీత్ బ్రార్ (బి)సిరాజ్ 13, ఎల్లిస్ (బి)సిరాజ్ 1, ఆర్షదీప్ సింగ్ (నాటౌట్) 0, అదనం 5. (18.2 ఓవర్లలో ఆలౌట్) 150పరుగులు. **వికెట్ల పతనం:** 1/4, 2/20, 3/27, 4/43, 5/76, 6/97, 7/106, 8/147, 9/149, 10/150 **బౌలింగ్:** సిరాజ్ 4-0-21-4, పార్నెల్ 3-0-32-1, హసరంగ 4-0-39-2, విజయ్ కుమార్ 3-0-29-0, మ్యాక్స్‌వెల్ 1-0-5-0, హర్షల్ పటేల్ 3.2-0-22-1.

ఫైనల్‌కు పురుషుల రికర్వ్ జట్టు

ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-1

అంటల్యా(టర్కీ): భారత పురుషుల ఆర్చరీ జట్టు ప్రపంచకప్ స్టేజ్-1 ఫైనల్లోకి దూసుకెళ్లింది. అతాను దాస్, బి. ధీరజ్, తరుణ్ దీప్‌రాయ్‌లతో కూడిన భారత బృందం సెమీస్‌లో 5-4 తేడాతో జపాన్‌పై గెలిచింది. నాల్గో ర్యాంకర్‌గా బరిలోకి దిగిన పురుషుల బృందానికి తొలిరౌండ్‌లో బై లభించగా.. క్వార్టర్‌ఫైనల్లో చైనీస్ తైపీపై 6-2తో, ప్రి క్వార్టర్స్‌లో నెదర్లాండ్స్‌పై 6-2తో గెలిచి సెమీస్‌కు చేరింది. ఇక ఉత్కంఠభరితంగా సాగిన సెమీస్‌లో భారత్ షూట్-ఆఫ్‌లో 5-4(29-28)తో జపాన్‌పై సంచలన విజయం సాధించి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. ఆదివారం జరిగే ఫైనల్లో భారతజట్టు చైనాతో తలపడనుంది. ఇక మహిళలజట్టు షూట్-ఆఫ్‌లో 5-4(24-19)తో బ్రెజిల్‌ను ఓడించినా.. స్పెయిన్ చేతిలో 2-6 తేడాతో ఓడి ఫైనల్‌కు చేరలేకపోయింది.

పాయింట్ల పట్టిక

ఫ్రాంచైజీ	మ్యా	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	6	4	2	8	+1.04
లక్నో	6	4	2	8	+0.70
చెన్నై	5	3	2	6	+0.26
గుజరాత్	5	3	2	6	+0.19
బెంగళూరు	6	3	3	6	-0.06
ముంబయి	5	3	2	6	-0.16
పంజాబ్	6	3	3	6	-0.29
కోల్‌కతా	6	2	4	4	+0.19
హైదరాబాద్	5	2	3	4	-0.79
ఢిల్లీ	6	1	5	2	-1.18

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర: నెట్‌రన్‌రేట్

ఐపిఎల్‌లో నేడు..

చెన్నై × హైదరాబాద్
(వేదిక: చెన్నై; రా.7.30గం॥లకు)

కొత్త కథల వేటలో మెగాస్టార్

చిరంజీవి ప్రస్తుతం మెహర్ రమేష్ దర్శకత్వంలో చేస్తోన్న 'భోళా శంకర్' సినిమాను పూర్తి చేసి వెంటనే మరో సినిమాను పట్టాలెక్కించే పనిలో ఉన్నారు. ఇందుకోసం ఇప్పటికే కథలు సిద్ధం చేయాలని రైటర్స్ దర్శకులకి సూచించినట్లు తెలుస్తోంది. ఈ లిస్టులో రైటర్ డైరెక్టర్ బివిఎస్ఎన్ రవి ఉన్నారని సమాచారం. అలాగే వశిష్ట మల్లిడి దర్శకత్వంలో రీసెంట్‌గా స్టోరీ లైన్ ఒకే చెప్పారని వార్తలు వినిపిస్తున్నాయి. యూవీ క్రియేషన్స్ ఈ మూవీని నిర్మించడానికి సిద్ధం అవుతుందనే టాక్ నడుస్తోంది. అలాగే కళ్యాణ్ కృష్ణ కురసాలకి ఒక కథ సిద్ధం చేయాలని చిరంజీవి సూచించారని సమాచారం. వీరితో పాటు తమిళ్ దర్శకుడు మిత్రన్‌కి కూడా ఒక స్టోరీకి గ్రీన్ ఇచ్చినట్లు టాక్ నడుస్తోంది. ఇంకా ఈ జాబితాలో ప్రసన్నకుమార్ బెజవాడ కూడా ఉన్నారు. ఈ కథల్లో ఏదో ఒకటి సెలక్ట్ చేసుకొని నెక్స్ట్ ప్రాజెక్ట్ సెట్స్ పైకి తీసుకొని వెళ్లాలని చిరంజీవి భావిస్తున్నారని ఇండస్ట్రీ వర్గాల నుండి వినిపిస్తోంది. వీటిలో ఏది ముందు ఉంటుందనేది భోళా శంకర్ రిలీజ్ తర్వాత క్లారిటీ రావొచ్చని అంచనా వేస్తున్నారు.

ఓటీటీలోకి 'దసరా'

నాని, కీర్తి సురేష్ జంటగా నటించిన 'దసరా' చిత్రం ఓటీటీలో సందడి చేయడానికి సిద్ధమైంది. నెట్‌ఫ్లిక్స్‌లో ఏప్రిల్ 27 నుంచి స్ట్రీమింగ్ కాబోతోందని సదరు యాజమాన్యం ప్రకటించింది. మార్చి 30న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా నాని మొట్టమొదటి పాన్ ఇండియా సినిమాగా విడుదలై భారీ ఓపెనింగ్స్ రాబట్టింది. డెబ్యూ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మించారు.

'టు సోల్స్' : ఏ పరిచయమూ యాదృచ్ఛికం కాదు..

యువ దర్శకుడు శ్రావణ్ ఓ సరికొత్త ఫీల్ గుడ్ లవ్ ఎంటర్టైనర్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'టు సోల్స్' అనే డిఫరెంట్ టైటిల్‌తో విజయలక్ష్మి వేలూరి ఈ సినిమాను నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా ఈ రోజు విడుదలౌతోంది. త్రినాథ్ వర్మ, భావన సాగి హీరో హీరోయిన్లుగా నటించిన ఈ సినిమాలో. రవితేజ మహదాస్యం, మౌమిక రెడ్డి ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. మనకు ఎదురయ్యే ఏ పరిచయం కూడా యాదృచ్ఛికం కాదు అనే కథా నేపథ్యంతో గతంలో ఎన్నడూ చూడని ఆసక్తికర ఎలిమెంట్స్ జోడించి ఈ సినిమాను రూపొందించినట్లు తెలుస్తోంది. 'రెండు ఆత్మల మధ్య జరిగే ప్రయాణాన్ని సగటు ప్రేక్షకుడికి ఇంట్రెస్టింగ్ అనిపించేలా తెరకెక్కించాను. అందమైన లొకేషన్స్‌లో షూటింగ్ జరుపుకున్న ఈ చిత్రంలోని డైలాగ్స్ యువ హృదయాలను హత్తుకునేలా ఉంటాయి. ఈ చిత్రానికి ప్రతిక్ అభయంకర్, ఆనంద్ నంబియార్ సంగీతం అందించగా.. శశాంక్ శ్రీరామ్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేశారు' అని దర్శకుడు సినిమా విశేషాలు చెప్పారు.

'ఆదిపురుష్' టీజర్ విడుదల

ప్రభాస్ తీస్తున్న కొత్త చిత్రం 'ఆదిపురుష్'. ఈ ఏడాది ప్రారంభంలోనే ఈ సినిమా రావాల్సి ఉంది. కానీ టీజర్‌కు మిశ్రమ స్పందన రావడంతో వీఎఫ్ఎక్స్ కోసం మరో ఆరు నెలలు సినిమాను పోస్ట్ పోన్ చేశారు. దాదాపు రూ.100 నుంచి రూ.150 కోట్ల ఖర్చుతో మళ్లీ వీఎఫ్ఎక్స్‌ను మెరుగుపరుస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు టీజర్ అప్‌డేట్ వెర్షన్‌ను రిలీజ్ చేశారు. గతంలో రిలీజ్ చేసిన టీజర్‌కు విమర్శలు వచ్చాయి. దాంతో పలు మార్పులు చేసి టీజర్‌ను విడుదల చేశారు. దీంట్లో వీఎఫ్ఎక్స్ వర్క్ కాస్త నేచురల్‌గా అనిపిస్తున్నాయి. కలర్ గ్రేడింగ్‌లో కూడా చాలా వరకు మార్పులు చేసినట్లు కనిపిస్తుంది. ప్రభాస్ ఫ్యాన్స్‌కు టీజర్ నచ్చడంతో మేకర్స్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. రామాయణం ఆధారంగా తెరకెక్కిన ఈ సినిమాకు తన్హాజీ ఫేం ఓంరౌత్ దర్శకత్వం వహించాడు. కృతిసనన్ నటించింది. సైఫ్ అలీఖాన్ లంకాధిపతి రావణాసురుడుగా కనిపించనున్నాడు. జూన్ 16న పాన్ ఇండియా లెవల్లో గ్రాండ్‌గా రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68